అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 18-11-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 268
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar
8 పేజీలు + టాబ్లాయిడ్ 8 పేజీలు వెల : 6.50

మిథిలీ తుఫాన్ ముప్పు
బెంగాల్, ఒడిశాలో హై అలర్ట్..



భువనేశ్వర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారింది. ఇది బంగ్లాదేశ్ తీరం వైపు ప్రయాణిస్తోంది. ఈ తుఫానుకు 'మిథిలీ' అని పెట్టారు. మిథిలీ తుఫాన్ బంగ్లాదేశ్ తీరం వైపు ప్రయాణించి శుక్రవారం రాత్రి సమయంలో బంగ్లాదేశ్‌లోని ఖేపుపరా సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఈ తుఫాన్ ఈశాన్య దిశగా కదులుతున్నట్టు వెల్లడించింది. తుపాన్ తీరం దాటే సమయంలో ...7లో

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే
ఆలోచించి ఓటు వేయకపోతే పదేండ్ల కష్టం బూడిదలోనే
- తలసరి ఆదాయంలో తెలంగాణ నెంబర్ వన్ :ప్రజాశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి/కరీంనగర్/గంగాధర/జమ్మికుంట/వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

'అభ్యర్థి గుణగణాలు, ఆయన మనకు ఏం చేశాడు. గెలిస్తే ఏం చేస్తాడో చూడాలే. అంతకంటే ముఖ్యంగా అయన వెనుక ఉన్న పార్టీ చరిత్రనూ మననం చేసుకోవాలే. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణను అధోగతిపాలు చేసిన చరిత్ర మరువలేనిది. అటువంటిది రాష్ట్రం వచ్చాక ప్రజల ఆశీర్వాదంతో పదేండ్లలో అన్ని రంగాల్లో తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టిన చరిత్ర బీఆర్ఎస్‌ది. దేశంలోనే తలసరి ఆదాయంలో నెంబర్‌వన్‌గా నిలిచినం. తలసరి విద్యుత్ వినియోగంలోనూ అగ్రగామిగా ఉన్నాం. అటువంటిది.. ఎవరో ఏమో చెప్పారని మోసపోయి ఓట్లేస్తే పదేండ్లలో కష్టపడి నిర్మించుకున్న తెలంగాణ ప్రగతి బుడిదలో పోసిన పన్నీరే అవుతుంది. ఆ మోసకారి కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లేస్తే వైకుంఠం ఆటలో పెద్దపాము మింగినట్టే అవుతది..' అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. శుక్రవారం కరీంనరగ్ జిల్లా చొప్పదండి, కరీంనగర్, హుజూరాబాద్, వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభల్లో ప్రసంగించారు. ఒకప్పటి కాంగ్రెస్ పాలనలో తాగు, సాగునీళ్లు లేవని, కరెంటు లేదని, ఎటుచూసినా బీడుపడ్డ భూములు, బొందల గడ్డల్లా మారిన గ్రామాలతో తెలంగాణ అల్లాడిపోయిందన్నారు. ఇదే కరీంనగర్ జిల్లా చొప్పదండిలోని రామచంద్రాపూర్ సర్పంచ్ తిరుపతి సాగునీటి కోసం బోర్లు వేసి వేసి చివరకు అక్కడే ప్రాణాలు విడిచిన ఉదంతం ...7లో

పోరాడే పార్టీకే ఓటెయ్యాలి
ఇండ్లు, రేషన్‌కార్డులిచ్చింది ఎర్రజెండా వల్లనే..
- ప్రజల పక్షాన పోరాడేది సీపీఐ(ఎం) మాత్రమే
- కమ్యూనిస్టులకు ఓటేస్తే అది వజ్రాయుధమవుతుంది : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు
- ముషీరాబాద్‌లో పాదయాత్రకు విశేష స్పందన

వివరాలు 7లో..




మధ్యప్రదేశ్‌లో 71.64 శాతం
ఛత్తీస్‌గఢ్‌లో 68.15 శాతం
ఎంపీలో బరితెగించిన బీజేపీ ..
ఛత్తీస్‌గఢ్‌లో ఐఈడీ పేలి జవాను మృతి



న్యూఢిల్లీ : ఛత్తీస్‌గఢ్‌లో రెండో దశ, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు శుక్రవారం పోలింగ్ నిర్వహించారు. సాయంత్రం 7:30 గంటల సమయానికి మధ్యప్రదేశ్‌లో 71:64 శాతం, ఛత్తీస్‌గఢ్ రెండో దశలో 68.15 శాతం పోలింగ్ నమోదయింది. ఓటర్ టర్నౌట్ యాప్ ద్వారా భారత ఎన్నికల సంఘం ఈ వివరాలను వెల్లడించింది. రెండు రాష్ట్రాల్లోనూ ఓటింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. మధ్యప్రదేశ్‌లో సాయంత్రం 6 గంటలకు, ఛత్తీస్‌గఢ్‌లో సాయంత్రం 5 గంటలకు ఓటింగ్ ముగిసింది. ఈ సమయంలో క్యూలైన్‌ల్లో ఉన్నవారిని ఓటింగ్‌కు అనుమతించినట్లు అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని ధమంతరి జిల్లాలో అత్యధికంగా 79.89 శాతం ఓటింగ్ నమోదు కాగా, రాయ్‌పూర్ జిల్లాలో అత్యల్ప ఓటింగ్ నమోదైంది. మధ్యప్రదేశ్‌లో షాజాపూర్ జిల్లాలో అత్యధికంగా 70.27 శాతం ఓటింగ్ నమోదు కాగా, రాజధాని భోపాల్ అత్యల్పంగా 45.34 శాతం ...5లో



తెలంగాణకు అభయహస్తం
తొలి క్యాబినెట్‌లోనే గ్యారంటీలపై తుది నిర్ణయం
- బైబై కేసీఆర్ అని ప్రజలు నిర్ణయించుకున్నారు
- మోదీ, కేసీఆర్ కలిసి ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ గెలుపును ఆపలేరు
- కాంగ్రెస్ మ్యానిఫెస్టో విడుదల కార్యక్రమంలో ఖర్గే



వివరాలు 5లో..

బీజేపీని కూకటివేళ్లతో పెకిలిస్తాం
కేంద్రంలో కుల గణన చేపడుతాం..
- కాంగ్రెస్ తుఫానులో కేసీఆర్ గల్లంతు
- ఈ ఎన్నికల్లో యుద్ధం బీఆర్ఎస్‌తోనే
- అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలపై తొలి సంతకం : రాహుల్

నవతెలంగాణ-మణుగూరు/ నర్సంపేట/వరంగల్

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, 2024 ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని కూకటి వేళ్లతో పెకిలిస్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ అన్నారు. తెలంగాణలో ఇకపై బీజేపీ కనిపించబోదన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదలను గుర్తించి ప్రతి ఒక్కరికి మేలు చేస్తుందని తెలిపారు. అధికారలోకి రాగానే కేంద్రంలో కులగణన చేపడతామని తెలిపారు. బీసీల రిజర్వేషన్ పెంచుతామన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తోనే తమ ...7లో



ఆరు రోజులు బ్యాంకుల్లో
ఆందోళనలు
- అవుట్‌సోర్సింగ్‌ను నిలిపివేయాలని డిమాండ్
- కొత్త నియామకాలు చేపట్టాలి : ఏఐబీఈఏ

వివరాలు 7లో..

ప్రశ్నల కొడవళ్లు ఈ పాటలు
చట్ట సభల్లో కమ్యూనిస్టుల ఆవశ్యకతను చాటుతున్నాయి
- ప్రజాసమస్యలపై పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించండి:ప్రజానాట్యమండలి పాటల సీడీ ఆవిష్కరణలో ఎస్. వీరయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో రూపొందించిన పాటలు ప్రశ్నల కొడవళ్లుగా ఉన్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య చెప్పారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఎందుకు ఉండాలనే ఆవశ్యకతను ఆ పాటలు నొక్కిచెబుతున్నాయన్నారు. శాసనసభలో గత ఐదేండ్లలో కమ్యూనిస్టులు లేని లోటు స్పష్టంగా కనిపించిందని చెప్పారు. చట్టసభల్లో ఆర్థిక ప్రయోజనాలు, అధికార దాహం కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యులు పరస్పరం తిట్లు, శాపనార్థాలు పెట్టుకుంటున్నారనీ, ప్రజల సమస్యలపై చర్చ సరిగా ఉండట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రూపొందించిన ఎన్నికల ప్రచార పాటల సీడీని ఆయనతో పాటు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి. జ్యోతి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వి.ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ్మా ఆవిష్కరించారు. ఈ ...7లో



తెలంగాణ టూరిజం ఎండీ
మనోహర్ సస్పెన్షన్
కేంద్ర ఎన్నికల సంఘం వేటు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌టీడీసీ) మేనేజింగ్ డైరెక్టర్ బోయినపల్లి మనోహర్ రావుపై వేటు వేసిన ఎన్నికల సంఘం మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఓఎస్డీ సత్యనారాయణను విధుల నుంచి తప్పించింది. టూరిజం శాఖ మంత్రి వెంట ఇద్దరు అధికారులు అక్టోబర్ 15,16 తేదీల్లో తిరుమల తిరుపతి పర్యటనకు వెళ్లారని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్‌కు అందిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపారు. ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉండగా మంత్రులకు గాని ఇతర ప్రజా ప్రతినిధులకు గాని ప్రోటోకాల్ పాటించాల్సిన అవసరం లేదని, మంత్రి వెంట నిబంధనలకు విరుద్ధంగా తిరుపతికి వెళ్లారని ఆయన నివేదికలో పేర్కొన్నారు. మనోహర్ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కేంద్ర ఎన్నికల సంఘం సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనలను ఉల్లంఘించిన ఇద్దరు అధికారులపై ...7లో

అదానీ మెడకు ఉచ్చు..!
- బొగ్గు అక్రమాలపై పున:విచారణ
- సుప్రీంకోర్టును కోరిన డీఆర్ఐ

న్యూఢిల్లీ : అదానీ బొగ్గు దిగుమతుల అక్రమాలపై పున:విచారణ జరపాలని సుప్రీంకోర్టును డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) కోరింది. అదాని బొగ్గు దిగుమతుల్లో అధిక విలువను చూపిందని ప్రధాన అరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి సింగపూర్ నుండి సాక్ష్యాధారాలను సేకరించడానికి వీలు కల్పించాలని డీఆర్ఐ కోరిందని శుక్రవారం రాయిటర్స్ ఓ కథనంలో వెల్లడించింది. ఈ కేసులో అధికారులను విచారించకుండా దిగువ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిఆర్ఐ సుప్రీంను కోరింది. సాక్ష్యాలను సేకరించకుండా అదాని కంపెనీ సంవత్సరాలుగా అడ్డుకున్నట్లు చట్టపరమైన పత్రాలున్నాయని తెలిపింది. బొగ్గు అధిక విలువ దిగుమతులను విచారించడానికి సింగపూర్ సాక్ష్యాలను సేకరించడానికి ఇంతక్రితం ముంబయి హైకోర్టు నిరాకరించింది. దీన్ని సవాల్ చేస్తూ కొన్ని రోజుల క్రితం డిఆర్ఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

సింగపూర్ అధికారుల నుంచి అదానీ లావాదేవీలకు సంబంధించిన కీలక పత్రాలను సేకరించేందుకు డైరెక్టొరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ 2016 నుంచి ప్రయత్నిస్తోంది. ఇండోనేషియా సరఫరాదారుల నుండి దిగుమతి చేసుకున్న బొగ్గు సరుకులను మొదట దాని సింగపూర్ యూనిట్ అయిన అదానీ గ్లోబల్ పీటీఈకి తరలించినట్టు కాగితాలపై చూపించి.. అక్కడి నుంచి అధిక ధరలకు దిగుమతి చేసుకున్నట్లు డీఆర్ఐ పరిశోధనలో వెల్లడయ్యింది. బొగ్గు దిగుమతులకు సంబంధించిన పత్రాలను గౌతం అదానీ అనుబంధ కంపెనీలు ఇవ్వడానికి పదే పదే నిరాకరిస్తున్నాయని డీఆర్ఐ ఆరోపిస్తోంది. ఈ విషయమై డీఆర్ఐ ...7లో





ఉన్నత చదువుల్లో అమ్మాయిలు అదుర్స్
అబ్బాయిల కన్నా 5.68 శాతం అధికం
- డిగ్రీలో మిగిలిన సీట్లు 1.84 లక్షలు
- 52.61 శాతం సీట్లు భర్తీ
- బీకాంలో చేరిన ఎక్కువ మంది విద్యార్థులు

వివరాలు 5లో..



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	61,690	▲ 650
22 క్యారెట్లు	56,550	▲ 600
కిలో వెండి	79,500	▲ 1500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 97
రిటైల్ (లైవ్)	రూ. 119
స్కిన్‌తో	రూ. 173
స్కిన్‌లెస్	రూ. 196

కేరళపై కేంద్రం చిన్నచూపు

మోడీ సర్కార్ ఆర్థిక నిర్లక్ష్యంపై పోరుకు సిద్ధమవుతున్న లెఫ్ట్ సర్కార్

- సీఎం సహా మంత్రులు, ప్రజాప్రతినిధులతో ఢిల్లీ వేదికగా జనవరిలో ఆందోళన
- డిసెంబరులో రాష్ట్ర వ్యాప్త నిరసనలు
- బీజేపీయేతర రాష్ట్రాలతో చర్చించి ఆందోళనకు నాయకత్వం వహిస్తాం : ఎల్‌డీఎఫ్ కన్వీనర్



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న ఆర్థిక నిర్లక్ష్యంపై కేరళ ప్రభుత్వం పోరుకు సిద్ధపడింది. కేరళతో పాటు బీజేపీయేతర రాష్ట్రాలపై మోడీ సర్కార్ అవలంబిస్తున్న వివక్షకు వ్యతిరేకంగా ఢిల్లీ వేదికగా జనవరిలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఆందోళనకు దిగనున్నారు. అంతేకాకుండా వివక్షకు గురవుతున్న బీజేపేతర రాష్ట్రాలకు నాయకత్వం వహించేందుకు సిద్ధమవుతున్నది. కేరళ పట్ల చిన్నచూపు చూస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పేందుకు డిసెంబరులో రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టేందుకు ఎల్‌డీఎఫ్ శ్రీకారం చుట్టింది.

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ, ప్రజల అవసరాలకు మొదటి స్థానం ఇస్తూ దేశ రాజధానికి కేరళ పోరాటాన్ని విస్తరిస్తామని ఎల్‌డీఎఫ్ కన్వీనర్ ఈపీ జయరాజన్ తెలిపారు. కేరళలోని తిరువనంతపురంలో జరిగిన వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డీఎఫ్) సమావేశం అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈపీ జయరాజన్ మాట్లాడారు. రాష్ట్ర డిమాండ్‌ల సాధన కోసం జనవరిలో ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఢిల్లీలో ఆందోళన చేపడతామన్నారు. "బీజేపీయేతర రాష్ట్రాలను కేంద్రం నిర్లక్ష్యం చేస్తూనే ఉంది. ఇతర రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి సంఘటిత ఆందోళనకు నాయకత్వం వహిస్తాం ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్‌కు ఇతర రాష్ట్రాలతో మాట్లాడే బాధ్యతను అప్పగించాం. కేరళకు రూ. 58,000 కోట్లు కేంద్ర సాయం బకాయిలున్నాయి. దీనిపై గళం ఎత్తేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఎంపీలు సిద్ధంగా లేరు" అని తెలిపారు. "డిసెంబర్‌లో రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యక్రమాలు విస్తృత స్థాయిలో నిర్వహించబడతాయి. కేంద్ర నిర్లక్ష్య వైఖరిని నిరసించేవారంతా ఇందులో పాల్గొంటారు. రైల్వే రంగంపైనా కేంద్ర నిర్లక్ష్యం కొనసాగుతున్నది. వాగ్దానం చేసిన పథకాలు అమలు కావడంలేదు. వందేభారత్ రాకతో ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త కోచ్‌లను అనుమతించాలని, కేరళపై నిర్లక్ష్యానికి ముగింపు పలకాలి. రబ్బరు రంగంలో నెలకొన్న సమస్యలను ఎత్తిచూపుతూ డిసెంబర్‌లో కొట్టాయంలో రైతు సమ్మేళనం నిర్వహించనున్నాం. రైతుల సమ్మెను ఇతర రబ్బరు రైతుల సంఘాలతో సంప్రదించి మరింత బలోపేతం చేస్తాం. భూసేకరణ చట్టం బిల్లుపై సంతకం చేయనందుకు నిరసనగా రైతుల రాజ్‌భవన్ మార్చ్ నిర్వహించనున్నారు" అని తెలిపారు. విద్యారంగంలో కేంద్రం అనుసరిస్తున్న తిరోగమన విధానాలకు వ్యతిరేకంగా సంఘీభావం పెంచుతామన్నారు. సమ్మె తేదీలను తర్వాత ప్రకటిస్తామని చెప్పారు.



కదంతొక్కిన ఆదివాసీలు

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జార్ఖండ్‌లో వేలాది మంది ర్యాలీ

న్యూఢిల్లీ : అమరవీరుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని జార్ఖండ్‌లోని రాంచీ జిల్లాలోని ఖుండులో ఆదివాసీలు శుక్రవారం కదంతొక్కారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వేలాది మంది ర్యాలీ నిర్వహించారు. అందులో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బహిరంగ సభలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు, ఏఐకేఎస్ అధ్యక్షుడు డాక్టర్ అశోక్ ధావలే పాల్గొన్నారు. సీపీఐ(ఎం) జార్ఖండ్ రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ విప్లవ్, సీపీఐ(ఎం), సీఐటీయూ, ఏఐకేఎస్, ఐద్వా నాయకులు సురేష్ ముండా, సుఫల్ మహతో, రంగోవతి దేవి, సుఖ్‌నాథ్ లోహారా, భవన్ సింగ్, వీణా లిండా తదితరులు ప్రసంగించారు.

రెండు రోజుల క్రితం జార్ఖండ్‌లో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోడీ ఆదివాసీల హక్కుల గురించి కనీసం ప్రస్తావన కూడా చేయలేదని విమర్శించారు. ఆదివాసీల భూమిని కార్పొరేట్‌లకు స్వాధీనం చేసుకునేందుకు వీలుగా అటవీ సంరక్షణ చట్టంలో తిరోగమన గిరిజన వ్యతిరేక సవరణలు చేశారని దుయ్యబట్టారు. విపరీతమైన ధరల పెరుగుదల, నిరుద్యోగానికి దారితీసిన బీజేపీ విధానాలను, దేశాన్ని కార్పొరేట్‌లకు అమ్మే ప్రయత్నం, ప్రజలను మతం, కులాల ప్రాతిపదికన విభజించే మతతత్వ కుట్రను కూడా నేతలు బహిర్గతం చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని, వామపక్షాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

బిజినెస్

వ్యక్తిగత రుణాలపై పెద్ద ప్రభావముండదు

- ఆర్‌బీఐ కొత్త నిబంధనలపై ఎస్‌బీఐ ఛైర్మన్



న్యూఢిల్లీ : వ్యక్తిగత రుణాల జారీలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించిన నూతన నిబంధనలు తమ బ్యాంక్‌పై స్వల్ప ప్రభావం మాత్రమే చూపనున్నాయని ఎస్‌బీఐ ఛైర్మన్ దినేష్ ఖారా పేర్కొన్నారు. పైగా తమ బ్యాంక్ మూలధన నిష్పత్తి పెరగనుందన్నారు. ఎస్‌బీఐ వద్ద తగినన్ని రిజర్వులు ఉన్నాయని.. కొత్త నిధుల సమీకరణ కూడా అవసరం లేదన్నారు. బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు జారీ చేసే వ్యక్తిగత, క్రెడిట్ కార్డ్ రుణాల నిబంధనలను కఠినతరం చేస్తూ ఆర్‌బీఐ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. హామీలేని వ్యక్తిగత రుణాలకు రిస్క్ వెయిట్‌ను 25 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. ఈ సవరించిన నిబంధనలు గృహ, విద్య, వాహన, బంగారం తనఖా రుణాలకు వర్తించవు. ఈ రుణాలకు యథాతథంగా 100 శాతం రిస్క్ వెయిట్ కొనసాగుతుందని తెలిపింది. కాగా.. హామీలేని వ్యక్తిగత రుణాలపై రిస్క్ వెయిట్‌ను 25 పర్సెంటేజీ పాయింట్లు పెంచి 125 శాతానికి చేర్చింది. అదే సమయంలో క్రెడిట్ కార్డు రుణాల విషయంలో రిస్క్ వెయిట్‌ను 25 పర్సెంటేజీ పాయింట్లు పెంచి ప్రస్తుత 125 శాతం నుంచి 150 శాతానికి చేర్చింది. అధిక రిస్క్ వెయిట్ ఉంటే.. బ్యాంకులు ఆయా హామీలేని వ్యక్తిగత రుణాల కోసం మరిన్ని నిధులను పక్కన పెట్టాల్సి వస్తుంది. ఆర్‌బీఐ నిర్ణయంతో శుక్రవారం స్టాక్ మార్కెట్‌లో బ్యాంక్‌లు, ఎన్‌బిఎఫ్‌సిల షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

రైతులపై యోగి సర్కారు కన్నెర్ర

పంట వ్యర్థాలు కాల్చారనీ జైలుకు

- 20 మందిపై కేసులు.. రూ. 1 లక్ష జరిమానా వసూలు
- కాలుష్యానికి కారణమయ్యే పరిశ్రమల యజమానులపై కేసులేవి?
- బీజేపీ సర్కారు తీరుపై రైతన్నల ఆగ్రహం

లక్నో: యూపీలోని యోగి సర్కారు అక్కడి రైతన్నలపై కఠినంగా వ్యవహరిస్తున్నది. గాలి కాలుష్యానికి కారణమవుతున్నారనే కారణంగా పంట వ్యర్థాలు కాల్చారన్న ఆరోపణలపై పది మంది రైతులను జైలుకు పంపింది. మరో 20 మందిపై కేసులు నమోదు చేసింది. వారి నుంచి రూ. 1 లక్ష వరకు జరిమానా వసూలు చేసింది. మహారాజ్‌గంజ్ అధికారులు రైతులపై తీసుకున్న చర్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రైతులన్నలు యోగి సర్కారుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. వాయు కాలుష్యమనే విషయమే ప్రభుత్వానికి ప్రధాన అంశమైతే.. ఆ కాలుష్యానికి కారణాల్లో ముందు వరుసలో ఉండే పరిశ్రమలపై ప్రభుత్వం చర్యలేవని రైతన్నలు అంటున్నారు. అన్నదాతలపై వేగంగా స్పందించే యోగి సర్కారు.. పరిశ్రమల యజమానుల విషయంలో ఎందుకు పట్టనట్టు వ్యవహరిస్తున్నదని వారు ప్రశ్నిస్తున్నారు.

కాగా, రైతన్నలు పంట వ్యర్థాలను కాల్చకుండా నిరోధించటంలో విఫలమైన ముగ్గురు లేఖపాల్‌లను అధికారులు సస్పెండ్ చేశారు. "పదేపదే అభ్యర్థనలు, అవగాహన కల్పించినప్పటికీ.. రైతులు మహారాజ్‌గంజ్‌లో పంట వ్యర్థాలను తగులబెడుతున్నారు. దీంతో రైతులపై చర్యలు తీసుకున్నాం. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు కనీసం 10 మంది రైతులను అరెస్టు చేశాం. 20 మందికి పైగా కేసు నమోదు చేశాం. శాటిలైట్ చిత్రాలను పర్యవేక్షించడానికీ, రైతులను పర్యవేక్షించడానికి మేము ఒక కమిటీని ఏర్పాటు చేసాము. ఎవరైనా దోషులుగా తేలితే చట్టప్రకారం శిక్షార్హులవుతారు" అని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్డీఎం) రమేష్ కుమార్ తెలిపారు. మరోవైపు, మహరాజ్‌గంజ్ జిల్లాలో 50 మంది రైతులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి వారికి రూ. 5 లక్షల జరిమానా విధించినట్టు సమాచారం.

రైతన్నలకు బాసటగా సీపీఐ(ఎంఎల్)

మహరాజ్‌గంజ్‌లోని రైతు అరెస్టులకు వ్యతిరేకంగా సీపీఐ(ఎంఎల్) రైతులను సమీకరించింది. వారికి బాసటగా నిలిచింది. సీపీఐ (ఎంఎల్) సభ్యుడు హరీష్ మాట్లాడుతూ " పంట వ్యర్థాల దహనం విషయంలో అనవసరంగా రైతుల పరువు తీస్తున్నారు. ఈ వ్యర్థాల దహనం 8 శాతం కాలుష్యానికి మాత్రమే కారణమని అందరికీ తెలుసు. మిగిలిన 92 శాతం పరిశ్రమల వల్ల కలుషితమవుతున్నది. రైతులు, పేదలు సులభమైన లక్ష్యం కాబట్టి ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకుంటోంది. ఏ పరిశ్రమపై కానీ, వ్యాపారవేత్తలపై కానీ ఎటువంటి చర్య తీసుకోదు" అని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. " పంట వ్యర్థాల దహనం విషయంలో రైతులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో, ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం వరిని కొనుగోలు చేయని వారిపై కూడా వరి సేకరణపై కూడా చర్యలు తీసుకోవాలి. వరికి క్వింటాల్‌కు రూ.2,160 ధర నిర్ణయించగా, క్వింటాల్‌కు రూ.550 నష్టంతో రైతులు రూ.1,600కు విక్రయించాల్సి వస్తున్నది. కానీ దీనిని ఎవరు పట్టించుకుంటారు?" అని ఆయన యోగి సర్కారును ప్రశ్నించారు.

టీచర్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, సరెండర్ లీవు, మెడికల్ బిల్లులు, డీఏ బకాయిలు, పీఆర్సీ బకాయిలు వంటి బిల్లులను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ తొలి పీఆర్సీలో 30 శాతం ఫిట్‌మెంట్ సాధించామని గుర్తు చేశారు. రెండో పీఆర్సీలో మంచి ఫిట్‌మెంట్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కోర్టు అడ్డంకులను తొలగించి త్వరలోనే ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను కొనసాగించడమే కాకుండా సర్వీస్ రూల్స్‌ను కూడా సాధిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీలు బి మోహన్‌రెడ్డి, పూల రవీందర్, సంఘం ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి, పత్రిక ప్రధాన సంపాదకులు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి, నాయకులు చిత్తలూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరున్నరేండ్ల బీఆర్‌ఎస్ పాలనను 65 ఏళ్ల కాంగ్రెస్ పాలనను పోల్చండి

బీఎన్ఐ సభ్యులతో కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఆరున్నరేండ్ల బీఆర్‌ఎస్ పాలనను, దాదాపు 65 ఏండ్ల కాంగ్రెస్ పాలనను పోల్చాలని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.టి.రామారావు ప్రజలకు సూచించారు. ఆరున్నరేండ్లలో బీఆర్‌ఎస్ అందించగలిగింది ఆరు దశాబ్దాల్లో కాంగ్రెస్ అందించలేకపోయిందని తెలిపారు. బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) సభ్యులతో శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదిన్నరేండ్లు అయ్యిందని, అయితే అందులో కోవిడ్ కారణంగా రెండేండ్లు, వివిధ ఎన్నికల కారణంగా ఒక ఏడాది పోనూ తాము నికరంగా పాలన చేసింది ఆరున్నరేండ్లు మాత్రమే అని తెలిపారు. ఆ కాలంలో అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూనే అన్ని వర్గాల సంక్షేమం పథకాలు అమలు చేశామని వివరించారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో విద్యుత్, నీటి ఎద్దడి తీవ్రంగా ఉండేదనీ, ఒక్కొక్క సమస్య పరిష్కరించామని పేర్కొన్నారు. శాంతి భద్రతలు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించి సమర్థవంతమైన పాలన అందించామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో హైదరాబాద్ అభివృద్ధి చేశామనీ, దాంతో ప్రఖ్యాత కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సామాజిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, క్రీడా మౌలిక సదుపాయాలు, విద్యా, నైపుణ్యం, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెడతామని కేటీఆర్ తెలిపారు. వచ్చే ప్రభుత్వంలో తనకు పర్యాటక శాఖ కేటాయించమని సీఎం కేసీఆర్‌ను కోరతానని తెలిపారు. తనకు సీఎం, పీఎం కావాలి...ఢిల్లీకి వెళ్లాలి అన్న కోరికలు లేవని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం అంటేనే తనకు ఇష్టమనీ, తాను ఇక్కడే ఉంటానని ఉద్ఘాటించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకోవడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని కేటీఆర్ తెలిపారు. అనారోగ్య యూనిట్లు ఒత్తిడి నుండి బయటపడటానికి ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. వ్యవసాయోత్పత్తి గణనీయంగా పెరగడం వల్ల 16 ప్రాంతాల్లో ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు కేటీఆర్ తెలిపారు.

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో జర్నలిస్టుల అంశాలు

- టీపీసీసీకి డీజేహెచ్ఎస్ కృతజ్ఞతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్) విన్నపం మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) తన ఎన్నికల మ్యానిఫెస్టోలో జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశాన్ని పొందుపరిచిందని ఆ సొసైటీ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అంతే కాకుండా జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం, ఉచిత వైద్య సౌకర్యం అంశాలను మ్యానిఫెస్టోలో పొందుపరచడం శుభ పరిణామమని తెలిపారు. జర్నలిస్టులు కోరుతున్న ప్రధాన డిమాండ్లను సాధించేందుకు పీసీసీ మ్యానిఫెస్టో మరింత బలాన్ని ఇచ్చినట్టయిందని పేర్కొన్నారు. మ్యానిఫెస్టోలో జర్నలిస్టుల అంశాలను పొందుపరిచినందుకు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డికి, మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్ దుద్దిల్ల శ్రీధర్ బాబుకు, సీఎల్పీ నాయకులు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపింది.

Format C-7
(For Political Parties to publish in the news papers, social media platforms & website of the party)

Information regarding individuals with pending criminal cases, who have been selected as candidates, along with the reasons for such selection as also as to why other individuals without criminal antecedents could not be selected as candidates.

(As per the Commissioner's directions issued in pursuance of the Order dated 13-02-2020 of the Hon'ble Supreme Court in Contempt petition (C) No.2192 of 2018 in WP (C) 536 OF 2011)

Name of Political Party : **BHARATHIYA JANATHA PARTY**
Name of Election : **Telangana State Legislative Assembly-2023**
Name of the Sate/UT : **TELANGANA**
(1) Name of the Constituency : **Munugode-93**
Name of the Candidate : **CHELAMALLA KRISHNA REDDY**


S.No.			1	2	3
	Criminal antecedents				
	A	Nature of the Offence	Case registered for forgery of signatures, encroachment of border land without link document.	A UN sanctioned rally with about 60 cars and 400 bikes was conducted on NH-65 without taking prior permission causing traffic jam, nuisance, inconvenience to people, violation of emergency 108 services and election code of conduct.	A case has been registered for defaming, threatening and insulting the chief editor of Samasamajam magazine.
	B	Case No./ FIR No..	354/2010	C.R.No.640/2023	1023/2023
	C	Name of the Court	Not Known	Not Known	Not Known
	D	Whether Charges have been framed or not (Yes/No)	No	No	No
	E	Date of Conviction if any	No	No	No
	F	Details if punishment undergone,if any	NA	NA	NA
	G	Any other information Required to be given	No	No	No
2	The reasons for the selection of the candidate Selection shall be with reference to the qualifications achievements and merit of the candidate,and not mere "winnability" at the polls (not more 100 words)		All those cases are Politically foisted case.		
3	Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words)		This Candidate is well educated,the cases are politically motivated, he has good reputation in the Soceety. Always fight for the poor people.		

Sd/- **Bangaru Shruthi**, General Secretary,BJP Telangana Unit.

FORMAT C-2
(For Political party / Independent to publish in website, news papers, TV)
Declaration about criminal antecedents of independent candidate.
Name of the political party: **INDEPENDENT**
Name of the election : **GENERAL ELECTION OF TELANGANA LEGISLATIVE ASSEMBLE - 2023**
Name of the State : **TELANGANA**

1	2	3	4		5	
S.No	Name of the Constituensy	Name of the Candidate	(A)Pending criminal cases		(B)Details about cases of conviction for criminal offences	
			Name of court case No.& Status of the case	Sections of the Acts concerned & brief description of offence	Name of court & Date of orders	Description of offences & punishment imposed
1	89 HUZUR-NAGAR	BADE NARSAIAH	FIR No. 04/2015 PS Huzurnagar, CC No.1107/2016 pending on the file of Hon'ble Judicial Magistrate of First Class Court at Huzurnagar	U/s 120,177,200, 194,195,196, 209, 420, 468, of R/w 34 IPC Cheating and forgery case	NIL	NIL





రాజస్థాన్

రాహుల్ గాంధీ అక్కడికెందుకు వెళ్లరు?

నెలన్నర నుంచి ఒక్క ర్యాలీ కూడా నిర్వహించలేదు రాజస్థాన్‌లో కాంగ్రెస్‌కు ముందస్తు హెచ్చరికనా..?



జైపూర్ : రాజస్థాన్‌లో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఉనికి కనిపించడం లేదు. నవంబర్ 25న ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా ఈసారి కాంగ్రెస్, బీజేపీల మధ్య హోరాహోరీ పోటీ కనిపిస్తోంది. ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీ కుస్తీ పడుతోంది. కాంగ్రెస్ కూడా ఏ విధంగానూ బలహీనంగా కనిపించడం లేదు. కానీ, రాజస్థాన్‌లో రాహుల్ గాంధీ లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. చివరిసారిగా సెప్టెంబర్ 23న జైపూర్ వచ్చారు. ఇది దాదాపు ఒకటిన్నర నెలల క్రితం జరిగింది. మరోవైపు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అక్టోబర్‌లో రాజస్థాన్‌లో మూడు ఎన్నికల ర్యాలీలు నిర్వహించారు. రాష్ట్రంలో ఈసారి బీజేపీ గెలుపొందడం ఖాయమని, 1993 నుంచి ఇప్పటి వరకు ఏ పార్టీ కూడా రాష్ట్రంలో అధికారంలోకి రాలేకపోయిందని రాజకీయ నిపుణులు అంటున్నారు. 2018లో కాంగ్రెస్ బీజేపీని అధికారం నుంచి దించింది.రాజస్థాన్ ఎన్నికల ప్రచారంపై ఫోకస్ పెంచుతారని, రాజస్థాన్‌లో వారి కోసం అనేక ఎన్నికల ర్యాలీలు నిర్వహిస్తారని షెడ్యూల్ చేశారు

హైకమాండ్‌తో గెహ్లాట్‌కు ...

గత ఏడాది సెప్టెంబర్ 25న కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సిఎల్‌పి)లో చేరాలన్న సూచనలను ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌తో పాటు తన మద్దతు ఎమ్మెల్యేలు తిరస్కరించినప్పటి నుంచి కాంగ్రెస్ హైకమాండ్ ఆయనపై అసంతృప్తిగా ఉందనడంలో సందేహం లేదు. ఈ ఉత్తర్వులను 92 మంది ఎమ్మెల్యేలు తిరస్కరించారు. బదులుగా, వారందరూ రాష్ట్ర ప్రభుత్వ మంత్రి శాంతి కుమార్ ధరివాల్ నివాసంలో సమావేశమయ్యారు. అసెంబ్లీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తానని బెదిరించారు. సచిన్ పైలట్ లేదా అతని మద్దతుదారులను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేస్తే, తాను రాజీనామా చేస్తానని ఆయన చెప్పారు.

హైకమాండ్ సూచనలను గెహ్లాట్ బేఖాతర్

రాష్ట్ర కాంగ్రెస్ యూనిట్‌లో తలెత్తిన ప్రతిష్టంభనను ముగించే బాధ్యతను ఇద్దరు కేంద్ర పరిశీలకులు మల్లికార్జున్ ఖర్గే, అజయ్ మాకెన్‌లకు అప్పగించారు. సమాంతర సమావేశాలు నిర్వహించినందుకు ధరివాల్, మహేష్ జోషి మరియు ధర్మేంద్ర రాథోడ్‌లపై క్రమశిక్షణా చర్యలకు ఇద్దరూ సిఫార్సు చేశారు. ఈ సంఘటన తర్వాత, గెహ్లాట్ , గాంధీ కుటుంబం మధ్య సంబంధాలు క్షీణించడం ప్రారంభించాయి. అంతకుముందు, గెహ్లాట్ గాంధీ కుటుంబానికి అత్యంత విధేయులలో ఒకరిగా పరిగణించబడ్డారు.

రాహుల్ ప్రమోషన్‌లో గెహ్లాట్‌దే పెద్ద హస్తం

2006లో హైదరాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ జనరల్ కాన్ఫరెన్స్‌లో రాహుల్ గాంధీని జనరల్ సెక్రెటరీగా నియమించాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీకి గెహ్లాట్ సలహా ఇచ్చారనేది వాస్తవం. అంతేకాదు యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ బాధ్యతలు కూడా ఇవ్వాలని రాహుల్ గాంధీకి సూచించారు. చివరికి 2007లో గెహ్లాట్ ప్రతిపాదనకు సోనియా గాంధీ తన సమ్మతిని తెలియజేశారు. జనవరి 2023లో జైపూర్‌లోని 'చింతన్ శివిర్'లో గెహ్లాట్ నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో రాహుల్ గాంధీని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమించారు. 2007లో రాహుల్ గాంధీని పార్టీ అధ్యక్షుడిగా నియమించడంలో గెహ్లాట్ పెద్ద పాత్ర పోషించారు.

గెహ్లాట్‌పై గాంధీ కుటుంబానికి ఎంతో నమ్మకం ఉంది అంటే సోనియా గాంధీ స్వయంగా గెహ్లాట్‌కు ఈ పార్టీ పగ్గాలను అప్పగించాలని నిర్ణయించుకున్నారు. సెప్టెంబర్ 25న జరిగే సీఎల్పీ సమావేశం తర్వాత గెహ్లాట్ పార్టీ అధ్యక్షుడి ఎన్నికకు నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంది. కానీ, ఆ తర్వాత జరిగిన పరిణామాలు పార్టీలోని సమీకరణాలను మార్చేశాయి. అయితే, గెహ్లాట్ , అతని మద్దతుదారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆయనకు గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించింది.

పైలట్ పట్ల మెతకగా రాహుల్ వైఖరి ...

జోషి, రాథోడ్‌లకు టిక్కెట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ నిరాకరించింది. గెహ్లాట్ పదే పదే చేసిన అభ్యర్థనల మేరకు ధరివాల్‌కు టిక్కెట్టు ఇచ్చారు. కానీ, దీని కోసం గెహ్లాట్ చాలా పాపడ్ రోల్ చేయాల్సి వచ్చింది. దీంతో కాంగ్రెస్ హైకమాండ్ బలం ఏపాటిదో రుజువైంది. మరోవైపు, పైలట్‌కు సీఎం బాధ్యతలు ఇవ్వాలని ప్రియాంక గాంధీ నిరంతరం పట్టుబడుతున్నారు. పైలట్ తిరుగుబాటు తర్వాత, పార్టీ హైకమాండ్‌తో సయోధ్య కుదుర్చుకోవడంలో ప్రియాంక కూడా పెద్ద పాత్ర పోషించారు. మరోవైపు, పైలట్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా ఏకకాలంలో ఉండలేరని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. కానీ, గతేడాది జరిగిన సీఎల్పీ సమావేశం తర్వాత గెహ్లాట్ వైఖరిని చూసి ఆయన తన వైఖరిని మెత్తగా మార్చుకున్నారు.

రామా...దయ చూపవా!

- చిత్రకూట్‌లో బీజేపీకి ఆదరణ కరువు

చిత్రకూట్ : బీజేపీ ఎప్పుడూ శ్రీరాముడి నామాన్ని స్మరిస్తూ ఉంటుంది. అయితే ఆయనకు ఆ పార్టీపై దయ కలగడం లేదు. శ్రీరాముడు తపస్సు చేసిన చిత్రకూట్‌లో ఆ పార్టీ ప్రదర్శన పేలవంగా ఉంటోంది. శాసనసభ ఎన్నికలు జరగాల్సిన మధ్యప్రదేశ్‌లోని వింధ్య ప్రాంతం లోనిదే ఈ చిత్రకూట్ నియోజకవర్గం. ఇది సాత్నా జిల్లాలోని ఓ ప్రాంతం. అయోధ్యలో రామమందిర నిర్మాణం చేపడతామని 1989లో బీజేపీ జాతీయ కార్యవర్గం తీర్మానం ఆమోదించింది. అప్పటి నుంచి నాలుగు దశాబ్దాలకు పైగా ఇది బీజేపీకి ప్రధాన ఎన్నికల ప్రచారాంశంగా కొనసాగుతోంది. ఫలితంగా ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య పార్లమెంటరీ స్థానం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో బీజేపీ ఆరింటిని గెలుచుకుంది. కానీ పొరుగునే ఉన్న మధ్యప్రదేశ్‌లో ఉన్న రాముని తపోభూమి ప్రాంతంలో మాత్రం ఆ పార్టీకి ఆదరణ కరువైంది. గత 51 సంవత్సరాల్లో బీజేపీ చిత్రకూట్‌లో ఒకే ఒకసారి...అది కూడా కేవలం 722 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలిచింది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ఎనిమిది సార్లు విజయం సాధించింది. శ్రీరాముడు వనవాసం చేసిన 14 సంవత్సరాల్లో చిత్రకూటంలోనే 11 సంవత్సరాల ఆరు నెలల 21 రోజులు గడిపాడని పురాణాలు చెబుతున్నాయి.

ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ పాలనలో జరిగిన అభివృద్ధితో పోలిస్తే మధ్యప్రదేశ్‌లో జరిగింది తక్కువేనని ఆ పార్టీ కార్యకర్తలు అంగీకరిస్తున్నారు. వింధ్య ప్రాంతంలో కుల రాజకీయాలు కీలక పాత్ర పోషిస్తాయి. విజేతలను అవే నిర్ణయిస్తాయి. చిత్రకూట్‌లో బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే సురేంద్ర గహర్వార్, కాంగ్రెస్ ప్రస్తుత ఎమ్మెల్యే నీలన్షు చతుర్వేది మధ్య ప్రధాన పోటీ జరుగుతోంది. చతుర్వేది 2017 ఉప ఎన్నికలోనూ, 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇక్కడి నుంచి గెలుపొందారు. గహర్వార్ 2008లో చిత్రకూట్‌లో విజయం సాధించారు.



కార్మికులకు అండ ఎర్రజెండా

అంగన్‌వాడీలు, ఆశాలు, వీఓఏలు..ఇలా అందరికీ వేతనాలు తామే పెంచామని జబ్బలు చరుచుకునే బీఆర్‌ఎస్ నేతలు ఒక్క విషయానికి సమాధానం చెప్పాలి. ఎర్రజెండాల నాయకత్వంలో పోరాటాలే జరుగకపోతే మీరు పెంచేవారేనా? ఏదైనా పోరాటాల ద్వారానే సాధ్యం. తెలంగాణ ఏర్పాటు విషయంలో మీరు చెప్పిన సామ్యమే. అధికారం ఉన్నా..లేకున్నా...కష్టజీవులకు అండగా ఉండేది ఎర్రజెండానే. కార్మికులకు ఎక్కడ కష్టం వచ్చినా ముందుండేది సీఐటీయూ జెండానే. వేతనాల కోసం ముందుండి పోరాడి పోరాటం చేయడంలోనూ, విజయం సాధంచడంలోనూ కీలకపాత్ర ఆ జెండాదే. వీఆర్‌ఏ జేఏసీ అలుపెరుగని పోరాడానికి వెన్నుదన్నుగా నిలిచిందీ..ఆశాల హక్కుల కోసం కోఠి రోడ్డును దిగ్బంధించిందీ..మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవవేతనం పెంచేలా సర్కారుపై ఒత్తిడి తెచ్చిందీ...ఐకేపీ వీఓఏల వేతనాలు పెంచడంలో కృషి చేసిందీ..అంగన్‌వాడీల హక్కులను కొట్లాడి సాధించిందీ సీఐటీయూ జెండానే అనేది కార్మికుల నోళ్లల్లో నానే సంగతి తెలిసిందే. పలు పరిశ్రమల్లోనూ కార్మికుల హక్కుల కోసం నికరంగా పోరాడుతూ గుర్తింపు సంఘం హోదాలో ఎగురుతున్నదీ సీఐటీయూ జెండానే.

- ప్రతి పోరాటంలోనూ సీఐటీయూదే కీలకపాత్ర
- వేతనాల పెంపు ఉద్యమాల్లో ముఖ్య భూమిక
- వీఆర్‌ఏ జేఏసీ పోరాటానికి మద్దతు

పలు పరిశ్రమల్లో గుర్తింపు సంఘంగా సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో సెర్ప్ కింద ఐకేపీ వీఓఏలు 17,606 మంది పనిచేస్తున్నారు. సెర్ప్ ఉద్యో గులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో 44 రోజులు సమ్మె చేసి గౌరవ వేతనం పెంచుకోవడంలో వీఓఏలు విజయం సాధించారు. వారికి ప్రస్తుతం గౌరవవేతనం ఆరు వేల రూపాయలు అందుతున్నది.

వీఆర్‌ఏ జేఏసీ పోరాటంలో వెన్నుదన్నుగా..

పర్మినెంట్, వారసత్వ ఉద్యోగాలు, ప్రమోషన్లు, వేతనాల పెంపు విషయంలో వీఆర్‌ఏలంతా ఒక్కతాటిపైకి వచ్చి జేఏసీగా ఏర్పడటంలోనూ, ఆ పోరాటాన్ని ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లి విజయం సాధించడంలోనూ సీఐటీయూ పాత్రను ఎవ్వరూ కాదనలేనిది. ప్రభుత్వం చర్చలు జరిపిన ప్రతిసారీ సీఐటీయూ రాష్ట్ర నాయకత్వాన్ని కూడా ప్రభుత్వం ఆహ్వానించింది. ఎవ్వరూ ఊహకందని రీతిలో అసెంబ్లీ ముట్టడి, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వద్ద మెరుపు ఆందోళనల ఫలితంగా ప్రభుత్వమే దిగివచ్చి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంలో సీఐటీయూ కృషిని ఎంత చెప్పుకున్నా తక్కువే.



ప్రభుత్వ విభాగాల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు 30 శాతం మేర పెరగడంలో సీఐటీయూ పోరాట కృషి దాగి ఉంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి మరీ మీసేవా ఉద్యోగులకు నాలుగు వేల రూపాయల వేతనం పెరిగేలా చేసింది. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె పోరాట ఫలితంగా మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనం కూడా పెరిగింది. అల్పాహారం వండిపెడు తున్నందుకుగానూ ప్రత్యేకంగా పారితోషికం ఇచ్చేందుకు రాష్ట్ర సర్కారు అంగీకరించింది. రాంకీ సంస్థ నిర్వహిస్తున్న డంపింగ్ యార్డులో పనిచేస్తున్న కార్మికులకు ఒక్కొక్కరికి రూ.6,400 వేతనం పెరగడం, వీడీఏ పెంపు, ఏటేటా జీతాల పెంపు హామీల సాధనలో సీఐటీయూ పోరాటం మరువలేనిది. సింగరేని కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెరిగేలా చేయడంలో సీఐటీయూ పోరాటం అలుపెరుగనిది.

భగీరథ, భవన నిర్మాణ కార్మికులకు అండగా..

మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు పెంచేలా అటు ప్రభుత్వాన్ని, ఇటు మేఘా సంస్థను ఒప్పించేలా పోరాటాన్ని చేయడంలో సీఐటీయూ విజయం సాధించింది. నల్లగొండ జిల్లాలో మిషన్ భగీరథ కార్మికురాలు ఆత్మహత్య చేసుకుంటే మెఘా కంపెనీ నుంచి బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఇప్పించిన ఘనత సీఐటీయూదే. మరో కార్మికుడు చనిపోయితే 12 లక్షలు ఇప్పించింది. అనేక పోరాటాల ఫలితంగా భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు రూ.950 కోట్ల పెండింగ్ క్లయిమ్‌లను చెల్లించింది.

అలుపెరుగని అంగన్‌వాడీ, ఆశాల పోరాటాలు

తెలంగాణలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆశాల జీతాల పెంపు, హక్కుల కోసం సీఐటీయూ ఒంటిరిగానూ, జేఏసీగానూ అలుపెరుగని పోరాటాలు చేసింది. సమ్మెలు, పాదయాత్రలు, వంటావార్పులతో ఊపిరి మెసలకుండా పోరాటాలు చేసి సర్కారు మెడలు వంచి విజయం సాధించింది. రాష్ట్రమేర్పడ్డప్పటి నుంచి అంగన్‌వాడీల వేతనాలు మూడు సార్లు పెరగటంలో సీఐటీయూ కృషి మరువలేనిది. వేలాది మంది ఆశా వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కోఠి ప్రధాన కూడలిని ముట్టడించిన తీరు సర్కారుకే వణుకుపుట్టించింది. వేలాది మంది కార్మికులు ఉప్పెనలా ఎగిసిపడితే ఎలా ఉంటుందో సర్కారుకు తెలిసి వచ్చేలా చేసింది. సీఐటీయూ అలుపెరుగని పోరాటాల ఫలితంగా ఆశా వర్కర్లకు మూడు సార్లు పారితోషికాలు పెరిగాయి.

కనీస వేతనాల జీవోల కోసం

రాష్ట్రంలోని 72 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ పరిధిలోకి వచ్చే పరిశ్రమల్లో కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ ఒంటిరిగానూ, కార్మిక సంఘాల జేఏసీగానూ అనేక పోరాటాలు చేసింది. వాటి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఐదు నోటిఫికేషన్లను విడుదల చేసింది. కానీ, యాజమాన్యాల ఒత్తిడితో రాష్ట్ర సర్కారు ఐదు జీవోలను గెజిట్ చేయలేదు. కార్మికుల కనీస వేతనాల కోసం అలుపెరుగని పోరాటాలను సీఐటీయూ మొక్కవోని దీక్షతో చేస్తూనే ఉంది. సీఐటీయూ ప్రారంభించని పోరాటం, సీఐటీయూ ముందుండి నడపని పోరాటం, సీఐటీయూ లేని పోరాటం రాష్ట్రంలో లేదనడం అతిశయోక్తి కాదు.

సఫాయన్నల మేలు కోసం

గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికుల హక్కుల కోసం జేఏసీగా, ఒంటరిగా సీఐటీయూ తనదైన రీతిలో పోరాటాలను నిర్వహించింది. ఆ కార్మికుల పలు హక్కులు సాధించడంలో విజయం సాధించింది. అదే సమయంలో కనీస వేతనాల అమలు, మల్టీపర్పస్ విధానం రద్దు కోసం పంచాయతీ కార్మికులు ఎన్నికల దగ్గర పడ్డ వరకూ సమ్మె చేశారు. ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా సమ్మె వాయిదా వేశారు.

వైద్యరంగంలో పోరాటాలతోనే జీతాల పెంపు

వైద్యారోగ్య రంగంలో రాష్ట్రంలో లక్ష మంది వరకు ఉద్యోగులుండగా అందులో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఇతర పేర్లతో విధులు నిర్వర్తించేవారే 50 వేల మంది దాకా ఉన్నారు. ఆస్పత్రుల్లో పనిచేసే కార్మికులకు జీవో 60 అమలు చేయించి వేతనం రూ.16,500 దక్కేలా చేయడంలో సీఐటీయూ కృషి ఇతోధికం. సీఐటీయూ పోరాటాల ఫలితంగానే 1336 కాంట్రాక్టు పారామెడికల్ సిబ్బంది పర్మినెంట్ అయ్యారు. కాంట్రాక్టు రెండో ఏఎన్‌ఎంలతో పాటు ఇతర ఏఎన్‌ఎమ్‌లను క్రమబద్ధీకరించాలనే పోరాటం పాక్షిక విజయాన్ని సాధించింది. 104, ఆరోగ్యశ్రీ, 108 సిబ్బంది సమస్యల పరిష్కారంలో సీఐటీయూ కృషి ఉంది. సమ్మె కాలపు వేతనాలతో పాటు పరీక్షలో సర్వీస్ వెయిటేజీని 20 మార్కుల నుంచి 30 మార్కులకు పెంపు, ఏఎన్‌ఎమ్‌ల సమస్య పరిష్కారం కోసం ఐఏఎస్ కమిటీ ఏర్పాటు పోరాటాల ఫలితమే.

నవతెలంగాణ

మానవత్వం లేని మేధస్సు కంటే, మేధస్సు లేని మానవత్వం ఎంతో మంచిది - రస్సెల్

శనివారం 18 నవంబర్ 2023
www.navatelangana.com

సంపాదకీయం

విద్వేష 'పరివారం'

మోకాలికీ బోడిగుండుకీ ముడి పెట్టడంలో బీజేపీ పరివారానికి మించిన వారెవరూ ఉండరంటే అతిశయోక్తి కాదు. విషయమేమిటంటే.. "యూదులంతా యాదవులే" నట..! తమకు ఎదురుగాలి వీస్తుందనుకున్నప్పుడల్లా ఏదో ఒక వివాదాన్నో, వితండవాదాన్నో ముందుకు తేవడం, విద్వేషాలు రెచ్చగొట్టడం వీరికి పరిపాటిగా మారింది. ఎక్కడ ఏ చిన్న అవకాశం దొరికినా అసత్యాలతో అర్థసత్యాలతో మనుషుల్లో ఉద్వేగాలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు రెచ్చ గొట్టయినా సరే తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడం ఇప్పటివరకూ చూశాం. ఇప్పుడు సరిహద్దులకు ఆవలి పరిణామాలను కూడా వాడుకోజూడటం వీరి విద్వేష రాజకీయాలకు ఓ పరాకాష్ట.

> ఇజ్రాయిల్ ప్రజల మానవీయతకు వక్రీకరణలు చేస్తూ భారత ప్రజల మధ్య చిచ్చుబెట్టజూస్తున్న ఈ కుతంత్రాలనేమనాలి? చితిమంటలతో చలి కాచుకోవడమంటే ఇదే కదా! ఎడతెరిపిలేని బాంబుల వర్షంలో అనుక్షణం మృత్యుభయంతో నెత్తు రోడుతోంది పాలస్తీనా. వనరులపై ఆధిపత్యం కోసం సాగుతున్న ఈ యుద్ధంలో ఇజ్రాయిల్ ప్రభుత్వ రక్తదాహాన్నీ, అమెరికా సామ్రాజ్యవాదాన్ని ప్రపంచమంతా ముక్తకంఠంతో ఖండిస్తున్న వేళ... బాధిత ప్రజలకు సంఘీభావంగా నిలబడకపోగా, ఆ మారణహోమాన్ని సైతం తమ మతవిద్వేషాలకు వాడుకోవడం ఎంత అమానవీయం!

ఇటీవల ఓ రాజకీయ సభలో యూపీ ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్. మాట్లాడుతూ... ప్రస్తుతం దేశంలో బీజేపీ,కాంగ్రెస్‌ల మధ్య జరుగుతున్న యుద్ధం, ఇజ్రాయిల్-పాలస్తీనా మధ్య జరుగుతున్న యుద్ధం ఒక్కటేనని వాఖ్యానించారు. ఇవేవో యాధృచ్ఛికంగానో, అన్యాపదేశంగానో ఆయన నోటి నుండి జాలువారిన వాక్యులనుకుంటే పొరపాటు. ఇటీవల హిందూత్వ అనుకూల ప్రసార మాధ్యమాల్లో వెలువడుతున్న కథనాలను, సామాజిక మాధ్యమాల్లో వినబడుతున్న వాదనలను జాగ్రత్తగా పరిశీలిస్తే గానీ ఇదొక వ్యూహంలో భాగమన్న సంగతి బోధపడదు. ఏమిటా కథాకమామీషూ అంటే... ఇజ్రాయిల్‌లోని యూదులు, భారత్‌లోని యాదవులు ఒకే జాతి వారట! ఇది వారి "పరిశోధనల్లో" తేలిందట! యూదుల ప్రవక్త మోజెస్‌కూ యాదవ వంశస్తుడైన శ్రీకృష్ణుడికీ బోలెడన్ని సారూప్య తలున్నాయట. పనిలోపనిగా పరోక్షంగా కాంగ్రెస్ పార్టీని ఉద్దేశిస్తూ... కేవలం ముస్లిం ఓట్లకోసం పాకులాడే రాజకీయ పక్షాలు తప్ప తక్కినవారంతా "యూదులే యాదవులు" అన్న ఈ పరిశోధనల సారాన్ని అంగీకరిస్తున్నారని కూడా చెపుతున్నారు. ఎక్కడి యూదులూ, ఎక్కడి యాదవులు..? బుద్ధి గడ్డి తినడమంటే ఇదేనేమో! ఈ ప్రహసనమంతా తరిచిచూస్తే... మోజెస్‌కూ కృష్ణుడికీ మధ్య సారూప్యతల సంగతేమోగానీ, ఈ కథనాలు యోగి ఆధిత్యనాథ్ వ్యాఖ్యానాలకు అద్దం పడుతున్నాయి.

అంతిమంగా ఈ వ్యవహారంలోని అంతస్సారమేమిటంటే.. వీరంతా కలిసి గాజాలో జరుగుతున్నది ఇజ్రాయిల్ ప్రజలైన యూదులూ పాలస్తీనా ప్రజలైన ముస్లింల మధ్య




యుద్ధమనీ, కాబట్టి భారతీయ యాదవులంతా ముస్లింలను వ్యతిరేకించాలని చెప్పదలుచుకున్నారు. కానీ వాస్తవం ఇందుకు పూర్తిగా విరుద్ధం. యుద్ధమేదైనా బలయ్యేది ప్రజలే కానీ, ప్రజలెప్పుడూ యుద్ధాల్ని కోరుకోరు, ఇప్పుడు గాజాలో జరుగుతున్నది కూడా ప్రజల మధ్య యుద్ధం కాదు. నిజానికి ఇజ్రాయిల్‌లోని యూదులు ఏమంటున్నారు..? యుద్ధాన్ని విరమించాలంటున్నారు. తక్షణమే ఆక్రమిత పాలస్తీనా ప్రాంతాల నుంచి తమ సైన్యాలు వైదొలగాలంటున్నారు. తమ ప్రభుత్వ దురాక్రమణలు, దుశ్చర్యలకు వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్నారు. పాలస్తీనా ప్రజలపట్ల అపారమైన సానుభూతి ప్రకటిస్తున్నారు. మతాతీతమైనది తమ మానవత్వమని చాటుతున్నారు. మరి వీరికేమొచ్చింది? ఇజ్రాయిల్ ప్రజల మానవీయతకు వక్రీకరణలు చేస్తూ భారత ప్రజల మధ్య చిచ్చుబెట్టజూస్తున్న ఈ కుతంత్రాలనేమనాలి? చితిమంటలతో చలి కాచుకోవడమంటే ఇదే కదా! ఎడతెరిపిలేని బాంబుల వర్షంలో అనుక్షణం మృత్యుభయంతో నెత్తురోడుతోంది పాలస్తీనా. వనరులపై ఆధిపత్యం కోసం సాగుతున్న ఈ యుద్ధంలో ఇజ్రాయిల్ ప్రభుత్వ రక్తదాహాన్నీ, అమెరికా సామ్రాజ్యవాదాన్ని ప్రపంచమంతా ముక్తకంఠంతో ఖండిస్తున్న వేళ... బాధిత ప్రజలకు సంఘీభావంగా నిలబడకపోగా, ఆ మారణహోమాన్ని సైతం తమ మతవిద్వేషాలకు వాడుకోవడం ఎంత అమానవీయం!

చూడబోతే దేశంలో, ముఖ్యంగా ఉత్తరభారతంలో నెలకొంటున్న పరిణామాలు కమలనాథులను కలవరపెడుతున్నట్టున్నాయి. అక్కడ యాదవ కమ్యూనిటీకున్న ప్రాబల్యం గురించి చెప్పనవసరం లేదు. ఇటీవల బీహార్ ప్రభుత్వం చేపట్టిన కులగణన తరువాత ఇది మరింత స్పష్టమైంది. ప్రత్యేకించి ఈ కమ్యూనిటీ అంతా బీహార్, యూపీల్లో గణనీయమైన శక్తిగా ఉండటంతోపాటు, లలూప్రసాద్ యాదవ్, అఖిలేష్ యాదవ్‌ల నేతృత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్, సమాజ్‌వాదీ పార్టీల వెనుక సమీకృతమై ఉన్నది. ఈ రెండు రాష్ట్రాల్లో దేశంలోనే అత్యధిక పార్లమెంటు స్థానాలు ఉండటం, అక్కడ బీజేపీ ప్రధాన ప్రత్యర్థులైన ఈ రెండు పార్టీలకూ బలమైన ఓటు బ్యాంక్ యాదవులు, మైనారిటీలే కావడం గమనార్హం. కాగా, అసలే దక్షిణాదిన విజయావకాశాలకు పూర్తిగా తలుపులు మూసుకుపోయిన బీజేపీకి ఇప్పుడా రెండు రాష్ట్రాలు కీలకంగా మారాయి. అక్కడ ప్రత్యర్థిని ఓడించాలంటే వారి ప్రధాన ఓటు బ్యాంక్‌ను దెబ్బకొట్టాలి. అందుకే వారి వెనకున్న యాదవులు, ముస్లింల మధ్య వైషమ్యాలు రగిలించే కుతంత్రాలకు పాల్పడుతోందని, అందుకు పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధాన్ని సైతం వాడుకోజూస్తున్నదని విశ్లేషకులు అభిప్రాయడుతున్నారు. సుదీర్ఘకాలంగా మన దేశం అవలంబిస్తున్న పాలస్తీనా అనుకూల వైఖరికి తిలోదాకాలివ్వడంలోని మతలబు కూడా ఇదే కాబోలు....

అలుపెరగని పోరాట యోధుడు, ప్రజానాయకుడు, ఉద్యమ సూరీడు కామ్రేడ్ వనగంటి ఈశ్వర్. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా దాదాపు ఇరవై ఏండ్ల పాటు సుదీర్ఘకాలం పని చేశాడు. ప్రస్తుతం ఏర్పడ్డ మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో పనిచేస్తున్న నాయకత్వం నేడు ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారంటే దానికి ఈశ్వర్ గతంలో పార్టీ నిర్మాణానికి చేసిన కృషి అనే చెప్పాలి. ఆయన సిద్ధాంత పటిమ, మార్గదర్శకమైన కార్యాచరణే కార్యకర్తలను ఒక దిక్సూచిలా నడిపిస్తోంది. నమ్ముకున్న కమ్యూనిస్టు సిద్ధాంతం కోసం ఈశ్వర్ జీవితాంతం పనిచేశారు. సీపీఐ(ఎం) అంటే క్రమశిక్షణ గల పార్టీ అని ప్రజల్లో విశ్వాసం కల్పించారు. జిల్లాలో విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలను నిర్మించి బలోపేతం చేశారు. 1998లో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఏర్పడినప్పటి నుండి కులవివక్ష, అంటరానితనంపై పోరాటాలు నిర్వహించడానికి కృషి చేశారు. దేవాలయ ప్రవేశాలు, రెండు గ్లాసుల విధానం రద్దు వంటి ప్రతిఘటన పోరాటలు నిర్వహించి ఫ్యుడల్ విధానాన్ని నాశనం చేసి, దళితుల్లో చైతన్యం నింపారు.

ఆదర్శం...కామ్రేడ్ ఈశ్వర్ జీవితం



జిల్లాలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించేలా కృషి చేశారు. భూపోరాటాలు నిర్వ హించి, భూమిలేని నిరుపేద లకు భూ పంపిణీ చేయిం చారు. కరువు కాలంలో ఆకలి చావులు, ఆకలి కేకల నివారణ కోసం అంబలి కేంద్రాలను ఏర్పాటు చేసి పేదలకు అండగా నిలిచారు. అచ్చం పేట, కొల్లాపూర్ ప్రాంతాల్లో పెరుగుతున్న పార్టీని ధ్వంసం చేసేందుకు భూ స్వాములు నక్సలైట్లను ఉపయోగించి, మారణహోమం సృష్టించి ఆరుగురు కార్యకర్తలను కిరాతకంగా చంపించారు. దీంతో వందలాది మంది గ్రామాలను వదిలి పెట్టి వెళ్లారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆనాడు ఉద్యమాన్ని రక్షించుకోవడంలో నిర్బంధాన్ని ఎదుర్కొని ధైర్యంగా ముందుండి పార్టీని నడిపించాడు ఈశ్వర్. వర్గ దృక్పథం కలిగి ఉండటం కమ్యూనిస్టులకు ఎంతో ముఖ్యమైనది. ఈ రెండు సుగుణాలు వనగంటి ఈశ్వర్ జీవితంలో స్పష్టంగా కన పడుతాయి. వ్యవసాయ కార్మికులు, దళితులను సమీకరించి పార్టీని ముందుకు నడిపించారు.

కామ్రేడ్ ఈశ్వర్ ఆదర్శనాయకుడు. నిర్మాణ దర్శకుడు. కార్యకర్తల్లో పార్టీ ఆశయాలు, లక్ష్యాల పట్ల అవగాహన కల్పించి, ఉత్సాహపరిచి వారిని ముందుకు నడిపించారు. కార్యకర్తలను తయారు చేయడం, వారిని నాయకులుగా ఎదిగించుకుని, జిల్లా ఉద్యమాన్ని బలోపేతం చేశారు. కుటుంబ సంక్షేమం కంటే పార్టీ నిర్మాణం, ఆశయం గొప్పదని తరచూ కార్యకర్తలకు చెప్పేవారు. మార్క్సిస్టు సాహిత్యం, ప్రజాశక్తి పత్రికను కార్యకర్తలకు కొనిచ్చి, చదివించేలా ప్రోత్సహించేవారు. ఈ రోజు ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లాలో మార్క్సిస్టు పార్టీ విస్తృతంగా పని చేస్తుందంటే కామ్రేడ్ వనగంటి ఈశ్వర్ త్యాగం, పట్టుదల, కృషి అని చెప్పక తప్పదు. ఆయన భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన ఆశయం ముందుకు తీసుకుకుపోవడమే నిజమైన నివాళి. జోహార్ కామ్రేడ్ వనగంటి ఈశ్వర్..

(నేడు వనగంటి ఈశ్వర్ మూడో వర్థంతి)

- కిల్లెగోపాల్

బీజేపీ : బీసీ ఆత్మగౌరవం



ఎస్. వినయ కుమార్

నూరు ఎలుకలు తిన్న పిల్లి హజ్‌కు వెళ్లిందని సామెత. బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభ కూడా అలాంటిదే. దేశ ప్రధాని నరేంద్రమోడీయే స్వయంగా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ శాసనసభకు ఎన్నికలు జరుగనున్న సందర్భంలో ఎన్నికల ప్రచారసభగా కాకుండా బీసీల ఆత్మగౌరవం పేర జరిపిన సభ ఒక ఆపదమొక్కు మాత్రమే.

బీజేపీకి రిజర్వేషన్లు అంటే వంటికి కారం పూసుకొన్నట్లు ఉంటుంది. కనుక కేంద్ర సర్వీసుల్లో బీసీ రిజర్వేషన్లు ప్రతిపాదించిన మండల్ సిఫారసులను వెనక్కి నెట్టడానికి అద్వానీ ఆధ్వర్యంలో అయోధ్య రథయాత్ర జరిపింది. రథయాత్రలో అద్వానీ వెనకే ఉంటూ సమన్వయం చేసిన సిపా సాలార్ ఈ మోడీయే. ఆనాడు కూడా పెద్దపత్రికలు మండల్ సిఫారసులను వ్యతిరేకించినా, ప్రతిభ అన్న అమాంబాపతు వాదనను ముందుకు తెచ్చినా ఆ యుద్ధానికి అవి మండల్-కమండల్, మండల్-మందిర్ వంటి పదబంధాలు సృష్టించాయి.

ఆ యుద్ధానికి ఒకవైపు అప్పటి ప్రధాని విశ్వనాథ ప్రతాప్ సింగ్ సారథ్యం వహిస్తే మరోవైపు అద్వానీ సారథ్యం, ఆయన వెనుక సెకెండ్ ఇన్ కమాండ్‌గా మోడీ. విశ్వనాథ ప్రతాప్ సింగ్‌ను ప్రధాని పదవి నుండి లాగేసే దాకా బీజేపీ నిద్ర పోలేదు. రామమందిర నిర్మాణం కోసం రథయాత్ర అని బీజేపీ చెప్పుకొన్నా దాని అసలు ఉద్దేశాల్లో బీసీ రిజర్వేషన్లకు మోకాలడ్డటం ఒకటి. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దేశమంతా ఆనాడు జరిపిన ఆందోళనలో కూడా బీజేపీ ప్రచ్ఛన్న హస్తానది ప్రధానీ పాత్రే. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్టీ రామారావు బీసీల రిజర్వేషన్ కోటాను పెంచగా ఇక్కడ కూడా బాపతే అడ్డుపడింది. బీసీ కోటా పెంపును వ్యతిరేకిస్తూ ఎస్ఎస్ఎస్ అనే ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి ఆర్ఎస్ఎస్ చక్రం తిప్పింది. ఎన్టీఆర్‌కు ఊపిరాడని స్థితిని తెచ్చిపెట్టింది. ఆత్మగౌరవ సభలో వేదిక మీదున్న జనసేన అధ్యక్షుడికి ఆ విషయం తెలుసో లేదో గానీ, ఈటెల రాజేందర్‌కు బాగానే తెలిసుండాలి. తెలంగాణ ఎన్నికల ఎత్తుగడల్లో భాగంగా బీజేపీ ఏకాఎకిన బండి సంజయ్‌ని రాష్ట్ర అధ్యక్ష పదవి నుండి తప్పించి కిషన్‌రెడ్డిని కూర్చోబెట్టింది. ఎన్నికల సందర్భంగా అత్యంత ఆంతరంగిక వలయాల్లో వేయాల్సిన ఎత్తులకు జిత్తులకు బండి సంజయ్ పనికి రాకుండా పోయారు.

నేను కూడా బీసీనేని మోదీ చేసే తర్కం కూడా చెల్లుబాటు కాదు. ఎందుకంటే 'తెలి' వైశ్యకులాల్లో ఒకటి. వృత్తిరీత్యా ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనే శూద్రకులమే అయినా ఆ కులంలో ఆస్తిపాస్తులు గలవారు. చదువుకొన్నవారు గణనీయ సంఖ్యలో ఉన్నారు. కనుకనే 'తెలి' కులాన్ని వెనకబడిన కులంగా పరిగణించలేదు. గుజరాత్‌లో 1979-80లో మాత్రమే 'తెలి' కులాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం, 1999లో కేంద్ర ప్రభుత్వం బీసీ కులాల జాబితాలో చేర్చాయి. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా మోడీ ఆ రాష్ట్ర స్థానిక సంస్థల్లో బీసీలకు 10 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు చేశారు. ఈ ఏడాది ఆగస్టు 27 నుండి మాత్రమే ఆ కోటాను 22 శాతానికి పెంచారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగా బీసీ కోటాను మరింత పెంచే అవకాశం ఉందన్న ప్రతిపక్ష కాంగ్రెస్ సభలో చేసిన వాదనను బీజేపీ ప్రభుత్వం ఒప్పుకోలేదు. కాగా తెలంగాణలో 2018 నవంబర్ నుండి స్థానిక సంస్థల్లో బీసీ కోటా 34 శాతం అమలవు తోంది. రెండు రోజుల క్రితం బీహార్ ప్రభుత్వం విద్యా ఉద్యోగాల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీ రిజర్వేషన్లు 65 శాతానికి పెంచింది.

బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ కులగణన ఫలితాలను వెల్లడి చేయగానే కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఒకరి వెంట ఒకరుగా తమ రాష్ట్రాల్లోనూ కులగణన నిర్వహిస్తామని ప్రకటించారు. దేశం మొత్తం మీద బీసీ కులాల ఓట్లు కాంగ్రెస్‌కు నానాటికీ తగ్గిపోయాయి. బీజేపీకి పెరిగాయి. గనుక కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వెంటనే కులగణన రాగం అందుకొ న్నారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నా ఎన్నడూ కాంగ్రెస్ ఆ పని చేయలేదు. జనాభా లెక్కల సేకరణకు వెళ్లే ముందు ప్రతిసారి కులగణన కూడా జరిపాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. కులగణన వల్ల జనాభా సంఖ్యలతో పాటు ఏ కులం విద్యా, ఉద్యోగాల్లో, ఆర్థికంగా ఏ స్థాయిలో ఉందో తెలుసుకునే అవకాశం ఉంటుంది. దాన్ని బట్టి ఎవరికి ఎలాంటి ప్రత్యేక సహాయం అవసరమన్నది నిర్ణయించుకోవచ్చు. బీసీ రిజర్వేషన్లలో అంతర్గత కోటాలపై పున:పరిశీలన చేయవచ్చు. కాంగ్రెస్ ఆ పని చేయలేదు. కానీ ఇప్పుడు కులగణన కోసం డిమాండ్ చేస్తోంది. ఇప్పటికైనా ఆ పని చేస్తున్నందుకు సంతోషం.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మొదట కులగణనకు ససేమిరా అన్నా ఇప్పుడు శషబిషలు పడుతోంది. హోం మంత్రి అమిత్ షా కొన్నిరోజుల క్రితం తన పార్టీ రాష్ట్ర అధ్యక్షులతో సుదీర్ఘ సమావేశం జరిపారు. రాహుల్ గాంధీ కులగణన కోసం డిమాండ్ చేస్తున్నందున ఎన్నికలో దాని ప్రభావం ఎలా ఉంటుందని అడిగారు. వాళ్లనడిగితే ఎం తెలుస్తుంది. కనుక ఏడుగురు అంధులు ఒక ఏనుగు అన్న కథలాగే ఉంటుంది చివరకు కులగణనకు మేము వ్యతిరేకమని ఎప్పుడూ చెప్పలేదు. పోతే ఇప్పటిదాకా ఒక నిర్ణయం చేయలేదంతే అని బీజేపీ గోడమీది పిల్లి లాంటి వైఖరి చూపెట్టింది.

బీజేపీకి ప్రధానంగా బ్రాహ్మణ, వైశ్య కులాలతో పాటు ఇతర ఆధిపత్య కులాల పార్టీ. అడుగడుగునా అది కన్పిస్తుంది. దాన్ని పోగొట్టడానికి సీట్ల కేటాయింపుల్లో బీసీల సంఖ్యను కాస్త పెంచినా ఆధిపత్య కులాల పెత్తనమే బీజేపీని నడిపిస్తోంది. దాని మార్గదర్శి ఆర్ఎస్ఎస్ గురించి చెప్పనే అక్కర్లేదు. దాని ఎగశ్వాస దిగశ్వాస రెండూ అధిపత్యకులమే. యూపీలో చూశాం కదా. అక్కడ గతంలో ఎన్నికల ముందు బీజేపీ సోషల్ ఇంజనీరింగ్ చేసి ముఖ్యమంత్రిగా ఒక బీసీ నేతను ఎంపిక చేయవచ్చు అన్న భ్రమను సృష్టించింది. చివరకు అధికారాన్ని రాజ్‌పుత్ అయిన యోగి ఆదిత్యనాథ్ చేతుల్లో పెట్టింది. యూపీలో చేయలేని పనిని తెలంగాణలో మోడీ చేస్తారట. 'గాలికి పోయే పేలంపిండి కృష్ణార్పణం' అంటే ఇదే. యుపిలో ఎస్పీ, బీఎస్పీలు తమ అవకాశవాదం వల్ల ఆ ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1983 శాసనసభ ఎన్నికల్లోనూ, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ ఎన్టీఆర్ నాయకత్వంలోని తెలుగు దేశానికి బీసీ కార్డు బాగా ఉపయోగపడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదే విధానాన్ని ఆయన అనుసరించారు. శాశ్వతమనుకొన్న కాంగ్రెస్ కోటలను కూలగొట్టారు. బీసీని ముఖ్యమంత్రిని చేస్తానని ఎన్టీఆర్ చెప్పలేదు. కాని మంత్రివర్గ సామాజిక సమతుల్యంలో కొన్ని మార్పులు చేశారు. యూపీలో అలా జరగలేదు. మైనారిటీలు, ఎస్సీలు బలహీన వర్గాలపై ఆ రాష్ట్రంలో ఇదివరకెప్పుడూ లేనన్ని దౌర్జన్యాలు అఘాయిత్యాలు గోరక్‌పూర్ బాబా(మఠాధిపతి) బుల్డోజర్ బాబాగా పేరు గడించారు.

ఎన్నికల్లో గెలవడం కోసం 2013లో బీజేపీ ముజఫర్ నగర్‌లో మతకలహాలను సృష్టించింది. వేలాది మంది ముస్లింలకు నేటి పాలస్తీనియన్లకు పట్టిన గతిని పట్టించింది. ఊళ్లకు ఊళ్లు ఖాళీ అయ్యాయి పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించాయి. అదంతా జాట్లను ఎన్నికలో తనవైపు తిప్పుకొనడానికి బీజేపీ చేసిన దుర్మార్గం. ఇదే కుటిల విధానాన్ని మరో రూపంలో బీజేపీ చేయగలదు. తన రాజకీయ అవసరాల కోసం కొన్ని ఆధిపత్య కులాలను బీసీ జాబితాలో అది తప్పక చేర్చుతుంది. ఏ మాత్రం అవకాశం దొరికినా నేడు నిజమైన వెనుకబడిన కులాలపై అది శఠగోపం పెడ్తుంది.



> ఎన్నికల్లో గెలవడం కోసం 2013లో బీజేపీ ముజఫర్‌నగర్‌లో మతకలహాలను సృష్టించింది. వేలాది మంది ముస్లింలకు నేటి పాలస్తీనియన్లకు పట్టిన గతిని పట్టించింది. ఊళ్లకు ఊళ్లు ఖాళీ అయ్యాయి పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించాయి. అదంతా జాట్లను ఎన్నికలో తనవైపు తిప్పుకొనడానికి బీజేపీ చేసిన దుర్మార్గం. ఇదే కుటిల విధానాన్ని మరో రూపంలో బీజేపీ చేయగలదు. తన రాజకీయ అవసరాల కోసం కొన్ని ఆధిపత్య కులాలను బీసీ జాబితాలో అది తప్పక చేర్చుతుంది. ఏ మాత్రం అవకాశం దొరికినా నేడు నిజమైన వెనుకబడిన కులాలపై అది శఠగోపం పెడ్తుంది.

> హిందూమతం ఏకశిల వంటిదని నమ్మించడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నది. హిందువుల్లోని అంతరాలను మరుగు పర్చాలని చూస్తున్నది. కులగణన జరిగితే అంతరాలు ఏ స్థాయిలో ఉన్నాయో బయట పడతాయి. తన మనుస్మృతిని పొగిడేవారు చాతుర్వర్ణ వ్యవస్థను ఎలా వద్దంటారు? అంటరానితనంపై కుల అసమానతలపై ఎందుకు పోరాడుతారు? కర్మసిద్ధాంతాన్ని ప్రభోదించే వారు నిచ్చెనమెట్ల కులవ్యవస్తను ఎందుకు నాశనం చేయాలను కొంటారు? కనుక పైకి ఏమి చెప్పినా సిద్ధాంత పరంగానే బీజేపీ బీసీల, ప్రత్యేకించి బాగా వెనుకబడిన బీసీల ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభ్యున్నతికి వ్యతిరేకం.

ఇండియా కూటమిలోని అన్ని పార్టీలు నేడు కులగణన కోసం డిమాండ్ చేస్తున్నాయి. యుపిఎ ప్రభుత్వ హయాంలో, 2011 జనాభా లెక్కల సేకరణ సంర్భంగా కులగణన కూడా చేపట్టాలని భావించారు. కాని కాంగ్రెస్‌లోని కొందరు నాయకుల నుండి వచ్చిన ఒత్తిడి వల్ల ఆ ప్రయత్నం విరమించుకొన్నారు. ఇతర పార్టీల ఒత్తిడి మీద గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖల ద్వారా సోషియో ఎకనామిక్ కాస్ట్ సెన్సెస్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం జరిపించింది. దాని కోసం రూ.5 వేల కోట్లు ఖర్చు చేసింది. 2014 లోక్‌సభ ఎన్నికలకు కొద్దిగా ముందు ఆ కసరత్తు ముగిసింది.

ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం. అందులో సవాలక్ష తప్పులున్నాయంటూ ఆ గణాంకాలను వెల్లడించలేదు. 1931లో బ్రిటిష్ పాలన కుల గణాంకాల లెక్క తీశారు. 2010 మే నెలలో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో అనంతకుమార్(బీజేపీ) కులగణన జరపాలని డిమాండ్ చేశారు. ఇతర పక్షాల సభ్యులతోపాటు బీజేపీ సభ్యుడు గోపినాథ్ ముండే కూడా కులగణన జరపాలని కోరారు ప్రతిపక్షంలో కులగణన జరపాలని పట్టుబట్టిన బీజేపీ తాను అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తలేదు.

హిందూమతం ఏకశిల వంటిదని నమ్మించడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నది. హిందువుల్లోని అంతరాలను మరుగుపర్చాలని చూస్తున్నది. కులగణన జరిగితే అంతరాలు ఏ స్థాయిలో ఉన్నాయో బయట పడతాయి. తన మనుస్మృతిని పొగిడేవారు చాతుర్వర్ణ వ్యవస్థను ఎలా వద్దంటారు? అంటరానితనంపై కుల అసమానతలపై ఎందుకు పోరాడుతారు? కర్మసిద్ధాంతాన్ని ప్రభోదించేవారు నిచ్చెనమెట్ల కులవ్యవస్తను ఎందుకు నాశనం చేయాలనుకొంటారు? కనుక పైకి ఏమి చెప్పినా సిద్ధాంత పరంగానే బీజేపీ బీసీల, ప్రత్యేకించి బాగా వెనుకబడిన బీసీల ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభ్యున్నతికి వ్యతిరేకం.

బీజేపీ ప్రభుత్వం రోహిణి కమిషన్ సిఫారసులను కూడా అమలు చేయడానికి సిద్ధంగా లేదు. ఆ సిఫారసులను అమలు చేస్తే బీసీల్లో అభివృద్ధి చెందిన కులాల నుండి వ్యతిరేకత వస్తుందని భయం. ఎం.ఆర్.బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూరు కేసులో 1963లో సుప్రీం కోర్టు తీర్పు చెప్తూ రాజ్యాంగంలోని 15(4) ఆర్టికల్ బీసీల్లో వర్గీకరణ చేయాలని చెప్పడం లేదని పేర్కొంది. కాని ఇందిరా సాహ్నే కేసులో, (1992) బీసీల్లో వర్గీకరణ చేయరాదన్న రాజ్యాంగ పరమైన, చట్టపరమైన నిషేధం ఏదీ లేదని అదే సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయినప్పటికీ రోహిణీ కమిటీ సిఫారసుల మేరకు బీసీల్లో వర్గీకరణ జరిపి అత్యంత వెనుకబడినవారికి మేలుచేసే ఉద్దేశం మోడీలో బీజేపీ ఏ కోశానా ఉండే అవకాశం లేదు. కనుక బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభను దగాకోరు సభగానే చూడాలి.

కార్పొరేట్ల కోసమేనా 'పీఎం-ఈబస్-సేవా' పథకం

రూ. 20వేల కోట్లు కేంద్ర ప్రభుత్వ సహాయంతో దేశంలో పదివేల విద్యుత్ బస్‌లను తీసుకొస్తామని, దేశ పర్యావరణ పరిరక్షణలో ఇది కీలకమైన నిర్ణయమని భారత ప్రధానమంత్రి ప్రకటన చేశారు. 2023 ఆగస్టు 16న ఈ పథకాన్ని కేంద్రం అనుమతించింది. మార్చి 2037 వరకు గాని లేదా పదేండ్లు ఏది ముందైతే అప్పటి వరకు ఈ స్కీం అమల్లో వుంటుంది. ఈ పథకం అమలుకు మొత్తం రూ.57,613 కోట్లు ఖర్చవుతుందని, కేంద్రం 20వేల కోట్లు ఖర్చు భరిస్తే 37,613 కోట్లు రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చాలని పథకంలో ప్రతిపాదించాయి.

ఈ పథకం మూడు లక్షలు, ఆపైన జనాభా వున్న పట్టణాలలో అమలు చేస్తారు. దీనిలో మొదటి విభాగం కింది 169 పట్టణాలలో సిటీ బస్‌లు నడపడానికి, రెండవది 181 పట్టణాలలో గ్రీన్ అర్బన్ మొబిలిటీ ఇన్షియేటివ్స్ కోసం బైక్ షేరింగ్, సైకిల్స్, జాతీయ కామన్ మొబిలిటీ కార్డు, I TIMS, మల్టీ మోడల్ ఇంటర్ చెంజ్ ఫెసిలిటీస్‌ను అభివృద్ధి చేస్తారు. మొదటి భాగానికి సంబంధించిన గైడ్‌లైన్స్‌ను "Ministry of Housing and Urban Affairs" మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. రెండవ విభాగానికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల కావలసి వున్నది. మొదటి విభాగంలో నాలుగు భాగాలుగా పట్టణాలను వర్గీకరించారు. 20-40 లక్షల జనాభా వున్న పట్టణాలు, 10-20 లక్షలు, 5-10 లక్షలు, 3 నుండి 5 లక్షలు వున్న పట్టణాలుగా విభజించారు. వీటిలో ఈపాటికే వ్యవస్థీకృత రవాణా వున్నవి. లేనివిగా విభజించారు. వ్యవస్థీకృత రవాణాలేని పట్టణాలను మొదటి ప్రాధాన్యత ఇస్తారు. 20-40 లక్షల జనాభా వున్న పట్టణాలు 10, 10-20 లక్షల జనాభా వుంచి 37, 5-10 లక్షల జనాభా వున్నవి 44 పట్టణాలు, 3-5 లక్షల మధ్య జనాభా వున్న పట్టణాలు 76 వున్నాయి. మొత్తం 169 పట్టణాలలో తెలంగాణాలో వరంగల్, నిజామాబాద్ పట్టణాలు వున్నాయి.

నిబంధనలు ఏమిటి ? : మొదటిది ఈ పథకం మొత్తం 'పీపీపీ' పద్ధతిలోనే అమలు చేస్తారు. బస్‌లను ప్రయివేటు కంపెనీల నుండి సమీకరించే పని సీఈఎస్ఎల్ (Convergence Emerges Service Limited) సంస్థ నిర్వహిస్తుంది. మొత్తం పథకం అంత జీసీసీ (గ్రాస్ట్ కాస్ట్ కాంట్రాక్ట్) - Wet Lease మోడల్‌లోనే అమలు చేస్తారు. అంటే బస్ ఆపరేటర్ బిడ్‌లో కోట్ చేసిన మొత్తాన్ని యజమానికి చెల్లించాలి - బస్‌ల నిర్వహణ, మెయింటెనెన్స్ అంతా యజమానిదే. డిపోలను విద్యుత్‌కు అప్‌గ్రేడ్ చేసే దానికి కొంత మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వ అసిస్టెన్స్‌గా ఇస్తుంది. (1) 3 నుండి 40 లక్షల జనాభా వున్న పట్టణాలు, 3 లక్షల కంటే తక్కువ జనాభా వున్న రాష్ట్ర రాజధాని నగరాలలో 60శాతం నిధులను కేంద్రం ఇస్తుంది. 40 శాతం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలి. (2) హిల్ రాష్ట్ర రాజధాని పట్టణాలు, నార్త్ ఈస్టన్ రీజియన్, రాష్ట్ర రాజధాని పట్టణాలు, అసెంబ్లీలు వున్న కేంద్ర పాలిత ప్రాంత రాజధాని పట్టణాలు -90శాతం నిధులు. (3) అసెంబ్లీలో లేని కేంద్ర పాలిత ప్రాంత రాజధాని పట్టణాలలో 100 శాతం నిధులను కేంద్రం భరిస్తుంది.50 బస్‌ల కోసం డిపో విద్యుద్దీకరణకు రూ. 10 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఇందుకు అవసరమైన భూమిని ఆ స్థానిక రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. అయితే కేంద్రం ఇచ్చే ఆర్థిక సహాయంలో భూమి, పునరావాసం, టాక్స్‌లు వంటివి ఖర్చు కింద లెక్కించరు. మిగిలిన వాటిపైనే నిర్దేశించిన పద్ధతిలో లెక్కించి ఆ పర్సంటేజ్‌లో సహాయం అందిస్తారు. మీటర్ పవర్ మౌలిక వసతుల కోసం అయ్యే ఖర్చును కేంద్రం భరిస్తుంది.

పథకం ఎలా అమలవుతుంది?:

జనాభా ఆధారంగా ఎంపిక చేసిన పట్టణాలు	విద్యుత్ బస్‌లు ఎన్ని అలాట్ చేస్తారు?	కేంద్ర సహాయం		
		స్టాడర్డ్ మోడల్	మిడిల్	మిని
20-40 లక్షలు	150	రూ.24	రూ.22	రూ.20
10 - 20 లక్షలు	100	రూ.24	రూ.22	రూ.20
5 - 10 లక్షలు	100	రూ.24	రూ.22	రూ.20
3 - 5 లక్షలు	100	రూ.24	రూ.22	రూ.20

సీఈఎస్ఎల్ ద్వారా టెండర్ పొందిన సంస్థ బస్‌ల నిర్వహణకు సంబంధించిన వివరాలు ఇవ్వాలి. అలా ఇచ్చిన వెంటనే స్టాం డర్డ్ మోడల్ బస్ అయితే కి.మీ. రూ.24, మిడిల్ మోడల్ అయితే రూ.22, మిని అయితే రూ.20 కేంద్ర ప్రభుత్వం అసి స్టెన్స్ కింద ఇస్తుంది. మొదటి క్వార్టర్‌కు అడ్వాన్స్‌గా చెల్లి స్తారు. ఈ చెల్లింపులు అన్నింటికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వాలి. దీనర్థం ఏమిటంటే 'వయబిలిటీ గాప్ ఫండ్'ను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. **ఉదా :** ఒక బస్ ఆపరేషన్ కోసం కి.మీ. రూ.65 మేర టెండర్ పొందిన బస్ ఆపరేటర్ సంస్థకు (స్టాండర్డ్ మోడల్) రూ.65 చెల్లింపులో, 24 రూపాయలు కేంద్రం అసి స్టెన్స్ కింద ఇస్తుంది. ఆ బస్‌కు ఆదాయం కి.మీ. రూ.30కి, టిక్కెటేతర ఆదాయం రూ.2 వచ్చింది అనుకుందాము. అప్పుడు మొత్తం కలిపి ఆదాయం రూ.32, కేంద్ర ప్రభుత్వం సహాయం రూ.24 వెరసి మొత్తం రూ.56 అయింది. తక్కువగా వున్న ఆ తొమ్మిది రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్న గ్యారెంటీని ఇవ్వాలి. అంటే ఇక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.33 సబ్సిడీ కింద ప్రయివేటు ఆపరేటర్‌కు చెల్లిస్తారు. ఇప్పటివరకు అమలవుతున్న విద్యుత్ బస్‌లు (Fame-1, Fame-2, NEBP) స్కీంలలో అదనంగా చెల్లించాల్సిన డబ్బులు ఆర్టీసిలే చెల్లించాల్సి వస్తుందన్న కోణంలో చూసినప్పుడు, ఇది బాగుంటుందని అనిపిస్తుంది. ఈ మొత్తం స్కీం పదేండ్లు, బస్‌ల టెండర్ పన్నెండేండ్లు అమలులో వుంటుంది. పథకం మొత్తం (జీసీసీ) మోడల్ అమలవుతుంది. కమర్షియల్ ఆపరేషన్స్ ప్రారంభమైన పిదప కాంట్రాక్ట్ రేట్‌లో ప్రతి యేడు 5శాతం పెరుగుదలను అమలు చేస్తారు.

స్థానిక పరిపాలన సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం సంతకం చేస్తూ గ్యారెంటీ ఇవ్వాల్సినవి : (1) బిడ్డర్‌కు ఆథరైజేషన్ లెటర్ స్థానిక సంస్థనే ఇవ్వాలి. (2) ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చర్‌తో కన్సెషన్ అగ్రిమెంటుపై స్థానిక సంస్థ సంతకం చేయాలి. (3) ఆ పట్టణంలోని రోడ్ల మెయింటెనెన్స్ బాధ్యతను చూసుకుంటామని అవగాహన పత్రంపై స్థానిక సంస్థ సంతకం చేయాలి. (4) నగర బస్ రూట్స్‌లో ప్రయివేటు ఆపరేటర్స్‌ను నియంత్రిస్తామన్న గ్యారెంటీని రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారులు ఎంఓయుపై సంతకం చేస్తూ గ్యారెంటీ ఇవ్వాలి. (5) ప్రయివేటు ఆపరేటర్స్‌కు నమ్మకం కలిగించేందుకు బిడ్ ప్రకారం రావలసిన డబ్బులు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వాలనే నిబంధన వుంది.



> విద్యుత్ బస్‌ల ఆపరేటర్స్ ప్రయోజనాల కోసం స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యారెంటీ ఇవ్వాలని కేంద్రం విధానాన్ని తీసుకొచ్చింది. నిజంగా విద్యుత్ బస్‌ల వల్ల ఎంతమేరకు కాలుష్యం తగ్గుతుందో లెక్కలు లేవు? చార్జింగ్ టైమ్‌లో వెలువడే కాలుష్యం ఎంత? బ్యాటరీలను స్వాప్ చేసేటప్పుడు వెలువడే కాలుష్యం ఎంత? ఇటువంటి అన్నింటికి ఏ లెక్కలు అందుబాటులో లేవు. కానీ ఆ పేరుతో ప్రజా రవాణాను మొత్తం జాతీయ, అంతర్జాతీయ ప్రయివేటు సంస్థలకు కట్టబెడ్తున్నారు. ప్రయివేటు సంస్థలకు వయాబిలిటీ గ్యాప్ ఫండ్ గ్యారెంటీ చేస్తున్న ప్రభుత్వాలు అదే ఫండును ఆర్టీసీలకు ఇస్తే ఆ సంస్థలు అమరింత విస్తృత స్థాయిలో ప్రజలకు సేవలు అందిస్తాయి.

ఆర్టీసీల పరిరక్షణ కోసం కార్మిక సంఘాలు కోరిందేమిటి? : ఆర్టీసీల అభివృద్ధి, విస్తరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమి చేయాలో తెలియచేస్తూ దశాబ్దాల కాలం నుండి కార్మిక సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. (1) చట్ట ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాల్సిన మూలధన పెట్టుబడిని పునరుద్ధరించాలి. (2) ఆర్టీసీలను ప్రజా రవాణా సంస్థగా అంగీకరిస్తూ ఆదాయానికి, ఖర్చుకు మధ్య వస్తున్న గ్యాప్‌ను రీ-ఎంబర్స్ చేయాలి. (3) కాలం చెల్లిన బస్‌ల పునరుద్ధరణ కోసం కేంద్రమే బస్‌లు కొని దమాషా ప్రాతిపదికన ఆర్టీసీలకు ఇవ్వాలి (4) ఆర్టీసిలు వాడుతున్న డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్‌లను కనిష్ట స్థాయికి తగ్గించాలి. (5) ఆర్టీసీల నుండి వసూలు చేస్తున్న పన్ను రద్దు చేయాలి. (6) రూరల్, అర్బన్ బస్‌లపై అన్ని రకాల పన్నులను తొలగించాలి. (7) మోటారు వాహన పన్నును తగ్గించాలి. (8) ఆర్టీసీలను నిర్వీర్యం చేసేలా వున్న ఎం.వి.యాక్ట్ - 2019లో అవసరమైన సవరణలు చేయాలి. (9) రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం రెండు శాతం నిధులను ఆర్టీసీ అభివృద్ధికి కేటాయించాలి. (10) ఆర్టీసీలు ఇస్తున్న రాయితీలను వందశాతం రీ-ఎంబర్స్‌మెంటు చేస్తూ ప్రతి నెలా చెల్లించాలి. వీటి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోగా, ఆర్టీసీలను నిర్వీర్యం చేసేందుకు అనేక విధానాలను ముందుకు తెస్తున్నారు. ఎం.వి.యాక్ట్‌లో కేంద్రం తెచ్చిన పర్మిట్ విధానంలో మార్పులు వల్ల ప్రయివేటు బస్‌ల అక్రమ రవాణా కాస్తా సక్రమ రవాణాగా మారిపోతున్నది. ఆర్టీసీ నష్టాల పేరుతో ఇటు కార్మికులపైన, ప్రజలపైన విపరీతమైన భారాలు మోపుతున్నారు. టీఎస్ఆర్టీసీలాంటి సంస్థలలోనే పదేండ్లుగా వేతనాలు పెంచలేదు. చట్టబద్ధమైన అనేక ప్రయోజనాలు అమలు జరగడం లేదు. కార్మికుల సొమ్మును సుమారు రూ.4 వేల కోట్లు ఆర్టీసి వాడుకొని, చెల్లించనందున 45వేల కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆర్టీసీలను పరిరక్షించడంలో ఎటువంటి చొరవ చూపని (వాటిని నిర్వీర్యం చేస్తున్న) కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్‌ల పేరుతో దేశ, అంతర్జాతీయ రవాణా సంస్థల ప్రయోజనాల కోసం పని చేస్తున్నాయి. విద్యుత్ బస్‌ల ఆపరేటర్స్ ప్రయోజనాల కోసం స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యారెంటీ ఇవ్వాలని కేంద్రం విధానాన్ని తీసుకొచ్చింది. నిజంగా విద్యుత్ బస్‌ల వల్ల ఎంతమేరకు కాలుష్యం తగ్గుతుందో లెక్కలు లేవు? చార్జింగ్ టైమ్‌లో వెలువడే కాలుష్యం ఎంత? బ్యాటరీలను స్వాప్ చేసేటప్పుడు వెలువడే కాలుష్యం ఎంత? ఇటువంటి అన్నింటికి ఏ లెక్కలు అందుబాటులో లేవు. కానీ ఆ పేరుతో ప్రజా రవాణాను మొత్తం జాతీయ, అంతర్జాతీయ ప్రయివేటు సంస్థలకు కట్టబెడ్తున్నారు. ప్రయివేటు సంస్థలకు వయాబిలిటీ గ్యాప్ ఫండ్ గ్యారెంటీ చేస్తున్న ప్రభుత్వాలు అదే ఫండును ఆర్టీసీలకు ఇస్తే ఆ సంస్థలు అమరింత విస్తృత స్థాయిలో ప్రజలకు సేవలు అందిస్తాయి. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు జరిగి అనేక మంది కొత్తగా ఉద్యోగాలు పొందుతారు. ఇప్పటికైనా ఆర్టీసీల పటిష్టతకు, పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేసేలా పాలకులపై ఒత్తిడి చేయాలి.

- పుష్పా శ్రీనివాస్

ఉన్నత చదువుల్లో అమ్మాయిలు అదుర్స్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రథమ సంవత్సరంలో అమ్మాయిలే ఎక్కువ మంది ప్రవేశం పొందారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఎక్కువ మంది అబ్బాయిలే ఉన్నా డిగ్రీలో చేరే వారిలో మాత్రం అమ్మాయిలుండడం గమనార్హం. ప్రస్తుత విద్యాసంవత్సరంలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో 1064 కాలేజీల్లో మొత్తం 3,89,049 సీట్లుంటే, 2,04,674 (52.61 శాతం) మంది విద్యార్థులు చేరారు. ఇంకా 1,84,375 (47.39 శాతం) సీట్లు మిగిలాయి. అయితే డిగ్రీలో చేరిన వారిలో ఎక్కువ మంది అమ్మాయిలే ఉన్నారు. 96,524 (47.16 శాతం) మంది అబ్బాయిలు ప్రవేశం పొందగా, 1,08,150 (52.84 శాతం) మంది అమ్మాయిలు చేరారు. అంటే అబ్బాయిల కన్నా అమ్మాయిలు 11,626 (5.68 శాతం) మంది అధికరంగా ప్రవేశం పొందారు. అమ్మాయిల కోసం ఎస్సీ,ఎస్టీ డిగ్రీ గురుకులాలను ప్రభుత్వం ప్రారంభించడం ఓ కారణంగా ఉన్నది. 18 ఏండ్లు నిండిన అమ్మాయిలకు పెండ్లి అయితేనే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం వర్తింపచేస్తున్నది. అందుకే ఉన్నత విద్య చదివేందుకు ఎక్కువ మంది అమ్మాయిలు ఆసక్తి చూపుతున్నారని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇంకోవైపు అమ్మాయిలను ఉన్నత విద్యకు పంపించేందుకు తల్లిదండ్రులు కూడా అంగీకరిస్తున్నారు. దీంతో ఉన్నత విద్యలో అమ్మాయిలు ఎక్కువ మంది చదువుతున్నారు.

ప్రయివేటు కాలేజీల్లో మిగిలిన సీట్లు 1.38 లక్షలు

రాష్ట్రంలో 1064 డిగ్రీ కాలేజీల్లో 3,89,049 సీట్లుంటే 2,04,674 సీట్లు నిండాయి. ఇందులో 155 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 87,112 సీట్లకుగాను 53,886 మంది విద్యార్థులు చేరారు. వాటిలో ఇంకా 33,226 సీట్లు మిగిలాయి. 831 ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో 2,80,683 సీట్లుంటే 1,41,772 మంది ప్రవేశం పొందారు. వాటిలో ఇంకా 1,38,911 సీట్లు మిగిలిపోయాయి. 78 గురుకుల డిగ్రీ కాలేజీల్లో 21,254 సీట్లకుగాను 9,016 మంది విద్యార్థులు చేరారు. వాటిలో ఇంకా 12,238 సీట్లు మిగిలాయి.

82 వేల సీట్లకు కోత పడినా...

రాష్ట్రంలో 15 మంది విద్యార్థుల కంటే తక్కువ మంది చేరిన డిగ్రీ కోర్సులను ఉన్నత విద్యామండలి గతంలోనే రద్దు చేసింది. ఇంకోవైపు సున్నా ప్రవేశాలు నమోదైన పలు డిగ్రీ కాలేజీలను మూసేసింది. దీంతో డిగ్రీ సీట్లకు భారీగా కోత పడింది. 2021-22 విద్యాసంవత్సరంలో 1088 డిగ్రీ కాలేజీల్లో 4,68,880 సీట్లున్నాయి. 2022-22 విద్యాసంవత్సరంలో 1073 డిగ్రీ కాలేజీల్లో 3,86,544 సీట్లకు తగ్గాయి. అంటే 82,336 సీట్లకు కోతపడింది. 2023-24 విద్యాసంవత్సరంలో 1064 డిగ్రీ కాలేజీల్లో 3,89,049 సీట్లున్నాయి. అంటే గతేడాది కంటే ఈ ఏడాది 2,713 సీట్లు పెరగడం గమనార్హం.

2021-22 విద్యాసంవత్సరంలో 2,55,132 మంది, 2022-23 విద్యాసంవత్సరంలో 2,12,818 మంది, ప్రస్తుత విద్యాసంవత్సరం 2023-24లో 2,04,674 మంది విద్యార్థులు చేరారు. గతం కంటే ఈ ఏడాది డిగ్రీ కాలేజీల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గడం గమనార్హం. 2021-22లో కంటే 2022-23 విద్యాసంవత్సరంలో 42,314 మంది తగ్గారు. 2022-23 కంటే ప్రస్తుత విద్యానంవత్సరంలో 8,144 మంది విద్యార్థులు తగ్గడం గమనార్హం.



బీకాం కోర్సుకే భారీగా డిమాండ్

డిగ్రీలో బీకాం కోర్సుకే భారీగా డిమాండ్ ఉన్నది. ఆ కోర్సులో చేరేందుకే ఎక్కువ మంది విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. డిగ్రీలో మొత్తం 2,04,674 మంది చేరితో బీకాంలోనే 85,153 (41.60 శాతం) మంది విద్యార్థులు చేరడం గమనార్హం. బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో 43,180 మంది, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 25,937 మంది కలిపి బీఎస్సీ కోర్సులో 69,117 మంది చేరారు. బీఏలో 29,752 మంది, బీబీఏలో 15,160 మంది, బీసీఏలో 4,706 మంది, డిప్లొమాలో 595 మంది, బీబీఎంలో 107 మంది, బీఎస్‌డబ్ల్యూలో 56 మంది, బీ ఒకేషనల్‌లో 28 మంది ప్రవేశం పొందారు. ఉన్నత విద్యామండలి కొత్తగా ప్రవేశపెట్టిన స్కిల్ సెక్టార్ కోర్సుల్లో 1,398 మంది, బీఎస్సీ ఆనర్స్ (కంప్యూటర్ సైన్స్) కోర్సులో 889 మంది విద్యార్థులు చేరారు.

కాంగ్రెస్‌లో చేరిన రాములమ్మ

కండువా కప్పి ఆహ్వానించిన ఖర్గే



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ సీనియర్ నేత విజయశాంతి, బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మందా జగన్నాథం కాంగ్రెస్‌లో చేరారు. ఖర్గే సమక్షంలో శుక్రవారం విజయశాంతి కాంగ్రెస్‌లో చేరారు. గాంధీభవన్‌లో మందా జగన్నాథం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కర్నాటక మంత్రి బోసు రాజు, ఏఐసీసీ నేత కొప్పుల రాజు, కుసుమకుమార్ తదితరులు ఉన్నారు.

పిల్లలకు శాపంగా మారిన పోషకాహార లోపం

- అపోలో అస్పత్రి జేఎండీ సంగీతా రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పిల్లలకు పోషకాహార లోపం శాపంగా మారిందని అపోలో అస్పత్రుల డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఆస్కీలో ఆరోగ్య సమానత్వం..ఇండియాస్ మూన్స్ అనే అంశంపై ఏర్పాటు చేసిన డాక్టర్ చంద్రమౌళి మెమోరియల్ లెక్చర్ లో ఆమె కీలక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య సమానత్వం అనేది నేడు పెద్ద సవాలుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.. ప్రపంచ వ్యాప్తంగా 50 శాతం మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, ఇండియాలో ఈ సంఖ్య 51 శాతం ఉందని అన్నారు. స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్కీ ఇన్‌చార్జి డైరెక్టర్ జనరల్ నిర్మలా బగాచి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ పద్మనాభం, డాక్టర్ నాగభూషణం పాల్గొన్నారు.

ప్రగతి భవన్‌ను ప్రజా పాలన భవన్‌గా మారుస్తాం

- రాహుల్ గాంధీ ట్వీట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి అధికార భవనమైన ప్రగతి భవన్‌ను కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాత ప్రజా పాలన భవన్‌గా మార్చనున్నట్టు కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'ప్రజా పాలన భవన్‌ను 24/7 తెరిచే ఉంచుతామని తెలిపారు. సీఎం, మంత్రులందరూ ప్రజా దర్బార్‌లు నిర్వహించి ప్రజల సమస్యలను 72 గంటల్లో పరిష్కరించనున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ విజయంతో 'ప్రజల తెలంగాణ' సువర్ణ యుగానికి నాంది పలుకుతుందని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో

పంటలను రక్షించాలి

- నష్టాన్ని అంచనావేసి పరిహారం చెల్లించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వరి పంట కోత దశలో నీరు లేక ఎండిపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తెలిపింది. మరోవైపు పత్తి, మొక్కజొన్న పంటలకు క్రిమీకీటకాలు సోకడంతో లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లుతున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. వ్యవసాయ, ఇరిగేషన్ శాఖలు సమన్వయం చేసుకుని ఉన్న నీటిని వినియోగించి పంటలను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్షాభావం వల్ల వరినాట్లతోపాటు ఇతర మెట్టపంటలు ఆలస్యంగా వేయడంతో మరో 15 రోజుల్లో చేతికి వస్తుందని పేర్కొన్నారు. ఈదశలో వరికిపాలు పట్టే దశలో నీళ్లు లేకపోవడంతో కంకులు తాలుగా మారుతున్నదని తెలిపారు. దీనికితోడు పత్తి, మొక్కజొన్నలకు తెగులు సోకడంతో దిగుబడులు తగ్గుతున్నాయని వివరించారు. సాగునీటి కోసం వైరా, జూరాల ప్రాజెక్టుల కింద రైతులు ఆందోళనలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ ఏడాది వానాకాలం జూన్‌లో 44 శాతం వర్షపాతం తక్కువ పడిందని తెలిపారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల్లో తక్కువ నీరు మాత్రమే ఉందని పేర్కొన్నారు. అయినా సాగర్‌లో 510 అడుగుల వరకు నీటిని వినియోగించే అవకాశముందని తెలిపారు. శ్రీరాంసాగర్ ఎడమ కాలువ పంటలకు నీరు ఇవ్వడమేగాక ఆలేరు రిజర్వాయర్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు నీటిని అందించి పంటలను కాపాడొచ్చని సూచించారు. జూరాల ప్రాజెక్టు చివరి ఆయకట్టు భూములకు సాగునీరు ఇచ్చే అవకాశముందని పేర్కొన్నారు.

శ్రీరాంసాగర్ కాకతీయ కాలువ రెండో దశకు ఒకసారి మాత్రమే పంటలకు నీరు ఇచ్చారని గుర్తు చేశారు. కాళేశ్వరం దెబ్బతినడంతో మిడ్‌మానేరు, లోయర్ మానేర్‌లకు నీరు రావడం తగ్గిందని వివరించారు. లోయర్ మానేరు నీరు కరీంనగర్ వరకే పరిమితమైందని తెలిపారు. ఇరిగేషన్ శాఖ గానీ, వ్యవసాయశాఖ గానీ నీటిని సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు.

గతేదాది రూ.10 వేల పరిహారం ఇంకా చెల్లించలేదు

గత రెండేండ్లుగా అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నాయని తమ్మినేని తెలిపారు. ఈ ఏడాది వర్షాభావం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని ఆందోలన వ్యక్తం చేశారు. ఏటా రూ.నాలుగు వేల కోట్ల పంటలకు నష్టం వాటిల్లుతున్నట్టు గణాంకాలు చెప్తున్నాయని వివరించారు.

గతేడాది ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తానంటూ సీఎం కేసీఆర్ ప్రకటించినా ఇంతవరకు చెల్లించలేదని పేర్కొన్నారు. చివరికి 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు కూడా రైతులకు పంపిణీ చేయలేదని తెలిపారు. కరువు, వరదల నష్టాలతోపాటు క్రిమికీటకాల దాడుల వల్ల నష్టపోయిన రైతులకు గత తొమ్మిదేండ్లలో ఏనాడూ తగిన పరిహారం లభించలేదని విమర్శించారు.

బీజేపీ-బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం

- ఒక కుటుంబం కోసం రాష్ట్రాన్ని ఏర్పాటు చేయలేదు :

ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్‌ఖర్గే, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

- ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

బీజేపీ బీఆర్ఎస్.. రహస్య ఒప్పందం చేసుకొని కాంగ్రెస్‌ను ఓడించేందుకు ప్రయత్నిస్తున్నాయని, అవి ఎంత ప్రయత్నించినా కాంగ్రెస్ పార్టీ భయపడేది లేదని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే స్పష్టంచేశారు. ప్రజలందరి పోరాటం చూసి వారి ఆకాంక్షలు నెరవేరాలని సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, ఒక కుటుంబం కోసం రాష్ట్రాన్ని ఏర్పాటు చేయలేదని తెలిపారు. కానీ ప్రజల ఆశలు నెరవేరలేదని అని అన్నారు. హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభలో ఆయనతో పాటు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. ప్రధాని మోడీ.. ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని అబద్ధాలు చెప్పారని, 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల ఆదాయం డబుల్ చేస్తామన్నారన్నారు. కానీ ఇంత వరకు పట్టించుకున్నా పాపాన పోలేదన్నారు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ అధికారం చేపట్టాక ప్రజలపై అప్పులభారం మోపారని, ఇప్పుడు ఒక్కొక్కరిపై రూ.1.50లక్షల అప్పు ఉందని తెలిపారు. అందుకే ప్రజలను మోసం చేసిన మోడీ, కేసీఆర్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల కోసమే పోరాటం చేస్తుందని, తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్‌తోనూ పోరాటం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాషాయ పార్టీ కనిపించడం లేదన్నారు. కేసీఆర్‌కు సహకరించేందుకే బీజేపీ పోటీ నుంచి వైదొలిగిందని ఆరోపించారు. ఇలా తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కలిసే పోటీ చేస్తున్నాయని విమర్శించారు. అందుకే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మోడీ, కేసీఆర్ మధ్య ఒప్పందం ఉందని, అందుకే మోడీ తెచ్చిన అన్ని బిల్లులకు కేసీఆర్ మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన తనను సోనియా గాంధీ టీపీసీసీ అధ్యక్షుడిని చేశారని, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి తన ఊపిరి ఉన్నంత వరకు పోరాడతానని స్పష్టం చేశారు. 2018లో కొడంగల్‌లో కేసీఆర్ తనపై కుట్రచేశారని ఆరోపించారు. ఆ తర్వాత ప్రశ్నించే గొంతుకగా మల్కాజ్‌గిరి నుంచి ఎంపీగా గెలిచానన్నారు. దేశంలో అభివృద్ధి కాంగ్రెస్‌తోనే జరిగిందని, కాళేశ్వరం పేరుతో కేసీఆర్ అవినీతికి పాల్పడ్డారని, అందువల్లే మూడేండ్లకే మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోయిందన్నారు. వెయ్యి కోట్లతో కట్టిన శ్రీశైలం ప్రాజెక్టు చెక్కు చెదరలేదని, కేసీఆర్ దోపిడీకి మేడిగడ్డ బలైపోయిందని విమర్శించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ చేతిలో బందీ అయిందని, పోరాటాల గడ్డను తాగుబోతుల అడ్డగా మారుస్తున్నారని మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సభలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణకు అభయహస్తం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ 'అభయహస్తం' పేరుతో మ్యానిఫెస్టోను అందిస్తున్నదని ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే చెప్పారు. తొలి క్యాబినెట్ సమావేశంలోనే ఆరు గ్యారంటీలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. అది చేయకపోతే అధిష్టానం జోక్యం చేసుకుంటుందన్నదని పరోక్షంగా పార్టీ నేతలను హెచ్చరించారు. 'మా తొలి లక్ష్యం.. మహాలక్ష్మి పథకం.. ప్రతి నెలా మహిళలకు రూ.2500, రూ.500కే గ్యాస్, బస్సుల్లో ఉచిత ప్రయాణం' అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఆవరణలో రాష్ట్ర ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మ్యానిఫెస్టో చైర్మెన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్, ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీ, ఏఐసీసీ కార్యదర్శులు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎస్ ఏ సంపత్‌కుమార్, అజయ్‌కుమార్, కత్తి వెంకటస్వామి తదితరులతో కలిసి ఖర్గే మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల బాగు కోసమే కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేస్తున్నామన్నారు. 42 పేజీల్లో 36 అంశాలతో కూడి ఉందన్నారు. ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందని ధీమా వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ సర్కార్ అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కొద్ది రోజులుగా కేసీఆర్‌కు భయం పట్టుకుందనీ, ఆయన గొంతులో ఆందోళన కనిపిస్తున్నదని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వాలని ఇప్పటికే ఓటర్లు నిర్ణయించుకున్నారని చెప్పారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. 'కర్నాటకలో హామీ ఇచ్చిన విధంగా ఐదు గ్యారంటీలను అమలు చేసి చూపిస్తున్నాం. తెలంగాణలోనూ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేసి చూపిస్తాం. తొలి మంత్రివర్గ సమావేశంలోనే వాటిని ఆమోదిస్తాం. కేసీఆర్‌కు పదవీ విరమణ సమయం వచ్చేసింది. ఓటమి తప్పదని ఆయనకు అర్థమైపోయింది' అని చెప్పారు. మోడీ, కేసీఆర్ కలిసి ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జనాలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని తెలిపారు.

'ఎప్పుడూ ఫామ్‌హౌస్‌లోనే ఉండే కేసీఆర్ ఇక అక్కడే ఉండిపోతారు. జనాలు బై బై కేసీఆర్...టాటా కేసీఆర్ అంటారు' అని ఎద్దేవా చేశారు. విద్యార్థులు, ఉద్యోగుల బలిదానాలు చూసి సోనియా తెలంగాణ ఇచ్చారని తెలిపారు. ప్రాజెక్టులు, పథకాలు, ప్రతి దాంట్లోనూ కేసీఆర్ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కర్నాటకలో చెప్పిన ప్రతి హామీనీ తాము నెరవేరుస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను బరాబర్ అమలు చేసి తీరుతామన్నారు. మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో దగాపడ్డ తెలంగాణ బిడ్డల మ్యానిఫెస్టోను రూపొందించినట్టు తెలిపారు. సకల వర్గాలతో సంప్రదింపులు చేసిన తర్వాతనే మ్యానిఫెస్టోను విడుదలచేశామన్నారు. 30వ జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వాదించాలని కోరారు.

ముఖ్యాంశాలివే...

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు

-మహిళలకు ప్రతి నెల రూ. 2500....ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ 500లకే గ్యాస్ సిలిండర్

-రైతులకు, కౌలు రైతులకూ ఎకరానికి రూ 15వేలు, వ్యవసాయ కూలీలకు రూ 12వేలు, వరి పంటకు రూ 500 బోనస్

-ప్రతి కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్

-ఇల్లులేని వారికి ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.5లక్షలు, ఉద్యమకారులకు 250 చ.గ ఇంటి జాగ

-జాబ్ క్యాలెండర్

- ఆరు నెలల లోపే మోగా డీఎస్సీ

-విద్యార్థులకు రూ 5 లక్షల విద్యా భరోసా కార్డు. ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్

-పింఛన్ ప్రతి నెల రూ 4వేలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా రూ.10 లక్షలు

-రైతులకు రూ 2 లక్షల పంట రుణమాఫీ

-వడ్డీ లేని రుణాలు రూ. 3 లక్షలు

-ధరణి పోర్టల్ స్థానంలో భూ మాతా పోర్టల్

-భూ సంస్కరణల ద్వారా పేదలకు పంపిణీ చేసిన దాదాపు 25 లక్షల ఎకరాలపై పూర్తిస్థాయి భూ హక్కులు కల్పిస్తాం

- ప్రజాభిప్రాయ సేకరణతో హైకోర్టు ఆదేశానుసారం ఫార్మా సిటీలను రద్దు చేస్తాం

-మూడంచెల స్థానిక సంస్థలను బలోపేతం చేసి, విధులు, విధులు, నిర్వాహణ బాధ్యతలు

-ప్రభుత్వ ఉద్యోగులకు, ఆర్టీసీ సిబ్బందికి కొత్త పీఆర్సీ ప్రకటించి ఆరు నెలల్లోపు సిఫారసులు అమలు

రెండు పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లింపు

-ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ 12వేలు సాయం

- బెల్టుషాపులను పూర్తిగా రద్దు చేస్తాం

-ఎస్సీ వర్గీకరణ అనంతరం మాదిగ, మాల, ఇతర ఎస్సీ ఉప కులాలకు కొత్తగా మూడు కార్పొరేషన్లు

-బీసీ కులగణన చేసి, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు

-సంచార జాతులకు విద్య, ఉద్యోగ అవకాశాలతో 5శాతం రిజర్వేషన్లు

-జనగాం జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరు

- సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల విధానాన్ని పున:పరిశీలన, సరళీకృతం

-బీడీ కార్మికులకు జీవిత బీమా, ఈఎస్ఐ పరిధిలోకి...

-యాదవ, కుర్మలకు దళారీలు లేకుండా నేరుగా రూ 2 లక్షలు

-పెండింగ్‌లో ఉన్న హైదరాబాద్ జర్నలిస్టుల ఇండ్ల సమస్యను పరిష్కారం

- అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

-మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు రూ ఐదు లక్షలు

తెల్లరేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపణీ

-స్వయం సహాయక బృందాలకు పావలా వడ్డీతో రుణ పరిమితి రూ.10 లక్షల వరకు పెంపు

-చదువుకునే యువతులకు (18 ఏండ్లు పైబడిన) ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటర్లు

-బాసర ట్రిపుల్ ఐటీ (ఐఐఐటీ) తరహాలో మరో నాలుగు ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేస్తాం

-గల్ఫ్‌కార్మికుల కోసం సంక్షేమ బోర్డు

-వికలాంగులకు ఇక నుంచి రూ 6వేల పెన్షన్

-ప్రతి జిల్లాకు రెసిడెన్షియల్ స్పోర్ట్స్ పాఠశాల ఏర్పాటు

-హోంగార్డులకు వేతన సవరణ..మిగతా సమస్యలు పరిష్కారం

-అంగన్‌వాడీలకు నెలకు రూ 18వేలు..ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకొచ్చి ఉద్యోగ భద్రత

-జానపద కళాకారులకు '(50 ఏండ్లు దాటిన) నెలకు రూ 3వేలు పెన్షన్

-ఎల్బీనగర్-ఆరాంఘర్-మెహదీపట్నం-బీహెచ్ఈఎల్ రూట్లలో కొత్త మెట్రో మార్గాలు

-పురపాలక సంఘాలు, కార్పొరేషన్లు , గ్రామ పంచాయతీల్లో ఆస్తిపన్ను, ఇంటి పన్ను బకాయిలపై ఉన్న పెనాల్టీలు రద్దు

-బస్తీ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు -

రాజ్యాంగ సంస్కరణలకు చిట్టచివరి యత్నంగా రిఫరెండం

- డిసెంబరు 17న పోలింగ్
- చిలీ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్

శాన్‌ఫ్రాన్సిస్కో : డిసెంబరులో జరగనున్న రెఫరెండమే దేశ రాజ్యాంగాన్ని సంస్కరించడానికి తమ ప్రభుత్వం చేస్తున్న చివరి ప్రయత్నమని చిలీ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్ వ్యాఖ్యానించారు. దేశానికి సుస్థిరత అవసరమని ఆయన అన్నారు. 1980 నుండి అమల్లో వున్న రాజ్యాంగం స్థానే కొత్త రాజ్యాంగాన్ని తీసుకురావాలా? వద్దా? అనే విషయం నిర్ణయించడానికి డిసెంబరు 17న పోలింగ్ జరగనుంది. మాజీ నియంత ఆగస్టో పినొచెట్ హయాంలో పాత రాజ్యాంగాన్ని ఆమోదించారు. "కొన్నేళ్ళ నుండీ మనకు కొంత అస్థిరత నెలకొంది. ఉదాహరణకు మన రాజ్యాంగ క్రమంలో అస్థిరత వుంది" అని ఆయన పేర్కొన్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో బిజినెస్ లీడర్స్ ఫోరం సమావేశంలో ఆయన పై వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఏది కావాలని ఎంపిక చేసుకున్నప్పటికీ, ఆ ప్రక్రియ ఇక ముగుస్తుంది. ఆ మేరకు నేను హామీ ఇవ్వగలను" అని చెప్పారు. "సుదీర్ఘ కాలంలో అభివృద్ధి కావాలంటే మనకు ఒక స్థిరత్వం, కచ్చితత్వం అవసరం. చిలీ వంటి దేశానికి ఒక నిర్దిష్టత అంటే మన ఆర్థిక వ్యవస్థను సమర్ధవంతంగా నిర్వహించడం ద్వారా మాత్రమే అందుతుంది." అని ఆయన చెప్పారు. ఆసియా - పసిఫిక్ ఆర్థిక సహకార వేదిక సమావేశాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుతం చిలీ ముందుకు సాగుతోంది, భవిష్యత్తులో చేయగలిగినంత మేర చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. గతేడాది ప్రధానంగా వామపక్ష భాగస్వామ్యం కలిగిన పార్లమెంట్ రూపొందించిన మొదటి ప్రతిపాదనను బోరిక్ సమర్ధించినప్పటికీ ప్రజలు తిరస్కరించారు.

రాజ్యాంగ విరుద్ధం

- ప్రయివేటు రంగంలో 75శాతం కోటా రిజర్వేషన్ బిల్లును కొట్టేసిన హర్యానా హైకోర్టు

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని ఉద్యోగాల్లో 75శాతం ఉద్యోగాలను రాష్ట్ర ప్రజలకు మాత్రమే కేటాయించాలని కోరుతున్న హర్యానా చట్టాన్ని పంజాబ్ - హర్యానా హైకోర్టు కొట్టివేసింది. ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించే అవకాశం వుంది. హర్యానా రాష్ట్ర స్థానిక ఉపాధి బిల్లును 2020లో ఆమోదించిన తర్వాత అనేక మార్పులకు లోనయింది. ప్రయివేటు రంగంలో నెలకు రూ.30 వేల కన్నా తక్కువ వేతనాలు కలిగిన ఉద్యోగాల్లో 75శాతాన్ని డొమిసైల్ సర్టిఫికెట్ కలిగిన, రాష్ట్రానికి చెందినవారికే రిజర్వ్ చేయాలని ఆ బిల్లు పేర్కొంటోంది. రాష్ట్రంలో 15 ఏండ్లు నివసించి వుండాలన్న షరతును ఐదేండ్లకు తగ్గించారు. హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలు జరగడానికి ఏడాది కూడా గడువు లేదు. ఈ నేపథ్యంలో తాజా చర్య మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ. స్థానికుల ఓట్లను, ముఖ్యంగా జాట్‌ల ఓట్లను సంఘటితపరుచుకోవాలన్న లక్ష్యంతో ఈ బిల్లును ప్రభుత్వం తీసుకు వచ్చింది.

బైడెన్ కలిసిన పీయూష్ గోయల్

న్యూఢిల్లీ : కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను శుక్రవారం కలిశారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో జరుగుతున్న ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార మండలి శిఖరాగ్ర సదస్సులో బైడెన్‌తో గోయల్ సమావేశమయ్యారు. ఈ మేరకు ఎక్స్‌లో బైడెన్‌తో సంభాషిస్తున్న ఫొటోను గోయల్ షేర్ చేశారు. 'అమెరికా అధ్యక్షుడిని కలవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను' అని మంత్రి ట్వీట్ చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ గురించి పలు అంతర్జాతీయ వేదికలపై ప్రధాని మోడీ ప్రస్తావించిన అంశాలతో అంగీకరిస్తున్నట్టు బైడెన్ తనతో చెప్పారని పీయూష్ గోయల్ తెలిపారు.

నాలుగు రోజుల పర్యటన నిమిత్తం అమెరికాకు వెళ్లిన పీయూష్ గోయల్.. జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిదాతోపాటు పలు దేశాలకు చెందిన మంత్రులు, పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. మరోవైపు బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో మొత్తం 26 అంశాల్లో 20 ముగించామని తెలిపారు. అనిశ్చితి నెలకొన్న అంశాలను త్వరలో పరిష్కరిస్తామని వెల్లడించారు. అదే విధంగా 2023-24 మధ్య కాలంలో రికార్డు స్థాయిలో కొత్త ఆవిష్కరణలకు పేటెంట్‌లు జారీ చేసినట్టు తెలిపారు. దేశ యువత సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ఇది గొప్ప పురోగతిగా మంత్రి పేర్కొన్నారు.

డీప్ ఫేక్ వీడియోల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో డీప్ ఫేక్ వీడియోలు విస్తతంగా దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా సినీ తారల అభ్యంతరకర దశ్యాలతో ఉన్న డీప్ ఫేక్ వీడియోలు కలకలం రేపుతున్నాయి. వేరొకరి ముఖాల స్థానంలో రష్మిక, కాజోల్ వంటి తారల ముఖాలను మార్ఫింగ్ చేసి రూపొందిస్తున్న ఈ వీడియోలు నిజమైనవే అని భ్రమించేలా ఉంటున్నాయి. అంతెందుకు, ప్రధాని నరేంద్ర మోడీ ఓ పాట పాడినట్టు డీప్ ఫేక్ వీడియో రూపొందించడం ఇదెంతటి తీవ్రమైన సమస్యో చెబుతోంది. ఇలాంటి వీడియోలపై సర్వత్ర ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ స్పందించారు. డీప్ ఫేక్ వీడియోలు మన వ్యవస్థకు పెను ముప్పుగా పరిణమిస్తున్నాయని, సమాజంలో గందరగోళానికి దారితీస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు.

మధ్యప్రదేశ్‌లో 71.64 శాతం ఛత్తీస్‌గఢ్‌లో 68.15 శాతం

(మొదటిపేజి తరువాయి)

ఓటింగ్ నమోదయింది.

బీజేపీ ఎమ్మెల్యే కుమారుడి దాడి



ఇండోర్ నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే మాలిని గౌర్ కుమారుడు ఏకలవ్య గౌర్ కాంగ్రెస్ నాయకులు, మద్దతుదారులపై దాడికి పాల్పడ్డాడు. దీంతో నిందితుడిపై ఇండోర్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మధ్యప్రదేశ్‌లో మెహగాన్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక పోలింగ్ కేంద్రం వద్ద ఒక వ్యక్తి గాలిలోకి కాల్పులు జరపడంతో బీజేపీ అభ్యర్థి, ఆప్ మద్దతుదారుడు గాయపడ్డారు. చతర్‌పూర్ జిల్లా రాజ్‌నగర్ అసెంబ్లీ సిగ్మెంట్‌లో కాంగ్రెస్ కార్యకర్త హత్యకు గురయ్యాడు. కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే విక్రమ్‌సింగ్ నటిరాజా మాట్లాడుతూ తనపై ప్రత్యర్థి గ్రూపు వారు దాడికి పాల్పడ్డారని తెలిపారు. తాను హడావిడిగా కారులో వచ్చేశానని, తమ కార్యకర్త సల్మాన్‌ను కారుతో తొక్కించి హత్య చేశారని చెప్పాడు.

ఛత్తీస్‌గఢ్‌లో ఐఈడీ పేలి జవాను మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్‌లో నక్సలైట్లు అమర్చిన ఐఈడీ పేలి ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ)కు చెందిన ఒక జవాన్ మరణించాడు. మధ్యప్రదేశ్‌లోని మొత్తం 230 అసెంబ్లీ స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరిగింది. మొత్తం 2,533 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 5,60,60,925 మంది ఓటర్లు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 90 స్థానాలు ఉండగా, రెండో దశలో శుక్రవారం 70 స్థానాల్లో ఓటింగ్ జరిగింది. మొత్తం 958 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ రాష్ట్రంలో తొలి దశలో ఈ నెల 7న 20 స్థానాల్లో పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ రెండు రాష్ట్రాల్లోనూ డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో ఓటింగ్ పూర్తికావడంతో మొత్తంగా మూడు రాష్ట్రాల్లో ఓటింగ్ పూర్తయింది. ఇంకా, రాజస్థాన్, తెలంగాణల్లో పోలింగ్ జరగాల్సి ఉంది.

మారో తీన్‌మార్





ప్రపంచకప్ ఫైనల్ ముంగిట అహ్మదాబాద్ స్టేడియంలో భారత వాయుసేన రిహార్సల్ విన్యాసాలు



లేజర్ షో, కెప్టెన్ల పరేడ్



- ప్రపంచకప్ ఫైనల్‌కు ఘనంగా ఏర్పాట్లు
- 500 మంది కళాకారులతో నృత్య ప్రదర్శన



నవతెలంగాణ-అహ్మదాబాద్

ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్‌కు ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. మెగా మ్యాచ్‌కు అంతర్జాతీయ సినీ, క్రీడా ప్రముఖులు అహ్మదాబాద్‌కు తరలి రానున్నారు!. ప్రపంచ పాపులర్ గాయని దువా లిపా (బ్రిటన్) మొతెరాలో ఆడి పాడనుందని అధికార ప్రసారదారు స్టార్‌స్పోర్ట్స్ సోషల్ మీడియాలో పంచుకుంది. ఇక సంగీత దర్శకుడు ప్రీతమ్ సారథ్యంలోని కళాకారుల బృందం అహ్మదాబాద్ స్టేడియంను ఉర్రూతలూగించనున్నారు. సింగర్స్ పాపులర్ బాలీవుడ్ బాణీలు ఆలపించనుండగా.. 500 మందితో కూడిన డ్యాన్సర్ల బృందం నృత్య ప్రదర్శనతో కనువిందు చేయనుంది. సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ స్టేడియం పైన విన్యాసాలు చేయనుంది. అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి తొమ్మిది విమానాలు బయల్దేరి స్టేడియం మీదుగా విన్యాసాలు చేస్తుంది. వింగ్ కమాండర్ సిద్దేశ్ కార్తీక్ ఈ షోకు నాయకత్వం వహిస్తున్నారు. సుమారు 12 గంటల నుంచే ప్రపంచకప్ ముగింపు వేడుకలు ఆరంభం కానున్నాయి.

కెప్టెన్ల పరేడ్ : మునుపెన్నడూ లేని రీతిలో ఐసీసీ ప్రపంచకప్ గెలుపు సారథులను ఘనంగా సత్కరించనున్నారు. ప్రపంచకప్ విజయాలు సాధించిన కెప్టెన్లను ఐసీసీ ప్రత్యేకంగా ఆహ్వానించింది.

ఇన్నింగ్స్ విరామ సమయంలో విజయ సారథులు బగ్గీల్లో స్టేడియం చుట్టేయనున్నారు. కపిల్ దేవ్, ఎం.ఎస్ ధోని భారత్ తరఫున హాజరు కానుండగా.. అలెన్ బోర్డర్, స్టీవ్ వా, రికీ పాంటింగ్, మైకల్ క్లార్క్ ఆస్ట్రేలియా తరఫున రానున్నారు. అర్జున రణతుంగ, క్లైవ్ లాయిడ్ సైతం అహ్మదాబాద్‌కు వస్తుండగా.. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ హాజరు కావటం లేదు. 2019 చాంపియన్ సారథి ఇయాన్ మోర్గాన్ సైతం పరేడ్‌లో మెరువనున్నాడు. ఈ సందర్భంగా బీసీసీఐ ప్రత్యేకంగా తయారు చేయించిన బ్లేజర్లను ప్రపంచకప్ విజయ సారథులకు బహూకరించనుంది.

ఆకాశం నుంచి..! : ప్రపంచకప్ విజేతకు ట్రోఫీని బహుకరించే అంశంలోనూ బీసీసీఐ సరికొత్త పుంతలు తొక్కుతుంది. లేజర్ షో, క్రాకర్స్ బ్లాస్ట్‌లకు తోడు ఆకాశం నుంచి ప్రపంచకప్ ట్రోఫీ విజేతను ప్రకటించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇది అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటుందని బోర్డు వర్గాలు అంటున్నాయి.

ఐసీసీ ప్రపంచ కప్ సంగ్రామం చివరి అంకానికి చేరుకుంది. 48 మ్యాచుల్లో 10 జట్లు పోటీపడిన మెగా ఈవెంట్ ఆదివారం అహ్మదాబాద్ వేదికగా టైటిల్ పోరుతో ముగియనుంది. రెండు సార్లు చాంపియన్, ఆతిథ్య భారత్‌తో ఐదు సార్లు చాంపియన్ ఆస్ట్రేలియా తుది పోరులో తలపడనుంది. కంగారూలకు ఇది రికార్డు ఎనిమిదో వరల్డ్‌కప్ ఫైనల్ కాగా, టీమ్ ఇండియాకు మూడోది. 1983లో వెస్టిండీస్, 2011లో శ్రీలంకపై విజయాలతో భారత్ ప్రపంచ విజేతగా నిలువగా.. 2003 టైటిల్ పోరులో ఆస్ట్రేలియా చేతిలో భంగపడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 20 ఏండ్ల తర్వాత భారత్, ఆస్ట్రేలియా మరోసారి ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్లో పోటీపడుతున్నాయి. ఈసారి వేట మునుపటి లెక్క ఉండదని రోహిత్‌సేన హెచ్చరికలు పంపుతూనే ఉంది!.

టైటిల్ పోరు స్లో వికెట్‌పై?

- తొలుత బ్యాటింగ్‌కే ఇరు జట్ల మొగ్గు
- ఫైనల్ మ్యాచ్‌కు వాతావరణం క్లియర్

ఐసీసీ 2023 ప్రపంచకప్



పచ్చిక పోవాలె : పిచ్‌పై రోలింగ్ చేస్తున్న స్టేడియం సిబ్బంది

నవతెలంగాణ-అహ్మదాబాద్

ఐసీసీ 2023 ప్రపంచకప్ ఫైనల్ ఫైట్‌కు రంగం సిద్ధం. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం టైటిల్ పోరుకు వేదికగా నిలుస్తోంది. 1,30,000 మంది సీటింగ్ సామర్థ్యం అహ్మదాబాద్‌లోని మొతెరా మైదానం సొంతం. ఇటీవల భారత క్రికెట్‌లో ప్రాధాన్య మ్యాచులకు చిరునామాగా నిలుస్తున్న అహ్మదాబాద్.. సహజంగానే ప్రపంచకప్ ఫైనల్‌కు ఆతిథ్యం ఇస్తోంది. ఆకాశంలో భారత వాయుసేన విన్యాసాలు, మైదానంలో అంతర్జాతీయ కళాకారుల నృత్య సంగీత ప్రదర్శనలతో ప్రపంచకప్ ఫైనల్ హంగామా సందడిగా సాగనుంది.

స్లో వికెట్ సిద్ధం!

ముంబయి వాంఖడేలో న్యూజిలాండ్‌తో సెమీఫైనల్ పిచ్‌ను మ్యాచ్‌కు ముందు మార్చినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న బీసీసీఐ.. ఇప్పుడు అహ్మదాబాద్‌లో 'స్లో వికెట్'ను సిద్ధం చేస్తోంది. సహజంగా అహ్మదాబాద్ పిచ్ బ్యాటర్లు, బౌలర్లకు సమానంగా అనుకూలిస్తుంది. బ్యాటర్లకు కాస్త మొగ్గు ఎక్కువ ఉన్నప్పటికీ.. కొత్త బంతితో పేసర్లు, ఆ తర్వాత స్పిన్నర్లకు వికెట్ల వేటలో మంచి అవకాశాలు ఉంటాయి. ఇక్కడ జరిగిన గత మ్యాచుల్లో ఈ తరహా ట్రెండ్ చూశాం. ఫైనల్ మ్యాచ్‌కు కొత్త పిచ్‌ను కాకుండా ఇప్పటికే ఓ మ్యాచ్‌లో వినియోగించిన పిచ్‌ను సిద్ధం చేస్తున్నారు. ప్రపంచ శ్రేణి పేసర్లు పాట్ కమిన్స్, జోశ్ హాజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్‌తో కూడిన ఆసీస్ పేస్ లైనప్‌కు అనుకూలత తొలగించటంతో పాటు వరల్డ్ క్లాస్ స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజాలకు అదనపు సహకారం దక్కేలా టీమ్ ఇండియా ప్రణాళికలు చేసినట్టు తెలుస్తోంది. ఈ మేరకు జట్టు మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ క్యూరేటర్‌ను స్లో వికెట్ కావాలని కోరినట్టు సమాచారం.

న్యూజిలాండ్, భారత్ సెమీఫైనల్ సైతం స్లో వికెట్‌పై జరిగినా.. అక్కడ పరుగుల వరద పారింది. కానీ అహ్మదాబాద్‌లో ఓ మోస్తరు స్కోరు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి.

స్లో వికెట్‌తో పేసర్లకు మాత్రమే కాదు బ్యాటర్లకు సైతం ప్రతికూలతే. స్లో వికెట్‌పై ఎక్కువ బౌన్స్ లభించదు. బంతి స్వింగ్ అవదు. సీమ్‌తో పాటు పేస్‌కు ఎటువంటి ఆస్కారం ఉండదు. బంతి ఒక్కసారి పిచ్‌పై పడిన తర్వాత.. వేగం నెమ్మదిస్తుంది. ఇది పేసర్లకు కఠిన సవాల్. ఇక ఇక్కడే బ్యాటర్లకూ చిక్కు ఉంది. బంతి పిచింగ్ అయిన తర్వాత.. వేగం తగ్గిపోతుంది. దీంతో బ్యాట్‌పైకి బంతి రాదు. బంతి బ్యాట్‌పైకి రాకపోవటంతో బ్యాటర్లకు పరుగుల వేట గగనమవుతుంది. పేస్, టైమింగ్‌తో దంచికొట్టే బ్యాటర్లు ఇక్కడ కండబలంపై దృష్టి సారించాల్సి ఉంటుంది. మాయగాళ్లకు మాత్రం ఇక్కడ ఎదురుండదు. పిచ్‌పై పెద్దగా పగుళ్లు లేకపోయినా.. స్పిన్నర్లను ఎదుర్కొవటం మరింత కష్టతరం కానుంది. ఆసీస్ శిబిరంలో ఆడం జంపా, గ్లెన్ మాక్స్‌వెల్ రూపంలో ఇద్దరు నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారు. కానీ కుల్దీప్, జడేజా మాయ ప్రభావం అంతకుమించిన స్థాయిలో ఉంటుందని రోహిత్‌సేన బలంగా నమ్ముతోంది.



ఆకాశమే నీ హద్దురా : అహ్మదాబాద్ స్టేడియంలో టీమ్ ఇండియా సారథి రోహిత్ శర్మ

2003 ఫైనల్ రీ మ్యాచ్

ప్రపంచకప్ గ్రూప్ దశలో అజేయంగా నిలిచిన టీమ్ ఇండియా, గ్రూప్ దశ ఆరంభంలో తడబడిన ఆస్ట్రేలియా టైటిల్ పోరుకు చేరుకున్నాయి. ప్రపంచ క్రికెట్‌లో ఆస్ట్రేలియా, భారత్ ఎప్పుడూ అగ్ర జట్లుగానే కొనసాగుతున్నాయి. ఇటీవల 2023 ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లోనూ భారత్, ఆస్ట్రేలియానే పోటీపడ్డాయి. సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్ కెరీర్ ఉజ్వల స్థాయిలో ఉండగా టీమ్ ఇండియా 2003 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరింది. రికీ పాంటింగ్ సారథ్యంలోని ఆస్ట్రేలియా అప్పుడు భారత్‌పై తేలిగ్గా గెలుపొందింది. రికీ పాంటింగ్ (140 నాటౌట్), డామిన్ మార్టిన్ (88 నాటౌట్), ఆడం గిల్‌క్రిస్ట్ (57), మాథ్యూ హేడెన్ (37) మెరుపులతో ఆస్ట్రేలియా తొలుత 50 ఓవర్లలో 2 వికెట్లకు 359 పరుగులు చేసింది. భారీ లక్ష్య ఛేదనలో భారత్ తడబడింది. సచిన్ (4), గంగూలీ (24), కైఫ్ (0), యువరాజ్ సింగ్ (24), దినేశ్ మోంగియా (12) నిరాశపరిచారు. వీరెందర్ సెహ్వాగ్ (82), రాహుల్ ద్రవిడ్ (47) పోరాటం సరిపోలేదు. 39.2 ఓవర్లలో 234 పరుగులకే భారత్ కుప్పకూలింది. భారత క్రికెట్ మరో స్థాయికి చేరుకునే దశలో ఎదురైన ఓటమి ఇది. సరిగ్గా 20 ఏండ్ల తర్వాత భారత్ మరోసారి ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియాతో ఢీకొట్టేందుకు సిద్ధమైంది. ఇప్పుడు సొంత మైదానం, సొంత అభిమానుల నడుమ టీమ్ ఇండియా టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. ప్రపంచకప్‌లో అజేయ జైత్రయాత్ర సాగిస్తున్న రోహిత్‌సేన.. అహ్మదాబాద్‌లో ఆస్ట్రేలియాపై అదే తరహా విధ్వంసకాండ సాగించి ముచ్చటగా మూడోసారి ప్రపంచకప్ అందుకోవాలని ఎదురుచూస్తోంది.

ఆహ్లాదకర వాతావరణం!

భారత్, ఆస్ట్రేలియా ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌కు వాతావరణం సహకరించనుంది. ఆదివారం అహ్మదాబాద్‌కు ఎటువంటి వర్షం సూచనలు లేవు. మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు ఆరంభం కానుండగా ఆ సమయానికి ఉష్ణోగ్రత 33 డిగ్రీలు ఉండనుంది. మ్యాచ్ ముగిసే సమయానికి (రాత్రి 10.30) 23 డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోనుంది. మ్యాచ్ సమయంలో చిరు జల్లుల సూచనలు సైతం లేవని వాతావరణ శాఖ తెలిపింది.

ద్రవిడ్ సమాలోచనలు

ఆదివారం మెగా ఫైట్ ముంగిట టీమ్ ఇండియా చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ సహచర సహాయక సిబ్బందితో సమాలోచనలు జరిపారు. ఫీల్డింగ్ కోచ్ టి దిలీప్, డేటా అనలిస్ట్ హరి ప్రసాద్, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోర్‌లతో కలిసి రోహిత్ శర్మ, రాహుల్ ద్రవిడ్ మాట్లాడుతూ కనిపించారు. రోహిత్ శర్మ, రాహుల్ ద్రవిడ్ తొలుత పిచ్‌ను పరిశీలించారు. స్లో వికెట్‌పై టీమ్ ఇండియా అనుసరించాల్సిన వ్యూహంతో పాటు ఆస్ట్రేలియాకు అడ్డుకట్టే వేసేందుకు వేయాల్సిన ఎత్తులపై చర్చించారు. ఇక ఐచ్ఛిక ప్రాక్టీస్‌కు భారత జట్టు నుంచి ఆరుగురు ఆటగాళ్లు మాత్రమే హాజరయ్యారు. రవిచంద్రన్ అశ్విన్, ప్రసిద్ కృష్ణ, రవీంద్ర జడేజా, కెఎల్ రాహుల్, ఇషాన్ కిషన్‌తో పాటు కెప్టెన్ రోహిత్ శర్మ శుక్రవారం మొతెరాలో ప్రాక్టీస్ చేశాడు. రోహిత్ శర్మ స్లిప్స్‌లో క్యాచులు సాధన చేయగా..మిగతా ఆటగాళ్లు బ్యాటింగ్, బౌలింగ్ ప్రాక్టీస్ చేశారు. స్లో వికెట్‌పై ఫైనల్ పోరు కావటంతో ప్రాక్టీస్ పిచ్‌లను సైతం ఆ తరహాలోనే సిద్ధం చేశారు.



నేటి నుంచి లెజెండ్స్ లీగ్

వేడుకగా ట్రోఫీ ఆవిష్కరణ

రాంచీ (జార్ఖండ్) : ఓవైపు ప్రపంచకప్ ఫైనల్ హంగామా ఊపేస్తుండగా, మరోవైపు దిగ్గజ క్రికెటర్ల క్రికెట్ సమరం అభిమానుల ముందుకొచ్చింది. మాజీ క్రికెటర్లు పోటీపడే లెజెండ్స్ లీగ్ క్రికెట్ రెండో సీజన్ నేటి నుంచి ఆరంభం కానుంది. రాంచీలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో మునాఫ్ పటేల్, ప్రవీణ్ తాంబే, హషీమ్ ఆమ్లా, ఆండ్రూ లీపస్, రామన్ రోహేజాలు లెజెండ్స్ లీగ్ క్రికెట్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ లీగ్ రాంచీ, డెహ్రాడూన్, జమ్మూ, విశాఖ, సూరత్ వేదికగా జరుగనుంది. నేడు రాంచీలో జరిగే ఆరంభ మ్యాచ్‌లో గత సీజన్ ఫైనలిస్టులు బిల్వారా కింగ్స్, ఇండియా క్యాపిటల్స్ తలపడనున్నాయి.





జయం రవి

జయం రవి.. సైరన్

జయం రవి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సైరన్'. హెమ్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై సుజాత విజయ్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ఆంటోని భాగ్యరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. శుక్రవారం ఈ చిత్ర టీజర్‌ను నిర్మాత దిల్ రాజు విడుదల చేశారు.

ఈ సినిమాపై అనౌన్స్‌మెంట్ రోజు నుంచి ఎక్స్‌పెక్టేషన్స్ పెరుగుతోంది. సైరన్‌తో వెళ్లే అంబులెన్స్, జయం రవి సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో ఖైదీగా కనిపించటం క్యూరియాసిటీని పెంచాయి. పెరోల్‌పై జయం రవి జైలు నుంచి బయటకు వచ్చే సీన్ ద్వారా హీరో క్యారెక్టర్‌ను రివీల్ చేశారు మేకర్స్. టీజర్‌లో ప్రధానంగా రెండు పాత్రల మధ్య నడిచే కథని చూపించారు. ఖైదీ పాత్రలో జయం రవి నటిస్తుండగా, పోలీస్ ఇన్‌స్పెక్టర్ పాత్రలో కీర్తి సురేష్ నటిస్తున్నారు. సినిమాలో డ్రామా, ట్విస్టులు, టర్నులు చూస్తుంటే ఎక్స్‌పెక్టేషన్స్‌ను మరింత పెంచుతున్నాయి.

'అభిమన్యుడు, విశ్వాసం, హీరో వంటి పలు చిత్రాలకు రైటర్‌గా ప్రూవ్ చేసుకున్న ఆంటోని భాగ్యరాజ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కాంబినేషన్‌లో ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. జయం రవి తన కెరీర్‌లో ఇప్పటి వరకు ఎన్నడూ చేయని విధంగా రెండు డిఫరెంట్ లుక్స్‌తో మెప్పించబోతున్నారు. అలాగే జయం రవి సరసన కీర్తి సురేష్ తొలిసారి నటిస్తుంది. యోగి బాబు తనదైన కామెడీ పంచులతో నవ్వించటానికి సిద్ధమవుతున్నారు. విలక్షణ నటుడు, దర్శకుడు సముద్రఖని ఇందులో కీలక పాత్రను పోషిస్తున్నారు. చిత్రీకరణను పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ముగింపు దశకు చేరుకున్నాయి.

నవచిత్రం

చిట్టిముత్యాలు ప్రారంభం



'ఉలవచారు, రాజుగారి తోట, కూచిపూడి పలావ్, రాజుగారి కోడి పలావ్, మారేడుమిల్లి' వంటి అద్భుత విజయాలతో ఫుడ్ ఇండస్ట్రీలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు కూచిపూడి వెంకట్ తాజాగా 'చిట్టిముత్యాలు' పేరుతో మరో రెస్టారెంట్‌కు శ్రీకారం చుట్టారు. ఆయన దర్శకత్వ శైలికి తగ్గట్టుగా దీనికి 'రొమాన్స్ విత్ రైస్' అనే ట్యాగ్ లైన్ పెట్టడం విశేషం. హైదరాబాద్‌లోని మాదాపూర్, అయ్యప్ప సొసైటీలోని ఇమేజ్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఈ రెస్టారెంట్‌ను నిర్మాతలు దిల్ రాజు, టిజి విశ్వప్రసాద్, దర్శకులు హరీష్ శంకర్, అనిల్ రావిపూడి ప్రారంభించారు. దిల్ రాజు, రెస్టారెంట్ రిబ్బన్ కట్ చేయగా, హరీష్ శంకర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనిల్ రావిపూడి 'మెను' లాంచ్ చేయగా, విశ్వప్రసాద్ క్యాష్ కౌంటర్ ఓపెన్ చేశారు. ఇంతటి అత్యద్భుత ఆహ్లాదకర వాతావరణం సృష్టించి, ఎంత తిన్నా తనివి తీరని నోరూరించే వంటకాలతో భోజనప్రియుల మనసులు దోచుకోవడం కూచిపూడి వెంకట్‌కు మాత్రమే సాధ్యమని దిల్ రాజు, అనిల్ రావిపూడి పేర్కొన్నారు.

హైదరాబాద్ ఫుడ్ ఇండస్ట్రీలో 'చిట్టిముత్యాలు' ఓ మణిహారంలా భాసిల్లడం ఖాయమని టి.జి.విశ్వప్రసాద్, హరీష్ శంకర్ ప్రశంసించారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో రెస్టారెంట్స్ ఏర్పాటు చేయడం తనకు ప్యాషన్ అని, 'చిట్టిముత్యాలు'తో ఒక గొప్ప భోజనానుభూతిని పంచేందుకు చాలా నెలలు శ్రమించామని దర్శకుడు కూచిపూడి వెంకట్ తెలిపారు.

థ్రిల్ చేసే మైండ్ గేమ్

రాహుల్

విజయ్, శివాని రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో తేజ మార్ని తెరకెక్కించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలకపాత్రలు పోషించారు. గీతా ఆర్ట్స్ 2 బ్యానర్‌పై బన్నీ వాస్, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈనెల 24న సినిమా విడుదలవుతున్న సందర్భంగా వరలక్ష్మీ శరత్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ, 'నా కెరీర్‌లో ఇప్పటికే తమిళంలో ఎక్కువ పోలీస్ క్యారెక్టర్స్ చేశాను. తెలుగు ఆడియెన్స్‌కు మాత్రం ఫస్ట్ టైమ్ పోలీస్ గెటప్‌లో కనిపిస్తున్నా. ప్రేక్షకులకు కొత్తగా కనిపించాలని చాలా ట్రై చేస్తున్నా. ప్రస్తుతం ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్ ట్రెండ్ నడుస్తోంది. నేను కథే హీరోగా భావిస్తా. ఇందులో శ్రీకాంత్ ఒక పోలీస్ ఆఫీసర్, నేనొక పోలీస్ ఆఫీసర్. ఇద్దరిలో ఒకరు క్రిమినల్ అయితే ఎలా ఉంటుంది?, పోలీసులపై పొలిటికల్ ప్రెజర్ ఏ విధంగా ఉంటుందనేది ఈ మూవీ కాన్సెప్ట్. క్యాట్ అండ్ మౌస్ గేమ్‌లా థ్రిల్ చేసేలా ఉంటుంది. స్క్రీన్‌ప్లే చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఇప్పుడు ఎలక్షన్ టైమ్‌లో రానుండటంతో అందరూ ఎంతో ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఓటు గురించి అవగాహన కల్పించేలా లైన్ కూడా ఉంటుంది. 'నాయట్టు'కి రీమేక్ అయినా.. దానికి దీనికి చాలా మార్పులు చేశారు. యాక్షన్ కంటే మైండ్ గేమ్ ఎక్కువగా ఉంటుంది. పొలిటికల్ సిస్టమ్, పోలీస్ సిస్టమ్ గురించి చూపించాం కానీ.. ఏ పార్టీకి సంబంధం ఉండదు. 'లింగిడి లింగిడి' పాటకు మంచి రెస్పాన్స్ రావడం సంతోషంగా ఉంది. దర్శకుడు తేజ మార్ని చాలా క్వాలిటీగా తీశారు. మంచి క్యారెక్టర్స్ చేయడమే నా గోల్. వరలక్ష్మీ చాలా డిఫరెంట్‌గా చేసిందని ప్రేక్షకులు అనుకోవాలనుకుంటా. లేడీ ఓరియంటెడ్ సినిమాలతో పాటు క్యారెక్టర్ నచ్చితే ఎలాంటి మూవీలోనైనా నటించడానికి రెడీ. సంక్రాంతికి నేను నటించిన 'హనుమాన్' విడుదలవుతోంది. కన్నడలో సుదీప్‌తో కలిసి 'మ్యాక్స్' చిత్రంలో నటిస్తున్నా. మరికొన్ని ప్రాజెక్టులు లైన్‌లో ఉన్నాయి. త్వరలోనే అనౌన్స్‌మెంట్స్ వస్తాయి' అని తెలిపారు.



వరలక్ష్మి శరత్‌కుమార్

రీ సౌండ్ పార్టీ



వీజే సన్నీ, హ్రితిక శ్రీనివాస్

టీజర్, హిట్ సాంగ్స్‌తో ఇప్పటికే టాలీవుడ్‌లో మంచి బజ్ క్రియేట్ చేసిన చిత్రం 'సౌండ్ పార్టీ'. ఈ చిత్ర ట్రైలర్ గురువారం విడుదలైంది. రెండున్నర నిమిషాల నిడివిగల ఈ ట్రైలర్ మొదటి నుండి ఎండింగ్ వరకు అదిరి పోయే పంచ్ డైలాగ్స్‌తో ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా హీరో వీజే సన్నీ, శివన్నారాయణకు మధ్య వచ్చే డైలాగ్స్ క్రేజీగా ఉంటూ యూత్‌ని ఎట్రాక్ట్ చేస్తున్నాయి. వీరితో పాటు ఇందులో సప్తగిరి, థర్టీ ఇయర్స్ పృథ్వీ ఇంకా పలువురు పేరొందిన హాస్యనటులు ఈ చిత్రంలో సందడి చేయనున్నారు. మోహిత్ రెహమానికి మ్యూజిక్, శ్రీనివాస రెడ్డి సినిమాటోగ్రఫీ బాగా కుదిరినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. సింగిల్ లైన్ పంచ్ డైలాగ్స్‌తో, మంచి కాస్టింగ్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను టార్గెట్ చేస్తూ దర్శకుడు ఈ చిత్రాన్ని తీర్చి దిద్దినట్లు ట్రైలర్ చెప్పకనే చెబుతోంది.

ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం-1గా రూపొందిన ఈ చిత్రంలో వీజే సన్నీ, హ్రితిక శ్రీనివాస్ జంటగా నటించారు. రవి పోలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మాతలు.

జయ శంకర్ సమర్పణ. సంజయ్ శేరి దర్శకుడు. ఇప్పటికే సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు రేకెత్తించిన ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా ఈనెల 24న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది.

భిన్న కాన్సెప్ట్

స్మెల్ బేస్డ్ థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో ఇంత వరకు ఏ సినిమా రాలేదు. అలాంటి ఓ కొత్త కాన్సెప్ట్‌తో 'పర్‌ఫ్యూమ్' అనే చిత్రం రాబోతోంది. శ్రీమాన్ మూవీస్ ప్రజెంట్స్, మిత్రా మూవీ మేకర్స్, ఫరెవర్ ఫ్రెండ్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో చేనాగ్, ప్రాచీ థాకర్ జంటగా నటించారు. జె.డి.స్వామి దర్శకత్వంలో తెరకకెక్కగా, జె.సుధాకర్, శివ.బి, రాజీవ్ కుమార్.బి, లావురి శ్రీనివాస్, రాజేంద్ర కనుకుంట్ల, శ్రీధర్ అక్కినేని (అమెరికా) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈనెల 24న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆస్కార్ అవార్డ్ గ్రహీత చంద్రబోస్‌ను చిత్రయూనిట్ ఘనంగా సత్కరించింది. అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఎస్ విష్ణుమూర్తి, ఐఆర్ఎస్ మురళీ మోహన్, గ్రీన్ హార్స్ కంపెనీ అధినేతి ప్రవీణ్ రెడ్డి, ఆచార్య భట్టు రమేష్ ముఖ్య అతిథులుగా విచ్చేసి చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్ తెలిపారు. హీరో చేనాగ్ మాట్లాడుతూ, 'స్మెల్లింగ్ అబ్‌సెషన్‌తో కూడిన కథను ఇంత వరకు ఇండియన్ స్క్రీన్ మీద చూడలేదు. ఈ మూవీలో ఎన్నో లేయర్స్ ఉంటాయి. డార్క్ మోడ్‌లో నా క్యారెక్టర్ ఉంటుంది' అని తెలిపారు. 'కొత్తదనం, కొత్త పాయింట్‌తో సినిమా చేస్తే కచ్చితంగా మంచి ప్రతిఫలం వస్తుంది' అని దర్శకుడు తెలిపారు.



పోలీసు వారి హెచ్చరిక


బాబ్జీ దర్శకత్వంలో తూలికా తనిష్క్ క్రియేషన్స్ పతాకంపై బెల్లి జనార్థన్ తన తొలి ప్రయత్నంగా నిర్మిస్తున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'.

'దసరా రోజున ప్రారంభమైన ఈ చిత్ర షూటింగ్ హైదరాబాద్, ఘట్ కేసర్, ఘణాపూర్, షామీర్ పేట తదితర ప్రదేశాలలో జరుపుకుంటూ 50 శాతం పూర్తి చేసుకుంది. ఇప్పటి వరకు జరిగిన చిత్రీకరణలో సినిమాలోని కీలక ఘట్టాలతో పాటు మూడు పాటలు, రెండు ఫైట్‌లను పూర్తి చేశాం. డిసెంబర్ మొదటివారం కల్లా ఈ సినిమా షూటింగ్ మొత్తం పూర్తి అవుతుంది. మన పిల్లలకు, మన కుటుంబానికి పంచే ప్రేమలో కొంతైనా మన చుట్టూ ఉండే అనాథ బాలలకు పంచకపోతే, ఆ అనాథలు సంఘ వ్యతిరేక శక్తుల చేతుల్లో చిక్కుకొని సమాజాన్ని నాశనం చేసే నేరస్థులుగా మారే ప్రమాదం ఉందనే సందేశం అంతర్లీనంగా సాగుతూ, పూర్తి కమర్షియల్ హంగులతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం' అని దర్శకుడు బాబ్జీ తెలిపారు.



'పోలిసు వారి హెచ్చరిక'లో ఒక దృశ్యం

'భారత సైన్యంలో దేశరక్షణ కోసం పని చేసిన నేను మొట్టమొదటి సారిగా సినిమా నిర్మాణంలోకి అడుగుపెట్టాను. దర్శకులు బాబ్జీ చెప్పిన కథలో ఉన్న సమాజానికి, దేశానికి ఉపయోగపడే గొప్ప సందేశం నచ్చి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాను. అందరి సహకారంతో ఈ చిత్రాన్ని సింగిల్ షెడ్యూల్లో పూర్తి చేస్తున్నాం' అని నిర్మాత బెల్లి జనార్ధన్ చెప్పారు. అఖిల్ సన్నీ, అజయ్ ఘోష్, సంజయ్ నాయర్, గిడ్డేష్, హనుమా, బాబూరాం, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన , దర్శకత్వం : బాబ్జీ, నిర్మాత : బెల్లి జనార్ధన్, నిర్మాణ నిర్వహణ : ఎస్ .సుబ్బరాయుడు, కెమెరా : కొండపల్లి నళినీకాంత్, సంగీతం : గజ్వేల్ వేణు, ఎడిటర్ : శివ శర్వాణి, ఫైట్స్ : సింధూరం సతీష్, డాన్స్ : వేణు రాక్.



నేటి యువతరం ప్రేమకున్న అర్థాన్ని మార్చేస్తున్నారు. తమ అవసరాలు తీర్చుకునే ఓ సంబంధంగా ప్రేమను వాడుకుంటున్నారు. ఇలాంటి వారి వల్ల ప్రేమ విలువ దిగజారిపోతోంది. ప్రేమంటే కొందరికైతే మ్యూచవల్ బెనిఫిట్స్ స్కీమ్‌లా మారిపోయింది. అమ్మాయి ఓ అబ్బాయి కావాలని, అబ్బాయి ఓ అమ్మాయి కావాలని కోరుకుంటున్నారే తప్ప, ఒకరినొకరు అర్థం చేసుకొని జీవితాంతం కలిసి బతకాలనే ఆలోచన చాలా తక్కువ మందిలో ఉంటుంది. మరికొందరు తమ మానసిక, సామాజిక, ఆర్థిక అవసరాలు తీర్చుకోడానికి ప్రేమ అనే పదాన్ని ఉపయోగించుకుంటున్నారు. అలాంటి కథనమే ఈ వారం ఐద్వా అదాలత్...

ఐద్వా అదాలత్

అవసరం కోసమే ప్రేమా..?

రాహుల్‌కు 28 ఏండ్లు ఉంటాయి. మంచి ఉద్యోగం. అమ్మ, నాన్న, అక్క ఉన్నారు. కాలేజీ రోజుల్లోనే పల్లవితో ప్రేమలో పడ్డాడు. పల్లవి కూడా రాహుల్‌ను ప్రేమిస్తున్నాననే చెప్పింది. ఇద్దరు కాలేజ్ చదువు పూర్తి చేశారు. పల్లవి ఒక్కతే కూతురు. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్తులే. పిల్లవికి ఎలాంటి లోటు లేకుండా పెంచారు. పల్లవి, రాహుల్ ప్రేమ గురించి కాలేజ్‌లో అందరూ మాట్లాడుకునేవారు. ప్రేమికులంటే వారిలా ఉండాలి అనుకునే వారు. ఒకరి ఇంటికి ఒకరు వచ్చి వెళ్ళేవారు.

రాహుల్ వాళ్ళ కుటుంబ సభ్యులకు పల్లవి బాగా నచ్చింది. ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చిన తర్వాత పెండ్లి చేద్దామనుకున్నారు. పల్లవి తనకు ఏ చిన్న అవసరం వచ్చినా రాహుల్‌కు ఫోన్ చేసేది. అది ఏ సమయం అయినా సరే క్షణాల్లో వచ్చి చూసుకునేవాడు. ఎప్పుడు కావాలంటే అప్పుడు షాపింగ్‌కి తీసుకెళ్ళేవాడు. ఐస్ క్రీమ్‌లు తినడానికి అర్థరాత్రి ఇద్దరూ కలిసి వెళ్ళేవారు. ఇలా ఎక్కడికంటే అక్కడకు రాహుల్‌ను తీసుకొని వెళ్ళేది. ప్రేమించే అమ్మాయిని ఎవరైనా రాహుల్‌లా చూసుకోవాలి అనుకునే వారు అందరూ. అయితే కాలేజీలో చదువుకునే వరకు ఇద్దరూ ఇలా ప్రేమగానే ఉన్నారు.

ఉద్యోగంలో చేరిన తర్వాత పల్లవి పిలిచిన ప్రతి సారి బయటకు వెళ్లడానికి రాహుల్‌కి కుదిరేది కాదు. కొన్ని సార్లు పై అధికారుల నుండి నోటీసులు కూడా అందుకున్నాడు. ఆ విషయం పల్లవికి చెప్పినా ఆమె అర్థం చేసుకునేది కాదు. 'నీకు నా కంటే ఉద్యోగం ఎక్కువై పోయింది' అనేది. ఇలా వీరి ప్రేమకు ఐదేండ్లు నిండాయి. ఇద్దరూ బాగా దగ్గరయ్యారు. రాహుల్ ఒక మంచి రోజు చూసుకుని పల్లవి దగ్గర పెండ్లి ప్రస్తావన తెచ్చాడు. దానికి పల్లవి ఒప్పుకోలేదు. పైగా 'రాహుల్ నేను నిన్ను పెండ్లి చేసుకోవడం ఏమిటి, నాకు అలాంటి ఉద్దేశం లేదు. నీవు వేరే అమ్మాయిని చూసి పెండ్లి చేసుకో' అని చెప్పింది. పల్లవి సమాధానం విని రాహుల్‌కి ఏం చేయాలో తోచలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చాడు.

మేము పల్లవిని పిలిపించి మాట్లాడితే 'నేను గతంలో రాహుల్‌ని ప్రేమించిన మాట నిజమే. కానీ అతన్ని పెండ్లి చేసుకోవాలని ఎప్పుడూ అనుకోలేదు. అతనికి అలాంటి ఫీలింగ్ ఉంటే దానికి నేనేం చేయలేను. అతను, అతని కుటుంబ సభ్యులు నాతో మామూలుగా ఉంటూనే సడన్‌గా పెండ్లి అంటే ఎలా..? నేను ఎప్పుడూ రాహుల్‌ను అలా ఊహించుకోలేదు. కాలేజీలో కలిసి తిరగడానికి ఒకరు కావాలి కాబట్టి రాహుల్‌తో క్లోజ్‌గా ఉన్నాను. నేను ఎప్పుడు పిలిస్తే అప్పుడు రాహుల్ వస్తాడు. నేను ఎక్కడికి తీసుకెళ్లమంటే అక్కడికి తీసుకెళతాడు. నాకు రాహుల్‌పై పూర్తి నమ్మకం వుంది కాబట్టి ఏమాత్రం ఆలోచించకుండా అతనితో ఎక్కడికైనా వెళ్ళేదాన్ని' అంది.

'మరి ఇద్దరూ శరీరకంగా ఒక్కటయ్యారు, మరి దాని గురించి ఏమంటావు' అన్నాము. 'అది అనుకోకుండా జరిగిపోయింది. దాని కోసం ఇప్పుడు రాహుల్ నన్ను పెండ్లి చేసుకోవాలి అనుకోవడం ఎంత వరకు సరైనది. ఎన్ని చెప్పినా నేను మాత్రం అతన్ని పెండ్లి చేసుకోవడం జరిగే పని కాదు. ప్రేమ పేరు చెబితే ఎలాంటి అడ్డంకులు చెప్పకుండా నా వెనక తిరిగే ఒక అబ్బాయి కోసం నేను చూశాను. అది రాహుల్ అయ్యాడు. ఇప్పటికీ నేనే కావాలంటే నేను చెప్పినట్టు విని నేను ఎప్పుడు పిలిస్తే అప్పుడు ఎలాంటి రీజన్ చెప్పకుండా వస్తే కనీసం అతనితో మాట్లాడతాను. అలా కాకుండా ప్రేమ, పెండ్లి అంటూ వేదిస్తే మాత్రం బాగుండదు' అంది.

రాహుల్ 'పల్లవి లేకుండా నేను ఉండలేను. ఆమె నాకు కావాలి. నేను ఆమె కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను' అన్నాడు. దానికి మేము 'నువ్వు ప్రేమించాను, తను లేకపోతే ఉండలేను అంటున్నావు. తనేమో పెండ్లి చేసుకోనంటుంది. అనసరంగా ఆమె వెనకబడి నువ్వు ఇబ్బంది పడకు. తను అంత ఓపెన్‌గా తన అవసరాల కోసమే నిన్ను ప్రేమించానని చెబుతుంది. ఇంకా నువ్వు అర్థం చేసుకోకుండా తననే పెండ్లి చేసుకుంటాను అంటున్నావు. ఆమెకు నీపైన ప్రేమ లేదు. బలవంతంగా పెండ్లి ఎలా చేసుకుంటావు. ఇకపై ఆమెకు దూరంగా ఉంటే నీకే మంచిది. ఆమెకు కేటాయించే సమయం నీ కుటుంబానికి, స్నేహితులకు కేటాయించు. మెల్లమెల్లగా ఆమెను మర్చిపోవడానికి ప్రయత్నించు. లేదంటే నష్టపోయేది నువ్వే.




మొత్తం విన్న తర్వాత కూడా రాహుల్ 'పల్లవి లేకుండా నేను ఉండలేను. ఆమె నాకు కావాలి. నేను ఆమె కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను' అన్నాడు. దానికి మేము 'నువ్వు ప్రేమించాను, తను లేకపోతే ఉండలేను అంటున్నావు. తనేమో పెండ్లి చేసుకోనంటుంది. అనసరంగా ఆమె వెనకబడి నువ్వు ఇబ్బంది పడకు. తను అంత ఓపెన్‌గా తన అవసరాల కోసమే నిన్ను ప్రేమించానని చెబుతుంది. ఇంకా నువ్వు అర్థం చేసుకోకుండా తననే పెండ్లి చేసుకుంటాను అంటున్నావు. ఆమెకు నీపైన ప్రేమ లేదు. బలవంతంగా పెండ్లి ఎలా చేసుకుంటావు. ఇకపై ఆమెకు దూరంగా ఉంటే నీకే మంచిది. ఆమెకు కేటాయించే సమయం నీ కుటుంబానికి, స్నేహితులకు కేటాయించు. మెల్లమెల్లగా ఆమెను మర్చిపోవడానికి ప్రయత్నించు. లేదంటే నష్టపోయేది నువ్వే. నీలాంటి మంచి వ్యక్తిని పల్లవి మిస్ చేసుకుంటుంది. కచ్చితంగా నీ జీవితంలోకి ఓ మంచి అమ్మాయి వస్తుంది' అంటూ సుమారు నాలుగు వారాలపాటు అతనికి ఎంతో సర్ది చెప్పారు.

చివరకు రాహుల్ మేము చెప్పిన దానికి అంగీకరించి 'సరే మేడమ్, మీరు నా గురించి, నా భవిష్యత్ గురించి ఇంతగా ఆలోచించి చెబుతున్నారు. మీ మాట వింటాను. మీరు చెప్పినట్టే చేస్తాను. పల్లవిని మర్చిపోవడానికి ప్రయత్నిస్తాను. నా ఉద్యోగం, కెరీర్‌పై దృష్టిపెడతాను. ఇన్ని రోజులు పల్లవి వెంట తిరుగుతూ నా కుటుంబాన్ని, స్నేహితులను దూరం పెట్టాను. ఇకపై వాళ్ళతో గడపుతాను' అని చెప్పి వెళ్ళిపోయాడు.

- వై. వరలక్ష్మి
9948794051

మహిళల్లో రుతుచక్రం ఆగిపోయిన తర్వాతి దశ మెనోపాజ్. చివరిసారి పీరియడ్స్ వచ్చిన ఏడాది తర్వాత మెనోపాజ్‌ను నిర్ధారిస్తారు. బరువు పెరగడం, తలనొప్పి, యోని పొడిబారడం, మూడ్ స్వింగ్స్, ఏకాగ్రత సాధించలేక పోవడం వంటి సమస్యలు ఈ దశలో ఎదురవుతాయి. వయసు పెరుగుతున్నా కొద్దీ మహిళల్లో ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయిలు క్షీణిస్తాయి. ఇది ఇతర హార్మోన్లపై కూడా ప్రభావం చూపుతుంది. ఇది జీవక్రియ, ఎముక సాంద్రత, కొలెస్ట్రాల్ స్థాయిలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇలాంటి అనారోగ్యాలకు దూరంగా ఉండటానికి మహిళలు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. రుతుక్రమం ఆగిన తర్వాత ఎదురయ్యే ఇలాంటి సమస్యలను సహజ మార్గాల ద్వారా కూడా పరిష్కరించుకోవచ్చు. కొన్ని రకాల ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మెనోపాజ్ సమస్యలకు దూరంగా ఉండవచ్చు.



సహజ మార్గాల ద్వారానే...

పండ్లు, కూరగాయలు : పండ్లు, కూరగాయల ద్వారా విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు శరీరానికి సమృద్ధిగా అందుతాయి. క్యాబేజీ, బ్రకోలీ, బ్రుస్సెల్స్ మొలకలు వంటివి ఈస్ట్రోజెన్ హార్మోన్‌పై మంచి ప్రభావం చూపుతాయి. ఇవి మెనోపాజ్ లక్షణాలను తగ్గించడానికి సహాయపడతాయి. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ వంటి ముదురు బెర్రీలు రక్తపోటును తగ్గిస్తాయి. అందువల్ల కాలానుగుణంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను క్రమం తప్పకుండా ఆహారంలో తీసుకోవాలి.

కాల్షియం, విటమిన్ డి : హార్మోన్ల మార్పుల వల్ల ఎముకలు బలహీనంగా మారతాయి. ఎముకల సాంద్రత కూడా తగ్గుతుంది. ఇలాంటి సమస్యల నివారణకు కాల్షియం, విటమిన్ డి లభించే ఆహారం తీసుకోవాలి. వీటి వల్ల ఆస్టియోపోరోసిస్ వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు. పెరుగు, పాలు, జున్ను, ఆకుకూరలు, బీన్స్ వంటి ఆహార పదార్థాల ద్వారా ఈ పోషకాలు శరీరానికి అందుతాయి. విటమిన్ డి కోసం రోజూ ఉదయం ఎండలో 15 నుంచి 20 నిమిషాలు నిల్చోవాలి.

ఫైటో ఈస్ట్రోజెన్ : ఈస్ట్రోజెన్ హార్మోన్‌ను ప్రేరేపించేందుకు ఫైటో ఈస్ట్రోజెన్లు సహజంగా లభించే ఆహారాన్ని తీసుకోవాలి. ఇవి కొన్ని రకాల మొక్కల్లో సహజంగా లభిస్తాయి. ఇవి హార్మోన్ల అసమతుల్యతను నిరోధిస్తాయి. సోయాబీన్స్, టోఫు, అవిసె గింజలు, నువ్వులు, బీన్స్‌లో ఫైటో ఈస్ట్రోజెన్‌లు సమృద్ధిగా ఉంటాయి.

ప్రోటీన్లు : ప్రోటీన్ ఎక్కువగా తీసుకునే వారిలో వయసుతో పాటు ఎదురయ్యే కండరాల సమస్యలకు దూరంగా ఉండవచ్చు. ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల ఆకలి త్వరగా వేయదు. అందువల్ల తక్కువ కేలరీలను తీసుకుంటారు. చిక్కుళ్ళు, నట్స్, సోయా, గుడ్లు, మాంసం, చేపలు ప్రోటీన్లకు వనరులుగా ఉంటాయి.

తగినంత నీరు : పొడిబారడం అనేది మెనోపాజ్‌లో ఎదురయ్యే సాధారణ సమస్య. ఈస్ట్రోజెన్ స్థాయిలు పడిపోవడం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. అందువల్ల రోజూ రెండు నుంచి మూడు లీటర్ల నీరు తాగాలి. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి. హార్మోన్ల అసమతుల్యత వల్ల వచ్చే ఉబ్బరం వంటి సమస్యలను మంచినీరు తగ్గిస్తుంది.

ఆరు రోజులు బ్యాంకుల్లో ఆందోళనలు

న్యూఢిల్లీ : ప్రభుత్వ, ప్రయివేటు రంగ బ్యాంక్‌ల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిని నిలిపివేయాలని, తగినన్ని శాశ్వత నియామకాలు చేపట్టాలని ఏఐబీఈఏ డిమాండ్ చేస్తోంది. ఇందుకోసం డిసెంబర్ 4-11వ తేదిల్లో ఆరు రోజుల పాటు దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని బ్యాంక్‌ల్లో సమ్మెకు పిలుపునిస్తున్నామని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం తెలిపారు. వివిధ తేదిల్లో ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంక్ ఉద్యోగులు పాల్గొంటారని అన్నారు. డిసెంబర్ 4న పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌ల ఉద్యోగులు దేశవ్యాప్త సమ్మెలో పాల్గొననున్నారు. డిసెంబర్ 5న బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియాలో, డిసెంబర్ 6న కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్‌లలో, డిసెంబర్ 7న ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్‌లలో, డిసెంబర్ 8న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఉద్యోగులు దేశవ్యాప్తంగా నిరసనల్లో పాల్గొంటారని వెంకటాచలం తెలిపారు. డిసెంబర్ 11న ప్రయివేటు బ్యాంక్‌ల్లో అఖిల భారత సమ్మె జరగనుందన్నారు. కొన్ని బ్యాంకులు ఉద్యోగాలను అవుట్‌సోర్సింగ్ చేయడం వల్ల దిగువ స్థాయిలో నియామకాలు తగ్గడమే కాకుండా ఖాతాదారుల గోప్యత, వారి డబ్బు ప్రమాదంలో పడుతుందని వెంకటాచలం ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా కొన్ని బ్యాంకులు పారిశ్రామిక వివాదాల (సవరణ) చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయన్నారు. లేబర్ అధికారులు జోక్యం చేసుకున్నప్పటికీ, యాజమాన్యం వారి సలహాను పట్టించుకోవడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులను బలవంతంగా బదిలీ చేస్తున్నాయన్నారు.



బీజేపీని కూకటివేళ్లతో పెకిలిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

యుద్ధమని, కాంగ్రెస్ తుఫాన్‌లో కేసీఆర్ గల్లంతు కాక తప్పదన్నారు. హస్తం ముందు బీఆర్ఎస్ కనిపించకుండా పోతుందన్నారు. కేసీఆర్ దోచుకున్న కోట్ల సొమ్ము అంతా పేదలకు పంచుతామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలపై తొలి సంతకం చేస్తామని చెప్పారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, వరంగల్ జిల్లా నర్సంపేట, వరంగల్‌లో రోడ్డు షోలు నిర్వహించారు. జైపూర్ నుంచి విమానంలో ఏపీలోని గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన రాహుల్ గాంధీ అక్కడి నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో మణుగూరుకు చేరుకున్నారు.

మణుగూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన సభకు జనం భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ అబద్ధపు మాటలు మాట్లాడి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం అన్నదమ్ముళ్ల వలే కలిసి రాష్ట్రంలో పనిచేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో ఇందిరా, రాజీవ్ గాంధీ చేసిన అభివృద్ధి కనబడుతుందని, బీఆర్ఎస్ చేసిందేమీ లేదన్నారు. మద్యం, మైన్స్ అధికంగా డబ్బులు వచ్చే 4 శాఖలను కేసీఆర్ తన దగ్గర ఉంచుకొని దోపిడీకి పాల్పడ్డారని, కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల లక్ష కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారని విమర్శించారు. ధరణి పేరుతో రూ.20 లక్షల రైతుల భూములను రాష్ట్ర ప్రభుత్వం లాక్కున్నదన్నారు. కేసీఆర్ ఇంట్లో 24 గంటల కరెంటు వస్తుందేమో కానీ, ప్రజలకు రావడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మెన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. 2018లో కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన రేగా కాంతారావు బీఆర్ఎస్ పార్టీలో చేరి, పార్టీ ఆఫీసును కూడా ఆక్రమించారని మండిపడ్డారు. కబ్జాలు చేసే రేగా కావాలా.. అభివృద్ధి చేసే పాయం కావాలో ప్రజలు ఆలోచించాలన్నారు.

ఆరు గ్యారంటీలపై తొలి సంతకం

వరంగల్, నర్సంపేట నియోజకవర్గాల్లో నిర్వహించిన సభల్లో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. 6 గ్యారంటీ పథకాల మీదనే తొలి సంతకం పెట్టిస్తా అని తెలిపారు. కాంగ్రెస్‌కు, ముఖ్యంగా ఇందిరా, సోనియా గాంధీలకు తెలంగాణతో.. రాజకీయ సంబంధంతో పాటు కుటుంబ సంబంధం ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటులో ఎన్నో సమస్యలు వచ్చినా సోనియా గాంధీ నిర్ణయం తీసుకొని రాష్ట్రాన్ని ఇస్తే.. దాన్ని కేసీఆర్ కుటుంబం దోచుకుంటుందని విమర్శించారు. దళిత బంధు పథకంలో ఎమ్మెల్యేలు రూ.3 లక్షలు వసూళ్లు చేయడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్, బీజేపీ స్కీములతో కొంతమందికే లాభం చేకూరుతుందని, మోడీ అదానికి లాభం చేకూరుస్తున్నారన్నారు. భారత్ జోడోయాత్ర సమయంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రజలను ఏ విధంగా విభజిస్తున్నయో అర్థమైందన్నారు. ఇది విద్వేషాలు రగిలించే దేశం కాదని, ప్రేమను పంచే దేశమని తెలిపారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికీ తన కండ్లలో మెదలాడుతుందంటూ భావోద్వేగానికి గురయ్యారు. రాష్ట్రం వచ్చిన తొలినాళ్లలో నిపుణులతో నాలుగు నెలలు సుదీర్ఘంగా చర్చించి రాష్ట్ర ప్రగతికి బలమైన పునాదులు వేసుకున్నామని తెలిపారు. ఇప్పుడు 24గంటల కరెంటు, సాగు, తాగునీరు అందిస్తూ.. ఎటు చూసినా పచ్చని పైర్లతో తెలంగాణను సస్యశ్యామలం చేసుకున్నామని తెలిపారు. ధరణితో రైతులకు పైరవీకారుల, దళారుల బెడద తప్పిందన్నారు. ధరణి రికార్డుల ఆధారంగా పైసాపొల్లుపోకుండా ఎకరాకు రూ.10వేలు రైతుబంధు వేస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో రూ.16వేలు చేస్తామని హామీ ఇచ్చారు. చనిపోయిన ప్రతి రైతు కుటుంబానికీ రూ.5లక్షల సాయం పారదర్శకంగా అందించగలుగుతున్నామని వివరించారు. ప్రతి గింజను కొని ఐదారు రోజుల్లోనే నేరుగా రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. ఇదంతా కండ్ల ముందు కనిపిస్తున్న సత్యాలని అన్నారు. అలాంటిది కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని బంగాళఖాతంలో కలుపుతామని, దాన్ని స్థానంలో భూమాత పేరుతో కొత్తది తీసుకొస్తామని చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. అటు బీజేపీ కూడా రాష్ట్ర ప్రగతి గురించి మాట్లాడకుండా మతపిచ్చితో పబ్బం గడుపుకోవాలని చూస్తోందన్నారు. కేంద్రంలోని నరేంద్రమోడీ రాష్ట్రానికి ఏమీ ఇవ్వకుండా మొండి చేయే చూపిందన్నారు. 50ఏండ్ల కాంగ్రెస్‌పాలనలో చూసిన దారిద్ర్యం, బీజేపీ వ్యవహరిస్తున్న తీరును గుర్తు చేసుకుంటూ ఈ పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ చూసిన ప్రగతిని ప్రతి గ్రామంలోనూ చర్చించుకోవాలని కోరారు.


తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్సే

పరకాలలో జరిగిన సభలో కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతానికి ద్రోహం చేసింది కాంగ్రెస్సేనని, ప్రజలు ఈ విషయం గమనించాలని కోరారు. 2004లో తమతో పొత్తుపెట్టుకొని రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం మళ్లీ తెలంగాణకు కాంగ్రెస్ ద్రోహం చేసిందన్నారు. కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో నేను ఆమరణ దీక్షకు దిగితేనే తెలంగాణ వచ్చిందన్నారు. కంటి వెలుగు ద్వారా రాష్ట్రంలో 3 కోట్ల మందికి కంటి పరీక్షలు చేయించి 80 లక్షల మందికి కంటి అద్దాలు ఇచ్చామని తెలిపారు. రైతు బంధు రూ.16వేలు పెంచే బీఆర్ఎస్ కావాలా? రైతు బంధు తీసేసే కాంగ్రెస్ కావాలా? ప్రజలు ఆలోచన చేయాలన్నారు. పరకాలలో అడిషనల్ కోర్టును పెట్టించే ప్రయత్నం చేస్తామన్నారు. పరకాల అభివృద్ధి కావాలంటే చల్ల ధర్మారెడ్డిని గెలిపించాలన్నారు.

పోరాడే పార్టీకే ఓటెయ్యాలి

నవతెలంగాణ-సిటీబ్యూరో

పోరాటాలు చేసే సీపీఐ(ఎం)కి ఓటు వేస్తే.. రేపు గల్లబట్టి నిలదీసి సమస్యలు పరిష్కరించుకోవచ్చని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు తెలిపారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తూ ప్రజలకు అండగా ఉంటున్న సీపీఐ(ఎం) అభ్యర్థి ఎం. దశరథ్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్ ముషీరాబాద్‌లోని కవాడిగూడ డివిజన్ భీమా మైదానం బస్తీలో పాదయాత్ర నిర్వహించిన ఆపార్టీ అభ్యర్థి దశరథ్‌కు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గంలో నాలుగు ప్రధాన పార్టీలు పోటీలో ఉన్నాయని, మీరంతా డబ్బులు తీసుకొని ఓట్లు వేస్తారనే ఆలోచనతో వారంతా డబ్బులను నమ్ముకున్నారని, గెలిచిన తర్వాత ఖర్చు పెట్టిన డబ్బులు సంపాదించుకునే పనిలోనే ఉంటారు తప్పితే.. ప్రజల సమస్యలు పట్టించుకోరని తెలిపారు. అదే.. సీపీఐ(ఎం)కి వేసే ప్రతి ఓటు ఒక పోరాట ఆయుధమవుతుందని అన్నారు. మతోన్మాద బీజేపీ కేంద్రంలో మతం పేరుతో ఓట్లు సంపాదించే ప్రయత్నం చేస్తుందన్నారు. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారి ప్రజల పక్షాన ఉన్నామంటూ ప్రజలను మభ్యపెడుతూ మతోన్మాద పార్టీకి మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. కేంద్రంలో మోడీ అయినా రాష్ట్రంలో కేసీఆర్ అయినా ప్రజల సమస్యలు పక్కనపెట్టి వాళ్ళ ఆస్తులు కాపాడుకోవడంలో ముందుంటారన్నారు. భీమ మైదానంలో ఇండ్లు కూలిపోతున్నా ఇక్కడ గెలిచిన ముఠాగోపాల్ ఇప్పటివరకు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. రోడ్ల సమస్య, కుట్టు మిషన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సమస్యలతోపాటు రేషన్ కార్డుల సమస్యలపై సీపీఐ(ఎం) నాయకత్వంలో నిరంతరం



పోరాటం చేసి సాధించుకున్నామని గుర్తు చేశారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) అభ్యర్థి ఎం.దశరథ్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింగరావు, రాష్ట్ర నాయకులు అరుణ జ్యోతి, పార్టీ నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. వెంకటేష్, నాగలక్ష్మి జిల్లా కమిటీ సభ్యులు విమల, సి.మల్లేష్, జి.కిరణ్, మారన్న ఆర్. వెంకటేష్, బస్తీ వాసులు మణెమ్మ, ఎల్లయ్య మల్లేష్, సైదులు, లక్ష్మయ్య సోమ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నల కొడవళ్లు ఈ పాటలు

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి లోపించిందని వాపోయారు. రాజ్యాంగపరంగా కొన్ని బిల్లులను ప్రవేశపెట్టాలి, ఆమోదించుకోవాలి కాబట్టి శాసనసభ సమావేశాలు పెడుతున్నట్టు ఉందన్నారు. రాజ్యాంగ నిర్దేశాలే లేకుంటే ఈ మాత్రం కూడా సభలను పెట్టేవారు కాదని విమర్శించారు. ఒకప్పుడు 30-40 రోజులు జరిగే బడ్జెట్ సమావేశాలను ఇప్పుడు నాలుగైదు రోజుల్లోనే ముగించేస్తున్న తీరును ఎత్తిచూపారు. ఇలాంటి పరిస్థితి పోవాలన్నా, ప్రజా సమస్యలపై గళం విప్పాలన్నా శాసనసభకు కమ్యూనిస్టులను గెలిపించి పంపాలని ప్రజలను కోరారు. ప్రజా సమస్యలపై పోరాడటంతో ఎర్రజెండానే ముందుంటుందనీ, ఎవ్వరు పోరాడినా వారికి అండగా ఉండేది ఆ జెండానే అని చెప్పారు. కమ్యూనిస్టేతర పార్టీలు ప్రజాసమస్యలపై పోరాడిందీ లేదనీ, పోరాడుతున్న పేదలకు అండగా నిలిచిందీ లేదని అన్నారు. ఇలాంటి విషయాలను సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రజానాట్యమండలి పాటల సీడీని తేవడం మంచి పరిణామమనీ, ఆ పాటలు ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రత్యేకతను సంతరించుకున్నాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థుల సుత్తీకొడవలి నక్షత్రం గుర్తుపై ఓటేసి ప్రజలు గెలిపించాలని పిలుపునిచ్చారు.

అదానీ మెడకు ఉచ్చు..!

(మొదటిపేజీ తరువాయి)

అధికారులను రాయిటర్స్ సంప్రదించగా స్పందించలేదు.

అదానీ గ్రూప్ ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకునే బొగ్గును.. అక్కడి ఎగుమతి విలువ కంటే భారీగా పెంచి చూపిస్తోంది. దీని వల్ల దేశంలో విద్యుత్ చార్జీలు సహా ఇతర ఇంధన భారాలు పెరగడానికి కారణం అయ్యింది. సింగపూర్ అధికారుల నుంచి భారతదేశం కోరుతున్న సాక్ష్యం, అందులో అదానీకి చెందిన 20 బ్యాంకుల లావాదేవీల పత్రాలు ఉన్నాయి. డీఆర్ఐ తాజా అభ్యర్థనను సుప్రీం కోర్ట్ అనుమతించినట్లయితే.. ఆ వివరాలను విడుదల చేయడానికి సింగపూర్ కోర్ట్ ఆఫ్ అప్పీల్ నుండి ఆర్డర్ పొందవలసి ఉంటుంది. అదానీ గ్రూపు ఆర్థిక అక్రమాలపై ఈ ఏడాది జనవరిలో అమెరికన్ సంస్థ హిండెన్‌బర్గ్ విడుదల చేసిన రిపోర్ట్ గౌతం అదానిపై విస్తృత చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. ఈ అరోపణలపై కూడా సుప్రీంకోర్టు విచారిస్తోంది. మరోవైపు అదానీ, మోడీ స్నేహంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ అంశంలో ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలనపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి.

మిథిలీ తుఫాన్ ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

గంటకు 70-80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించింది. ప్రస్తుతం ఖేపుపరాకు ఆగ్నేయంగా 110 కిలోమీటర్ల దూరంలో ఉందని ఐఎండీ తెలిపింది. ఈ తుఫానుకు మిథిలీ అనే పేరును మాల్దీవులు పెట్టింది. ఈ తుఫాన్ భారతదేశంపై పెద్దగా ప్రభావం చూపించే అవకాశం లేదు. అయినా ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు హై అలర్ట్‌లో ఉన్నాయి. త్రిపుర, మిజోరాం రాష్ట్రాల్లో ఈ రోజు రాత్రి అతిభారీ వర్షాలు కురుస్తాయని, రెడ్ అలర్ట్ ప్రకటించింది. మణిపూర్, నాగాలాండ్, దక్షిణ అసోం, మేఘాలయలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. తుఫాన్ ప్రభావం వల్ల ఒడిశా, బెంగాల్ రాష్ట్రాల్లోని తీర ప్రాంత జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి. ఒడిశాలోని కేంద్రపారా, జగత్ సింగ్ పూర్ వంటి తీరప్రాంత జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. బెంగాల్‌లోని పుర్బా మేదినీపూర్, దక్షిణ 24 పరగణ, ఉత్తర 24 పరగణ జిల్లాల్లో శుక్రవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని సూచనలు జారీ చేసింది. బెంగాల్ తీరం చుట్టూ గాలుల వేగం గంటకు 50 కి.మీ నుంచి 70 కి.మీ వరకు ఉంటుందని తెలిపింది. నెల రోజుల వ్యవధిలో బంగాళాఖాతంలో ఏర్పడిన రెండో తుఫాన్ ఇది. అక్టోబర్ 21న 'హమూన్' తుఫాన్ ఏర్పడింది. ఇది కూడా బంగ్లాదేశ్ తీరాన్ని తాకింది.

తెలంగాణ టూరిజం ఎండీ మనోహర్ సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పర్యాటక ముఖ్య కార్యదర్శిని ఈసీ ఆదేశించింది.ఈ మొత్తం వ్యవహారంలో తీసుకున్న చర్యలపై ఈ నెల 19 లోపు నివేదిక ఇవ్వాలని సూచించింది. అధికారులు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

కోల్‌బెల్ట్ రూ(ఓ)టు ఎటు?



మాట్లాడుతున్న పుణ్యవతి

అవకాశవాదులకు ఓటు అడిగే హక్కు లేదు

జాతీయ నాయకులు ఎస్.పుణ్యవతి

వైరాలో సీపీఐ(ఎం) ప్రచారం

నవతెలంగాణ-ఏన్కూర్

అవకాశవాదులకు, పార్టీల ఫిరాయింపుదారులకు ప్రజల ఓట్లు అడిగే హక్కు లేదని సీపీఐ(ఎం) జాతీయ నాయకురాలు ఎస్.పుణ్యవతి అన్నారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండల పరిధిలోని జన్నారం గ్రామంలో శుక్రవారం వైరా నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి భూక్య వీరభద్రంతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేగళ్ల తిరుమలరావు అధ్యక్షతన జరిగిన సభలో పుణ్యవతి మాట్లాడుతూ.. ఈనెల 30న రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఈ ఎన్నికల్లో అవకాశవాదులకు, ఫిరాయింపుదారులకు బుద్ధి చెప్పాలని కోరారు. ప్రజల కోసం నిర్బంధాలు ఎదుర్కొని, జైలు శిక్షణ అనుభవించిన భూక్యా వీరభద్రంను గెలిపించాలని, సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి చేశారని చెబుతున్న సీఎం కేసీఆర్ గ్రామాల్లో పర్యటిస్తే ఏం అభివృద్ధి చేశారో తెలుస్తుందన్నారు. మరోవైపు గ్యారంటీ లేని పథకాల పేరుతో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి, ప్రజలకు అందుబాటులో ఉంటున్న సీపీఐ(ఎం)ను గెలిపించి.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం ఏన్కూర్, టీఎల్ పేట, కేసుపల్లి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు.

ఆయా గ్రామాల్లో సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు, మహిళలు ప్రచార బృందానికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, నాయకులు మెరుగు సత్యనారాయణ, దొంతబోయిన నాగేశ్వరరావు, బాలాజీ, వేల్పుల రాములు, ఇటుకల లెనిన్, గుడ్ల వెంకటేశ్వరరావు, స్వర్ణ కృష్ణారావు, అడప రామారావు, ఐద్వా రాష్ట్ర నాయకురాలు మెరుగు రమణ పాల్గొన్నారు.

తెలంగాణలో ప్రధాన ఆదాయ వనరు, దేశానికి వెలుగులు పంచడంలో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కోల్‌బెల్ట్ ప్రాంతం ఎన్నికల్లో కీలకం కానుంది. తెలంగాణలో విస్తరించి ఉన్న సింగరేణి ప్రాంతంపై ఆధారపడి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి పొందుతున్న వారు, కుటుంబ సభ్యులు సుమారు 6 లక్షల మంది వరకు ఉంటారు. వీరు ఈ ప్రాంతం నుంచి పోటీచేసే ప్రతి అభ్యర్థి గెలుపునూ ప్రభావితం చేయనున్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు, చేయాల్సిన అభివృద్ధిపై కార్మిక వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఆరు జిల్లాలు, 12 నియోజకవర్గాల్లో విస్తరణ

- సుమారు ఆరు లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఓటర్లు
- గెలుపోటముల్లో కీలకం
- కార్మిక ఓట్లపై పార్టీల గురి
- నెరవేరని హామీలపై ఓటర్ల అసంతృప్తి
- ప్రమాదంలో సంస్థ మనుగడ



నవతెలంగాణ - కోల్‌సిటీ

తెలంగాణలోని ప్రభుత్వ సంస్థయైన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్'లో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం రెండూ వాటాదారులే. రాష్ట్రంలోని గోదావరి, ప్రాణహిత లోయ ప్రాంతంలో 350 కిలోమీటర్ల విస్తీర్ణంలో బొగ్గు గనులు ఉండటంతో ఈ ప్రాంతాన్ని కోల్‌బెల్ట్ ఏరియాగా పిలుస్తారు.

12 అసెంబ్లీ, 5 పార్లమెంటు..

కొమరంభీం, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం పరిధిలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, ఆసిఫాబాద్, రామగుండం, పెద్దపల్లి, మంథని, భూపాలపల్లి, పినపాక, కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లందు అసెంబ్లీ నియోజకవర్గాలు కోల్ బెల్ట్ ప్రాంతంలో ఉన్నాయి. పార్లమెంట్ పరిధిలో ఆదిలాబాద్, పెద్ద పల్లి, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో సింగరేణి ఓటర్ల ప్రభావం ఉంటుంది. సింగరేణిలో ప్రస్తుతం సుమారు 42 వేల మంది కార్మికులుండగా, 20 వేల మంది వరకు కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. 60 వేల మందికిపైగా రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు. గతంలో 2 లక్షలకు పైగా ఉన్న కార్మికుల సంఖ్య రానురాను తగ్గుతూ 42 వేలకు చేరుకుంది. ఈ నేపథ్యంలో సింగరేణి మనుగడ ప్రమాదంలో పడుతోందని కార్మిక వర్గాల్లో చర్చ నడుస్తోంది.

సన్నగిల్లుతున్న ఉద్యోగావకాశాలు..

అధిక పని గంటలు, యాంత్రీకరణతో సింగరేణిలో ఉద్యోగావకాశాలు తగ్గుతు న్నాయి. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ నియామక ప్రక్రియతో శ్రమ దోపిడీ జరుగుతోంది. రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగుల్లో పింఛను విషయంలో చాలా అసంతృప్తి ఉంది. సుదీర్ఘ కాలంగా వేతన సవరణ అమలు కాకపోవడంతో పాత పింఛన్లే వస్తున్నాయి. కోల్‌మైన్స్ ప్రావి డెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్)లో సమస్యలున్నాయి.

నెరవేరని హామీలు..

ఒక్క రోజు సర్వీస్ మిగిలి ఉన్నవారికి సంబంధించి కూడా కారుణ్య నియామకాలు కల్పిస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నెరవేరలేదు. కొత్త భూగర్భ గనులు ఏర్పాటు చేయించి లక్ష మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి పదేండ్ల కాలంలో ఒక్క గని కూడా ప్రారంభం కాలేదు. డిపెండెంట్ ఉద్యోగాల భర్తీ తేలలేదు. సొంతింటి పథకం కోసం ఎదురు చూస్తున్నారు.

నేతల తలో.. మాటా..

తాము అధికారంలోకి వచ్చాకే సింగరేణి కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు కల్పించామని బీఆర్ఎస్ చెప్తుండగా, సింగరేణిని కాపాడి కార్మికులకు మేలు చేసింది కేంద్రమేనని బీజేపీ నేతలు అంటున్నారు.

కేంద్రంలో మరోసారి తాము అధికారంలోకి వస్తే కార్మికుల చిరకాల డిమాండ్ అయిన ఆదాయ పన్ను మినహాయింపు కూడా సాధ్యం చేయిస్తామని హామీలు ఇస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఇన్‌కం ట్యాక్స్ రూపంలో కార్మికుల నుంచి భారీ మొత్తంలో కేంద్రం దోచుకుంటోందని ఆ పార్టీల నేతలు చెబుతున్నారు.

ప్రయివేటుకు బొగ్గు గనులు

ప్రయివేటు కంపెనీలకు కోల్ మైనింగ్ అవకాశం కల్పించేలా ఈ రంగంలోకి ప్రయివేటు పెట్టుబడులకు అనుమతి ఇవ్వడం వల్ల సింగరేణి సంస్థ మనుగుడకు ప్రమాదమేర్పడుతోంది. దేశంలోని 101 బొగ్గు గనులను వేలానికి పెట్టగా వాటిలో తెలంగాణలోని నాలుగు గనులు ఉన్నాయి. సింగరేణి ప్రాంత గనులు వేలం వేయకుండా సింగరేణికే ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వేలంలోని 14 శాతం డబ్బును ముందస్తుగా కేంద్రానికి చెల్లించే స్తోమత సింగరేణికి లేదని రాష్ట్ర ప్రభుత్వం వాదన. కొత్తగా బొగ్గు బ్లాకులు సింగరేణికి దక్కకపోతే ఉన్న బొగ్గు నిక్షేపాలు 15 ఏండ్లలో ఖాళీ అయిపోయి.. ఆ తర్వాత సంస్థ మూతపడే ప్రమాదం ఉంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి సరైన హామీ లేదు.



ఖచ్చితమైన హామీలు ఇచ్చిన వారికే మద్దతు



కార్మికుల సమస్యల పరిష్కారంపై ఖచ్చితమైన హామీలు ఇచ్చిన వారికే మద్దతు తెలుపుతాం. నిత్యం కార్మికుల కోసం పోరాడే సీపీఐ, సీపీఐ(ఎం) పోటీ చేసే స్థానాల్లో మా మద్దతు ఉంటుంది. సింగరేణి కార్మికులు వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్యం, పిల్లలకు సీబీఎస్ సిలబస్‌తో కూడుకున్న నాణ్యమైన విద్య అందించాలి. డిపెండెంట్ ఉద్యోగుల వయస్సును 35 సంవత్సరాల నుంచి 40కి పెంచాలి. కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి. కార్మికులకు సింగరేణి ప్రాంతంలోని 250 గజాల స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.30 లక్షల రుణ సదుపాయం కల్పించాలి.

- తుమ్మల రాజిరెడ్డి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు

గుర్తింపు సంఘం ఎన్నికలకు నో..

రెండేండ్లకోసారి నిర్వహించాల్సిన గుర్తింపు ఎన్నికలు ఆరేండ్లయినా నిర్వహించలేదు. దీంతో కార్మికుల సమస్యలపై మాట్లాడేందుకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఈ ప్రభావం ఖచ్చితంగా ప్రధాన పార్టీలపై పడనుంది.


ముదిగొండ పత్తిచేనులో కూలీలతో సీపీఐ(ఎం) అభ్యర్థి పాలడుగు భాస్కర్


మిర్యాలగూడలో చాయ్ పోస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి


ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో జనగామ సీపీఐ(ఎం) అభ్యర్థి మోకు కనకారెడ్డి


సూర్యాపేట జిల్లా ఉమ్మడిమేళ్లచెర్వులో కోదాద సీపీఐ(ఎం) అభ్యర్థి మల్లు లక్ష్మీ

బీజేపీ డకౌట్.. కాంగ్రెస్‌కు డిపాజిట్ గల్లంతు

రోడ్‌షోలో మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-మర్కుక్/జగదేవపూర్

ఎన్నికల్లో బీజేపీ డకౌట్ అవుతుంది.. కాంగ్రెస్‌కు డిపాజిట్లు దక్కవని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం మర్కుక్, జగదేవపూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి ప్రసంగించారు. బీఆర్ఎస్‌పై బూతులు మాట్లాడుతున్న వాళ్ళకు 30న పోలింగ్ బూత్‌లలో బీఆర్ఎస్‌కు ఓటు వేసి బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ వాళ్లను గెలిపిస్తే సీఎం కేసీఆర్ హయాంలో వేసిన రోడ్లు, నిర్మించిన భవనాలకు రంగులేయడానికి కూడా పనికిరారని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా అర్హులైన పేద మహిళలకు ప్రతి నెలా రూ.3వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది రైతులకు బీమా పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. కరోనా కష్టకాలంలో మీ వెంట నడిచిన నాయకులు గులాబీ నాయకులని చెప్పారు. ఏ ఒక్క నాయకుడూ ప్రజలను పలకరించిన పాపాన పోలేదని, ఎన్నికలు రాగానే వచ్చి హామీలు ఇవ్వడం సిగ్గుచేటని విమర్శించారు. ఆ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయని పథకాలు తెలంగాణలో ఎలా నెరవేరుస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మెన్ భూంరెడ్డి, డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పంచ్ తంత్రం!



ఏదైన జరిగితే ఏమీలేదనురీతి
పక్కాగ రాసేటి పత్రికలను
ఏవింత లేకున్న హా! వింత ఇది అని
పట్టుబట్టీ రాయు పత్రకార్ల
పార్టీకో పేపరు పనిగట్టుకుని నప్పి
లేనిదీ ఉన్నట్టు లెక్క రాసి
బలిసినోడికి రెండుబాకాల ఎడిషన్లు
క్రమపద్ధతిన రాతలమరజేసి
పట్టుబట్టీ ప్రమాణాల పగులగొట్టి
పత్రికలనెల్ల చెరబట్టీ పాడు చేసి
నిర్వహించాలే నీతుల నీరుగార్చి
అన్న వాడెగా గెలిచేను ఎన్నికలలో

- ఏనుగు నరసింహారెడ్డి

ఢిల్లీ నుంచి ఉద్దెర నాయకులు

- ఎంతమంది వచ్చినా.. జనాన్ని నమ్ముకున్నాం
- ఖానాపూర్, మంచిర్యాల సభల్లో మంత్రి కేటీఆర్
- ప్రధాని మోడీ పచ్చి మోసగాడని వ్యాఖ్య



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, జన్నారం

ఒక వైపు బీజేపీ.. మరో వైపు కాంగ్రెస్.. ఢిల్లీ నుంచి ఉద్దెర నాయకులను తెలంగాణకు తీసుకొచ్చి సీఎం కేసీఆర్ గొంతు నొక్కించే ప్రయత్నాలు చేస్తున్నా యని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఎంత మంది నాయకులు వచ్చినా.. తాము జనాన్ని నమ్ముకొని ముందుకెళ్తున్నామని చెప్పారు. అభివృద్ధి చెందుతున్న ఈ రాష్ట్రాన్ని ఇలాంటి దరిద్రుల చేతిలో పెట్టకూడదని కోరారు. మంచిర్యాల జిల్లా ఖానాపూర్, మంచిర్యాల నియోజకవర్గాల ఎన్నికల సభ శుక్రవారం జన్నారం మండల కేంద్రంలో జరిగింది. అంతకు ముందు మంచిర్యాల జిల్లా కేంద్రంలో కేటీఆర్ రోడ్‌షో నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ.. మంచి ర్యాల, ఖానాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థులు దివాకర్‌రావు, జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వందల మంది బిడ్డల్ని పొట్టన పెట్టుకుంది

కాంగ్రెస్ పార్టీ అని, తెలంగాణ బిడ్డల రక్తం కండ్ల చూసిన కాంగ్రెస్‌కు ఓటేద్దామా అని ప్రశ్నించారు. ఇప్పటికే దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 11సార్లు చాన్స్ ఇచ్చామని, ఈ 55 ఏండ్లలో ఆ పార్టీ ఏం చేసిందని అన్నారు. ప్రజలకు తాగు, సాగునీరు, కరెంటు ఇవ్వలేని కాంగ్రెస్ పార్టీ.. దరిద్రానికి నేస్తమని, అలాంటి పార్టీకి ఓటేసి నెత్తిన పెట్టుకుందామా.. అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రధాని మోడీ పచ్చి గాడని.. జన్‌ధన్ ఖాతాలు తెరిచిన వారికి రూ.15లక్షలు ధన్‌ధన్ వేస్తామని చెప్పి వేయలేదని.. రూ.400 గ్యాస్ సిలిండర్‌ను రూ.1200 చేశారని విమర్శించారు.

సీఆర్ సీఎం అయ్యే వరకు రైతును రాజును చేయాలనే ఆలోచన ఎవరైనా చేశారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీడీ కార్మికులకు తొలిసారి పింఛన్లు ఇస్తున్నా మని, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. తాము మళ్లీ అధికారంలోకి రాగానే కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో ప్రజలు ఎదుర్కొంటున్న ఆంక్షలు ఎత్తి వేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఉట్నూర్ జడ్పీటీసీ చారులత రాథోడ్ బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీ వెంకటేష్‌నేత, ఆదిలాబాద్ జడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్, సీనియర్ నాయకులు రవీందర్‌రావు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, పెంబీ జడ్పీటీసీ జానుబాయి, జన్నారం జడ్పీటీసీ ఎర్ర చంద్రశేకర్, ఎంపీపీ మాదాడి సరోజన పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే పేదలకు న్యాయం

ఇచ్చిన మాటలు బీఆర్ఎస్ నిలబెట్టుకోలేదు : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-కొడంగల్

ఇందిరమ్మ రాజ్యంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందా అనే విషయం ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డి పర్యటించారు. బోంరాస్‌పేట్, దుద్యాల, కొత్తపల్లి మండల కేంద్రాల్లో మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డితో కలిసి కార్నర్ మీటింగ్‌లకు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇండ్ల పట్టాలు, భూముల పట్టాలు



ఇందిరమ్మ రాజ్యంలోనే ఇచ్చామన్నారు. ఈ ప్రాంతంలో రోడ్లు వేసింది తానేనని గుర్తుచేశారు. మహంతిపూర్ వాగు వచ్చిందంటే మనిషికి ఏదైనా కష్టం వచ్చినా దాటలేని పరిస్థితి ఉండేదన్నారు. ముదిరాజులకు కమ్యూనిటీ భవనం, దళితులకు భూములు, పాఠశాల భవనాలు నిర్మించినట్టు తెలిపారు. కేటీఆర్ కోడంగల్‌ను దత్తత తీసుకుంటానని మాట ఇచ్చారని గుర్తు చేశారు. కొడంగల్‌లో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. వికారాబాద్ కృష్ణా రైల్వే లైన్ ఎన్నో రోజుల నుంచి పెండింగ్‌లో ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. బంగారు తెలంగాణ చేశా అని కేసీఆర్ చెప్తున్నాడని ఎవరికైనా మహిళలకు 10 తులాల బంగారం అయినా ఇచ్చాడా అని ప్రశ్నించారు, బంగారు తెలంగాణ కాదు కదా భార్య మెడలో తాళి అమ్ముకునే పరిస్థితి దాపురించిందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. అధికారంలోకి రాగానే మేనిఫెస్టోను తప్పకుండా అమలు చేస్తామన్నారు.


దామోదర రాజనర్సింహా | సిలారపు రాంచందర్

బరిలో అన్నదమ్ములు

ఒకరు కాంగ్రెస్.. మరొకరు బీజేపీ !

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సొంత అన్నదమ్ములు వారిద్దరు. రెండు వేర్వేరు ప్రధాన పార్టీల నుంచి తాజా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపడుతున్నారు. జిల్లా సంగారెడ్డి. కాకపోతే నియోజకవర్గాలు వేర్వేరు. వాళ్లెవరో కాదు.. మాజీ ఉపముఖ్యమంత్రి సిలారపు దామోదర రాజనర్సింహ, సిలారపు రాంచందర్. వీరి తండ్రి సిలారపు రాజనరసింహ ఆందోల్ ఎమ్మెల్యేగా 1967, 1972, 1978లో వరుసగా మూడుసార్లు కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. ఇక దామోదర రాజనర్సింహ 1989, 2004, 2009లో మూడుసార్లు గెలుపొందారు.

ఉమ్మడి రాష్ట్రంలో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఉప ముఖ్యమంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఈసారి కూడా కాంగ్రెస్ తరపున ఇదే నియోజకవర్గం నుంచి ఎన్నికల పోటీలో ఉన్నారు. ఆయన సోదరుడు రాంచందర్ జహిరాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా తొలిసారి ఎన్నికల్లోకి అడుగుపెట్టారు. అన్నదమ్ములిద్దరూ వేర్వేరు పార్టీలు, వేర్వేరు నియోజకవర్గాల నుంచి రంగంలో ఉండటం ఆసక్తిరేపుతున్నది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886